SSR03A 236 C

ప్రజాశక్తి

సైద్ధాంతిక బులెటిన్

అపూర్వ పుస్తక సేకరణ
స్ఫూర్తి : డా॥ వెలగా వెంకటప్పయ్య
అలమూరి విక్రమ్, సజ్జావారి పాలెం,
రేపల్లె. Cell : 9392055065

అప్పు - విశ్వరూపం

సామ్రాజ్యవాదం - 'సామ్రాజ్యం'

అప్పుల ఊబి - అర్జెంటీనా సంక్షోభం

బాబుగారి సిద్ధాంతరహిత సిద్ధాంతం

కరిగిన కల కాదు చెరగని నిజం సోషలిజం

పట్టణ ప్రాంతాల్లో పార్టీ పని - షాంఘై అనుభవం

అపూర్వ పుస్తక సేకరణ
స్ఫూర్తి : డా॥ వెలగా వెంకటప్పయ్య
అలమూరి విక్రమ్, సజ్జావారి పాలెం,
రేపల్లె. Cell : 9392055065

CPI(M)
17th Congress
19-24, March 2002. Hyderabad

జనవరి 2002

వెల. రు.5/-

కష్టజీవి, ఉక్కుమనిషి మావో

ఎడ్గార్‌స్నో

చైనాపై అరుణతార పుస్తకంలో మావో గురించి ఎడ్గార్‌స్నో వివరించిన భాగమిది. మావో నిరాడంబరత, సూక్ష్మగ్రాహ్యత, నాయకత్వ లక్షణాలు, వ్యూహరచనా సామర్థ్యాల గురించి ఆయనమాటల్లోనే....

నేను 1936లో కలుసుకున్నప్పుడు మావోకు వయస్సు 43 సంవత్సరాలు. అఖిల చైనా సోవియట్ రెండో కాంగ్రెస్‌లో ఆయన సోవియట్ కేంద్ర తాత్కాలిక ప్రభుత్వానికి ఛైర్మన్‌గా ఎన్నికయ్యాడు. ఎర్రచట్టాల కింద ఆనాడు నివసిస్తున్న సుమారు 30 లక్షల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ప్రతినిధులు కాంగ్రెస్‌కు హాజరయ్యారు. 1934లో సోవియట్ కేంద్ర ప్రభుత్వం యొక్క ప్రత్యక్ష ఆధిపత్యం కింద వుంటున్న వివిధ జిల్లాల గరిష్ట జనాభా గురించి మావో సే-టుంగ్ వేసిన అంచనాను ఇక్కడ పొందుపరచవచ్చు: కియాంగ్సీ సోవియట్ : 30 లక్షలు : హుపే-ఆన్ హుయీ-హూనాన్ సోవియట్ : 20 లక్షలు, హూనాన్-కియాంగ్సి-హుపే సోవియట్: 10 లక్షలు, కియాంగ్సీ-హూనాన్-సోవియట్: 10 లక్షలు, చెకియాంగ్-పుకీన్ సోవియట్: 10 లక్షలు, హూనాన్-హూపే సోవియట్ : 10 లక్షలు మొత్తం 90 లక్షలు. ఇంతకు పదిరెట్లు సంఖ్య వున్నట్లు విడ్డూరమైన అంకెలు ప్రచారంలో వుంటూండేవి. ఎర్రసైన్యమూ, లేదా ఎర్రసైనికులు కార్యకలాపాలు సాగిస్తున్న ప్రతి ప్రాంతానికి చెందిన జనాభానంతటినీ కలిపి కూడినందువల్ల అటువంటి అతిశయోక్తితో కూడిన అంకెలు వచ్చాయనేది స్పష్టం. చైనా సోవియట్ల కింద "8 కోట్ల" ప్రజలు నివసిస్తున్నారట గదా అని నేనడిగితే మావో నవ్వి అంత పెద్ద ప్రాంతమే గనుక సాధించబడినట్లయితే, విప్లవం దాదాపు జయించబడినట్లేనని అన్నారు. అయితే ఎర్రపాక్షిక సైనికులు కార్యకలాపాలు సాగించే ప్రాంతాల్లో కొన్ని కోట్ల జనాభా వున్నమాట నిజమే.

చైనాలోని కమ్యూనిస్టు ప్రపంచంలో మావో సే-టుంగ్ పలుకుబడి మిగిలిన ఏ వొక్కరికన్నా గూడా అధికమే. ఆయన దాదాపు ప్రతిదాంట్లోనూ-విప్లవ సైనిక కమిటీ, కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో, ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్) ఆర్గనైజేషన్ కమిటీ, ప్రజారోగ్య కమిషన్ తదితర కమిటీల్లో-సభ్యుడు. పొలిట్‌బ్యూరోలో ఆయనకున్న ఆధిపత్య స్థానం ద్వారా ఆయన నిజమైన పలుకుబడి నిర్ధారణయింది. పార్టీ, ప్రభుత్వం, సైన్యాల విధానాలు నిర్ణయించటంలో నిర్ణయాత్మక శక్తి పొలిట్ బ్యూరోకు వుంది. మావో ప్రతి ఒక్కరికి తెలుసు. ప్రతి వొక్కరూ ఆయన్ని గౌరవిస్తారు. అయినా, కనీసం ఇప్పటివరకైనా, వ్యక్తిపూజ అనేది లేదు. "మన మహానాయకుడు" వంటి పదాలను విడ్డూరంగా వాడే చైనా కమ్యూనిస్టు ఎవరూ నాకు తగల్లేదు: చైనా ప్రజలకు బదులుగా మావో పేరును ఉపయోగించటం నేను విన్లేదు. అదే సమయంలో "ఛైర్మన్" అంటే ప్రేమలేని

వారొక్కరూ నాకు తగల్లేదు: ప్రతివొక్కరూ ఆయన్ని "ఛైర్మన్" అనే పిలుస్తారు. ఆయన్ని ప్రశంసిస్తారు. ఉద్యమంలో ఆయన వ్యక్తిత్వం యొక్క పాత్ర అపారమైన విషయంగా స్పష్టంగా కనిపిస్తుంది.

మావో చాలా ఆసక్తిదాయకమైన, క్లిష్టమైన మనిషిగా నాకు కనిపించాడు. చైనా రైతుల్లో వుండే నిరాడంబరత్వం, సహజత్వం ఆయన్లో వున్నాయ్: ఆహ్లాదకరమైన హాస్యదృష్టి, గ్రామీణ ప్రజలు నవ్వే తీరుపట్ల ప్రేమా ఆయన్లో వున్నాయ్. తనను గురించీ, సోవియట్లలోపాలను గురించి ప్రస్తావన విషయాలుగా వచ్చినప్పుడు ఆయన నవ్వు మరీ ఎక్కువగా వుంటుంది. అదొక చిన్న పిల్లవాడి తరహా నవ్వు. అయితే అదెన్నడూ తన ఆశయం పట్లగల విశ్వాసాన్ని ఏ కొద్దిగా కూడా చలింపచేయజాలకపోయేది. ఆయన నిర్మొహమాటంగా మాట్లాడతాడు. నిర్మలంగా జీవిస్తాడు. ఆయన మొరటు మనిషనీ, సభ్యత తెలియనివాడనీ కొందరు భావించి వుండొచ్చు. కానీ నటనలేని సహజత్వం, పదునైన హాస్యం, ప్రాపంచిక తర్కం వీటికి సంబంధించిన విశిష్టమైన గుణాలన్నీ ఆయన్లో కలిసివున్నాయి.

నాకు మొదట కలిగిన అనుభూతి ప్రకారం ఆయన దేశీయమైన సూక్ష్మబుద్ధి గల మనిషి, బహుశా అదిసరైందే. అయినా మావో చైనా పురాతన సాహిత్యంలో పరిపూర్ణమైన పండితుడు. సమగ్రంగా సర్వగ్రాహి అయిన చదువరీ, తత్వశాస్త్రాన్నీ, చరిత్రనీ లోతుగా అధ్యయనం చేసే విద్యార్థి. మంచి వక్త. అసాధారణమైన కేంద్రీకరణ శక్తి వుంది. వ్యక్తిగత అలవాట్లంటేనూ, షోకు అంటేను నిర్లక్ష్యం, కానీ బాధ్యతకు సంబంధించిన విషయాలొచ్చేటప్పటికి ఆశ్చర్యకరమైన అతిజాగ్రత్తలు తీసుకొంటాడు. అలసటరాని శక్తిగల మనిషి. చెప్పుకోదగిన మేధోశక్తిగల సైనిక, రాజకీయ వ్యూహరచయిత. జీవించివున్న చైనా వ్యూహరచయితలందరికన్నా అత్యంత సమర్థుడైన వ్యూహరచయిత ఈయనేనని జపానీయులు భావించటం ఆసక్తిదాయకమైన విషయం.

కమ్యూనిస్టులు పావో ఆన్‌లో కొత్త భవనాలు నిర్మిస్తున్నారు. అయితే నేనక్కడ వున్నప్పుడు వసతి ఏర్పాట్లు చాలా పురాతన పద్ధతిలో వుండేవి. రెండు గదులు గల "యావో-ఫాంగ్" ("గుహల ఇల్లు")లో మావో తన భార్యతో వుంటున్నాడు. ఆ యింటికి గోడలు తప్ప మరేమీ లేవు. ఇంతకంటే గడ్డురోజులు ఆయనకు తెలుసు. హునాన్‌లో ఒక "ధనిక" రైతు కుమారుడుగా ఇంతకంటే మంచి రోజులు గూడా ఆయనకు తెలుసు. మావోకున్న ముఖ్యమైన విలాస వస్తువల్లా (చౌ కున్నట్లుగానే) ఒక దోమతెరే. అంతకు తప్ప సామాన్యమైన ఎర్ర సైనికుల్లాగానే మావో జీవిస్తున్నాడు. పదేండ్లపాటు కమ్యూనిస్టులకు నాయకత్వం వహించిన తర్వాతనూ, భూస్వాముల, అధికార్ల, పన్ను వసూలుదార్ల వస్తువులు వందలసార్లు స్వాధీనం చేసుకొన్న తర్వాతనూ ఆయనకున్న ఆస్తంతా ఆయన వాడుకొనే దుప్పట్లూ (బ్లాంకెట్లు), వ్యక్తిగతంగా అవసరమైన కొన్ని సామాన్లూ, నూలుబట్టతో తయారుచేసిన రెండు యూనిఫారమ్ దుస్తులు మాత్రమే. ఎర్ర సైన్యానికి కమాండరూ, ఛైర్మనూ అయినప్పటికీ సామాన్యమైన ఎర్రసైనికుడు ధరించే చిహ్నాలవంటివే రెండు ఎర్ర అడ్డ బాడ్జీలు ఆయన కోటు కాలరుమీదుంటాయి.

మావోతో కలిసి నేననేకసార్లు గ్రామస్తుల సమావేశాలకీ, ఎర్రకాడెట్ల సమావేశాలకీ, ఎర్ర నాటకరంగస్థలానికి వెళ్లాను. అతిసామాన్యంగా ఆయన జనం మధ్యలో కూర్చొని గొప్ప ఆనందాన్ననుభవిస్తూండేవాడు.

మావో ఆహారం మిగిలిన అందరిలాంటిదే; అయితే, హూనానీయుడుగాబట్టి దక్షిణ ప్రాంతీయుడికుండే "ఆయ్-లా" "మిరియాలు" అంటే ప్రీతి జాస్తి. రొట్టెలు గూడా మిరియాలు కలిపి వండించుకుంటాడు. ఈ ప్రీతి మినహాయిస్తే, తానేమి తింటున్నాడో కూడా ఆయన గమనించడు.

తాను గొప్పవాణ్ణనుకునే లక్షణాలేవీ ఆయన్లో కనపడవు. అయితే తన వ్యక్తి గత ప్రతిష్టను గాఢంగానే కాపాడుకొంటాడు. అవసరమని తాను భావిస్తే నిర్దాక్షిణ్యంగా నిర్ణయాలు తీసుకొనే శక్తి ఆయనకుందని

(మిగతా 27వ పేజీలో)

Page missing

1 to 2

SSR02A236 H=10.8 W=7.6

లోపలి పేజీల్లో

1. బాబుగారి సిద్ధాంతరహిత సిద్ధాంతం ...4
2. అప్పు విశ్వరూపం ...6
3. సామ్రాజ్యవాదం-'సామ్రాజ్యం' ...8
4. కరిగిన కల కాదు చెరగని నిజం సోషలిజం ...10
5. విచ్ఛిన్నం వెనుక ఎన్ని కారణాలు! ...11
6. పట్టణప్రాంతాల్లో పార్టీ పని-షాంఘై అనుభవం ...13
7. ఉత్పత్తి సంబంధాలు అంటే......15
8. లెనిన్ జైలు డైరీ ...16
9. సామ్రాజ్యవాదుల విఫలప్రయోగ కేంద్రం అర్జెంటీనా ...17
10. లెనిన్ దృష్టిలో నీతినియమాలు-మానవత్వం ...19
11. కార్మికవర్గ నియంతృత్వం ...21
12. వ్యవసాయధరలపై పన్నెండు సూత్రీకరణలు ...22
13. పంజాబ్‌లో పార్టీ విచ్ఛిన్నకుల ప్రయత్నాలు విఫలం ...26

నేడు ప్రజల్లో రాజకీయ కార్యాచరణ హెచ్చుతోంది. ప్రజలు చెప్పేదాన్ని పార్టీ వినవలసిన అవసరం నేడెంతో వుంది. దానికొక ప్రత్యేక ప్రాముఖ్యత వుంది. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవడం మన పార్టీయొక్క ప్రధాన సూత్రాల్లో ఒకటని గుర్తించడం నేడు చాలా అవసరం.

-స్టాలిన్

ప్రజాశక్తి సాహితీ సంస్థ తరపున ప్రచురణకర్త, ముద్రాపకుడు : వి.కృష్ణయ్య, సంపాదకులు: వి.శ్రీనివాసరావు. ముద్రణ ప్రజాశక్తిడైలీ ప్రింటింగ్‌ప్రెస్, 1-1-60/2, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్ 20
ఫోన్ : ఎడిటోరియల్
7665420,7663761 మేనేజర్ : 7673787 ఫ్యాక్స్ : 7639921
EMail : Prajasakti@hotmail.com
PRJASAKTI, Hyderabad, RNI, Regd.No.52973/94
visit PRAJASAKTI at : www.prajasakti.com

గమనిక :ఈ సంచికలో వ్యాసాలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

2001 ఎన్నో జ్ఞాపకాలు మిగిల్చిపోయింది. అమెరికాపై ఉగ్రవాదుల దాడి, ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా యుద్ధం, భారత పార్లమెంటుపై ఉగ్రవాదదాడి మదిలో మిగిలిన చేదు జ్ఞాపకాలు. అదే సమయంలో అమెరికాతో సహా సామ్రాజ్యవాద దేశాలు సంక్షోభంలో మునిగిపోవడం, ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాపిత ప్రతిఘటన తీవ్రరూపం దాల్చడం నూతన పరిణామాలు. ఇవి పెట్టుబడిదారీ సిద్ధాంతవేత్తలకు మింగుడుపడని చేదునిజాలు. సోషలిజం అంతరించిపోయిందని బాకాలూదిన పెద్ద మనుషుల గుండెలు బేజారెత్తిపోతున్నాయి. నూతన శతాబ్దపు మలుపులను జీర్ణం చేసుకోలేకపోతున్నారు. తమ చేయి దాటిపోకుండా పరిణామాలను నిర్దేశించాలని కన్న కలలు చెదిరిపోతుండటంతో తట్టుకోలేక పోతున్నారు. వారిలో అడుగడుగునా అసహనం కనిపిస్తోంది. తమను సవాలు చేస్తున్న ప్రజా ఉద్యమాలను అణగదొక్కాలని ఆరాటపడిపోతున్నారు. తప్పుడు సిద్ధాంతాలను వల్లె వేస్తున్నారు. తమ చేతుల్లో వున్న గుత్త మీడియా ద్వారా ప్రజలపై ప్రచారయుద్ధం ప్రారంభించారు. పోటో లాంటి దుర్మార్గ చట్టాలను ప్రతిఘటనను సైతం లెక్కచేయకుండా పునరుద్ధరిస్తున్నారు. ఉగ్రవాదం వారికొక చక్కని సాకుగా దొరికింది. నిజానికి ఉగ్రవాదాన్ని నిర్మూలించాలన్న చిత్తశుద్ధి పాలకులకు లేదు. బుసలు కొడుతున్న ఆ విషపునాగును బుట్టలో బంధించి అవసరార్థం ఉపయోగించుకోవాలన్నది వారి అసలు లక్ష్యం. ఇలాంటి నిరంకుశ చట్టాల ద్వారా ఉగ్రవాదం నిర్మూలించబడదని వారికీ తెలుసు. మన అనుభవమూ అదే. ఇందిరాగాంధీ హత్యానంతరం 1985లో టాడా చట్టాన్ని తెచ్చారు. అది పదేళ్లు ఉనికిలో వుంది. అయినా రాజీవ్ హత్యను అది ఆపలేకపోయింది. ఉగ్రవాదాన్నీ నిర్మూలించలేకపోయింది. కాని ఆపేరుతో అమాయకులు వేల సంఖ్యలో జైళ్లలో మగ్గారని అన్ని పార్టీలు అంగీకరించిన సత్యం. ఏ నిరంకుశ చట్టమైనా అది పాలకుల సంకుచిత రాజకీయ ప్రయోజనాలకు తప్ప ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పడదని అనుభవం చాటి చెపుతోంది. రోజురోజుకీ పెరుగుతున్న ప్రజల అసంతృప్తిని అణచివేయడానికే ఇలాంటి అప్రజాస్వామిక చట్టాలను తెస్తోంది. అందుకే ఉగ్రవాదాన్ని ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై చర్చ జరగాల్సిన ఆవశ్యకత వుంది. నిజానికి ఈ దేశంలో ఉగ్రవాదం ఉక్కుపాదాల కింద నలిగిపోయిందీ, పోతున్నదీ వామపక్ష ఉద్యమాలూ, ప్రజా పోరాటాలే. ఎందరో కార్యకర్తలు ఈ ఉన్మాదుల చేతుల్లో అశువులు బాశారు. పార్లమెంటుపై దాడి జరిగితే దేశం, ప్రజలు నష్టపోయారు. కాని అదే సమయంలో జార్జి ఫెర్నాండెజ్ లాంటి అవినీతిపరులు దాని మాటున తమను తాము కాపాడుకోగలిగారు. ఉత్తర ప్రదేశ్ ఎన్నికలకు ఒక రాజకీయ అస్త్రంగా దీన్ని ఉపయోగపెట్టుకోవాలని బిజెపి భావిస్తున్నదనడంలో సందేహం లేదు. సంక్షోభంలో వున్న నావను ప్రజాతుఫాను నుండి గట్టెంచుకోడానికి పాలకవర్గాలు పడరానిపాట్లు పడుతున్నాయి. అయినా ఆ మునిగేపడవను ఎవరూ కాపాడలేరు. ఇప్పటికే బిజెపీ భ్రష్టుపట్టిపోయింది. ఆ బురద నుండి బయటపడటానికే యుద్ధమనే బూచిని చూపెడుతున్నది. ఆపేరుతో తన ప్రతిష్టను పునరుద్ధరించుకోవాలని తాపత్రయపడుతోంది.

2002 నూతన సంవత్సరం ప్రజలకు మరిన్ని కడగండ్లు సృష్టించవచ్చు. సంక్షోభంలో వున్న పాలకవర్గాలు ప్రజలపై మరిన్ని భారాలు మోపే ప్రమాదం కనిపిస్తుంది. ఈ భారాలనుండి తమను తాము కాపాడుకోడానికి ప్రజలకు పోరాటం తప్ప మరో ఆయుధం లేదు. ప్రజలు పోరాటాల్లోకి యాధృచ్ఛికంగానే వస్తున్నారు. వాటికి నిర్మాణరూపం ఇచ్చి సంఘటితపర్చాల్సిన బాధ్యత కమ్యూనిస్టులదే. కమ్యూనిస్టులకు గడ్డుకాలం గతించింది. మార్క్స్ పాఠాలు ఇప్పటికీ అక్షరసత్యాలు. వర్గపోరాటాలు ఉధృతరూపం దాల్చనున్న కాలం వస్తున్నది. కమ్యూనిస్టులు పట్టుదలతో వాటిల్లో సమరశీలంగా జోక్యం చేసుకుంటున్నారు.ఈ విషయంలో సిపిఎం అగ్రభాగాన వుంది. ఆ మేరకు పార్టీ ప్రతిష్ట పెరిగింది. ప్రజల్లో ఆదరాభిమానాలు పెరుగుతున్నాయి. నూతన సంవత్సరంలో ఆశాజనకమైన అంశం ఇదే. అందుకే పోరాటాల సంవత్సరాన్ని స్వాగతిద్దాం.

వి.శ్రీనివాసరావు
ఎడిటర్.

బాబుగారి సిద్ధాంతరహిత సిద్ధాంతం

బి.వి.రాఘవులు

(ప్రపంచబ్యాంకు ఆదేశాలను, ఆలోచనా విధానాన్ని తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ప్రజలను మభ్యపెట్టేందుకు రోజుకో కొత్తసిద్ధాంతాన్ని వల్లె వేస్తున్నారు. సిద్ధాంతాలకు కాలంచెల్లిందంటూనే అవకాశ వాద సిద్ధాంతాలను పఠిస్తున్నారు. ప్రచారహోరుతో ప్రజల బుర్రలను మొద్దుబార్చేందుకు, యువ తరాన్ని ఆలోచనా రహితుల్ని చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పందిని నంది అని నమ్మబలుకు తున్నారు. ప్రపంచబ్యాంకు విధానాలకు ప్రతిఘటన రాకుండా చూసుకునేందుకే ఈపన్నాగమంతా. వాటిబండారాన్ని విశ్లేషిస్తూ సిపిఐ(యం)రాష్ట్ర కార్యదర్శి బి.వి. రాఘవులు రాసిన వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం - ఎడిటర్)

సామాజిక పెట్టుబడి సిద్ధాంతం

పేదరిక నిర్మూలనకు ప్రధాన మార్గంగా ఈ సిద్ధాంతాన్నిప్రపంచబ్యాంకు ప్రచారం చేస్తున్నది. వ్యక్తులు ఓ సమూహంగాఏర్పడితే వారి ఐక్యత వలన అభివృద్ధి శక్తి ఏర్పడుతుందని దానిద్వారా తమ వెనుకబాటు తనాన్ని, అధిగమించేశక్తి వారికివస్తుందని ఈ సిద్ధాంతం చెబుతుంది. అందుకే ప్రపంచబ్యాంకు స్వయం సహాయక బృందాల ఏర్పాటును తన పథకాల్లో ఒకముఖ్యమైన అంశంగా చేరుస్తున్నది. మనరాష్ట్రంలో కూడా డ్వాక్రాబృందాలు, స్వయం సహాయకబృందాల ఏర్పాటు పెద్ద ఎత్తున చేపట్టబడింది. ఇప్పటికి 3లక్షల 65వేల బృందాలు రాష్ట్రంలో ఉన్నాయని ప్రభుత్వం చెపుతున్నది. డిపిఐపి (వెలుగు) కార్యక్రమంలో కూడా కామన్ ఇన్‌ట్రెస్ట్ గ్రూపులను ఏర్పాటు చేయడం కీలకమైన అంశంగా ఈ అవగాహననుండే ప్రతిపాదించింది. ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలను తొలగించడానికి అవసరమైన వ్యవస్థాగత మార్పులనుండి దృష్టి మళ్లించడానికే ఈ క్రొత్త సిద్ధాంతాన్ని, పద్ధతులను ప్రపంచబ్యాంకు ఎంచుకున్నది.

ప్రజల భాగస్వామ్యం

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంపొందించడం పేరుతో జన్మభూమి కార్యక్రమాన్ని 1997 జనవరి 1నుండి ప్రారంభించింది. ఇప్పటికి 16 జన్మభూములు జరిగాయి. ప్రజలనుండి వచ్చిన ప్రతిపాదనలు ఆధారంగా గ్రామ స్థాయి అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో చేపట్టడం, ప్రజల ఆధ్వర్యంలో వాటిని పూర్తిచేయడం జన్మభూమి స్ఫూర్తిగా ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఇప్పటికి 1,15,111 పనులను 1173 కోట్ల రూపాయల ఖర్చుతో పూర్తిచేసినట్లు ప్రభుత్వం చెపుతున్నది. వాస్తవంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే అమలు జరుపుతున్నపనులలో ఒకచోటచేర్చి జన్మభూమి పనులుగా ప్రకటిస్తున్నది. ముఖ్యమంత్రి హెలికాప్టర్ సుడిగాలి పర్యటనలు, ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామగ్రామాన సభలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వం తన ప్రచారాన్నినిర్వహించుకుంది. ప్రజల భాగస్వామ్యమనిపేరు చెప్పుతున్నప్పటికీ కాంట్రాక్టర్లే పనులను నిర్వహిస్తున్నారు. నిర్ణయాలు చేయడంలో, సమీక్ష చేయడంలో గ్రామ సభదే నిర్ణయమని చెపుతున్నప్పటికీ పాలకపార్టీ నాయకులు, శాసనసభ్యుల పెత్తనమే సాగుతున్నది. గ్రామసభలు చాలా మొక్కు బడిగా జరుగుతున్నాయి. వివిధ పథకాలక్రింద లబ్ధిదారులకివ్వాల్సిన పెన్షన్లు, రుణాలు, మొదలగు సౌకర్యాలను గ్రామ సభల్లో పంపిణీ చేయడం ప్రధానమైన కార్యక్రమంగా ఉంటున్నది. జన్మభూమి ప్రజల్లో కొంత ఉత్సాహాన్ని ప్రారంభంలోకల్గించినప్పటికీ క్రమేణా ప్రజలస్పందన తగ్గిపోయింది. తక్షణ ప్రజాసమస్యలపై ప్రజలను సమీకరించి ప్రజా ప్రతినిధులను ప్రశ్నించడం పెరగడంతో ప్రభుత్వమే జన్మభూముల సంఖ్యను సంవత్సరానికి రెండింటికి కుదించాలని నిర్ణయించింది. జన్మభూమి సందర్భంగా ప్రజా సమస్యలను ముందుకు తీసుకురావడానికి మంచి సందర్భం. అందువలన ఈ కార్యక్రమాల్లో మనం చురుకుగా జోక్యం చేసుకోవాలి.

సమాంతర కమిటీలు

వివిధ రంగాల నుండి ప్రభుత్వం ఉపసంహరించుకునేదానికి ప్రజలను మభ్యపెట్టేందుకు ఉపయోగపడేటటువంటి అనేక సంస్థలను, సృష్టించి రంగంలోకి తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక కమిటీలను నియమించింది. నీటి సంఘాలు, విద్యాకమిటీలు, ఆసుపత్రిసలహా కమిటీలు, మథర్స్ కమిటీలు, వాటర్ షెడ్ కమిటీలు, నైబర్‌హుడ్‌కమిటీలు, మైత్రీసంఘాలువంటి కమిటీలు పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచేందుకని ప్రభుత్వం చెపుతున్నది. వాస్తవంలో ఈ కమిటీలన్ని ప్రజలు ఎన్నుకున్నస్థానిక సంస్థలకు పోటీ సంస్థలుగా పనిచేస్తున్నాయి. స్థానిక సంస్థల యొక్కపనులను ఈ కమిటీలచే చేయించడం ద్వారా పెత్తనమంతా తన గుపెట్లో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికార వికేంద్రీకరణను నామమాత్రం చేస్తున్నది.

పరిపాలనారంగం

ప్రభుత్వం యొక్క పాత్రను తీవ్రంగా కుదించటం సంస్కరణల్లో ఒక ముఖ్యమైన భాగం. ప్రభుత్వం ప్రోత్సాహక పాత్రనే నిర్వహించాలి తప్ప, అన్నింటిలోనూ జోక్యంచేసుకోకూడదని ప్రపంచ బ్యాంకు, రాష్ట్రప్రభుత్వం చెపుతున్నాయి. లాభకరమైన వాటినన్నిటిని ప్రైవేటు రంగానికి అప్పగించాలనే ఆలోచనను అమలు జేయడానికి మోసపూరితమైన వాదనలను ప్రచారం చేస్తున్నది. భారమైనవాటినన్నిటిని ప్రజలకు బదలాయించటం ఈ సిద్ధాంతం యొక్క సారాంశం. ప్రభుత్వ పాత్ర ఎక్కువగా ఉండడం వలనే అవినీతి, ఆశ్రిత పక్షపాతం, రెడ్‌టేపిజం ఎక్కువగా ఉంటుందని, ప్రభుత్వాన్ని కుదించితే వీటన్నింటిని తొలగించవచ్చని ప్రపంచబ్యాంకు చెపుతున్నది. ఈ ఆలోచనలకే స్మార్ట్ ప్రభుత్వం అని ముద్దు పేరు పెట్టింది. నియామకాలు, బదిలీలలో విచక్షణాధికారాలను రద్దుచేసి కౌన్సిలింగ్ పద్ధతిని ప్రవేశపెట్టింది. టెండర్ విధానంలో పారదర్శకత ప్రవేశపెడతానని ప్రకటించింది. ప్రభుత్వ సేవలను సక్రమంగా అందించేందుకు అన్ని శాఖలలోను సిటిజన్ చార్టర్లను ప్రకటిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగమంతటా ఆధునిక ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీని వినియోగించటానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ సేవలను వినియోగ దారులకు విక్రయించే ట్విన్స్ పథకాన్ని, రిజిస్ట్రేషన్ శాఖలో కార్డు పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అవినీతిని అరికట్టేందుకు ఫిర్యాదు పెట్టెలను పెడతానని ప్రకటించింది. రకరకాల చట్టాలనన్నిటినీ క్రోడీకరించి సరళం చేసి తిరిగి రాస్తామని చెప్పారు. ప్రభుత్వ సిబ్బందికి ఆధునిక శిక్షణను ఇప్పించేందుకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థను ప్రభుత్వం స్థాపించింది. దీనిలో అమెరికన్ సంస్థ సహాయంతో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. వికేంద్రీకరణను ప్రోత్సహిస్తామని చెపుతున్నది.

ఈచర్యలన్నింటి మూలంగా సత్పరిపాలన అభివృద్ధి అవుతుందని ప్రభుత్వం చెబుతున్నా అవినీతి, ఆశ్రితపక్షపాతం, ఆలస్యం అన్ని కొనసాగుతూనే ఉన్నాయి. కాకపోతే ధనవంతులకు నిరాఘాటంగా పనులయ్యేందుకు కొంతమేరకు మార్పులు తోడ్పడవచ్చు. అదే సందర్భంలో సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలు పొందడం మరింత కష్టమవుతుంది.

మొత్తం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలక్ట్రానిక్ గవర్నమెంట్‌గా తీర్చిదిద్దుతానని ప్రకటిస్తున్నారు. అన్ని గ్రామాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తానని, గ్రామాలను, మండలాలతో, మండలాలను జిల్లాతో, జిల్లాకేంద్రాలను హైదరాబాదుతో అనుసంధానం చేస్తూ ఫైబర్ ఆప్టిక్‌నెట్ వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకుగాను మూడు ప్రసిద్ధిగాంచిన

ప్రైవేటు కంపెనీలకు కాంట్రాక్టు ఇవ్వనున్నట్లు చెప్తున్నారు. ప్రభుత్వ సేవలను అందించే ట్విన్స్ పథకాన్ని రాష్ట్ర వ్యాపితంగా విస్తరించనున్నట్లు కూడా ప్రకటించింది. జిఐఎస్ సమాచార వ్యవస్థను సిద్ధం చేస్తున్నట్లు, మల్టీ పర్పస్ హౌస్ హోల్డ్ సర్వేను కంప్యూటరీకరించి మల్టీపర్పస్ గుర్తింపు కార్డులను ప్రతివ్యక్తికి జారీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అభివృద్ధి, వినియోగం ప్రజలకు ఉపయోగపడేట్లు జరిగితే మంచిదే. కాని ప్రస్తుత పరిస్థితులలో ఈ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ధనవంతులకు మాత్రమే వినియోగించుకోగల శక్తి ఉన్నది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రయత్నాలు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో అంతర్జాతీయ, బహుళజాతి సంస్థలకు ప్రధానంగా ఉపయోగపడుతాయి.

అధికార వికేంద్రీకరణ గురించి కబుర్లు చెప్పడం తప్పా, చిత్తశుద్ధితో ప్రభుత్వం వ్యవహరించటం లేదు. 73,74 రాజ్యాంగ సవరణలకనుగుణంగా నిధులను, విధులను అధికారాలను ఇప్పటికీ పూర్తిగా స్థానిక సంస్థలకు బదలాయించలేదు. నోడల్ అధికారుల వ్యవస్థను ఏర్పాటు చేసి స్థానిక ప్రజా సంస్థలను బలహీనం చేసింది. నీటి సంఘాలు, విద్యాసంస్థలు వంటి పోటీ సంస్థలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు గ్రామ సచివాలయం పేరుతో దొడ్డి త్రోవలో అధికారుల పెత్తనాన్ని ప్రతిష్టిస్తున్నారు. నిజంగా ప్రభుత్వం సత్ప్రభుత్వంగా మారాలంటే ప్రతి విషయంలోనూ పాలక పార్టీ ప్రతినిధుల జోక్యం తగ్గాలి. అధికార వికేంద్రీకరణ జరగాలి. సామాన్య ప్రజలు పరిపాలనలో భాగస్వాములు కావడానికి తీవ్ర ఆటంకంగా ఉన్న ఆర్థిక, సామాజిక అసమానతలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి. దానిలో ముఖ్యమైనవి భూ సంస్కరణల అమలు. ఇటువంటి మౌలికమైన మార్పులకు సిద్ధం కాకుండా సత్పరిపాలన గురించి చెప్పటం చిత్తశుద్ధితో కూడినది కాదు.

నిరంకుశ ధోరణుల పెరుగుదల

ఉదారవాద ఆర్థిక విధానాలపై నిరసన పెరిగే కొద్దీ ప్రజలపై నిర్బంధం కూడా పెరుగుతున్నది. నిరసనను నిర్దాక్షిణ్యంగా అణచివేసి, సంస్కరణలను అమలుజరపాలన్న ధోరణి రాష్ట్ర ప్రభుత్వంలో పెరుగుతున్నది. ప్రపంచబ్యాంకు వ్యవస్థీకృతసర్దుబాటు విధానాలు ఎక్కడ అమలు జరిగినా అక్కడ నిరంకుశ ధోరణులు పెరిగాయి. ఈ విధానాల మూలంగా ప్రజల్లో పెరిగే అసంతృప్తిని అణచివేసేందుకు ప్రభుత్వాలు అంతకంతకు నిరంకుశ చర్యలకు పాల్పడుతాయి. మనరాష్ట్రంలో గతంలో విద్యుత్ ఉద్యోగులసమ్మెను, ఆర్.టి.సి. ఉద్యోగులసమ్మెను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రపంచబ్యాంకు నివేదికలో ప్రశంసించడం దీనికొక తార్కాణం.

ప్రజాందోళనలను, నిరసన కార్యక్రమాలను కూడా రాష్ట్రప్రభుత్వం శాంతి భద్రతల సమస్యగానే చూస్తున్నది. ఉగ్రవాదాన్ని, ఫ్యాక్షనలిజాన్ని పోలీసు సమస్య గానే రాష్ట్రప్రభుత్వం పరిగణిస్తున్నది. ఈ సమస్యలను ఆర్థిక, రాజకీయ, సామాజిక స్థాయిలలో పరిష్కరించేందుకు ప్రయత్నించడంలేదు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు పరిమిత ప్రజాస్వామ్యం ఉత్తమమైనదని చెప్పడంలో ప్రజాతంత్ర హక్కులపట్ల ఆయనలో పెరుగుతున్న అసహనం మనకు కనిపిస్తున్నది. అధ్యక్షతరహా పాలన కావాలని చెప్పడంలో ఆంతర్యం కూడా యిదే. నిరంకుశాధికారులమీద, కంప్యూటర్ల మీద ముఖ్యమంత్రిగారి గురి ఎక్కువ. నోడల్ వ్యవస్థ ద్వారా స్థానిక సంస్థలపై పెత్తనాన్ని సాగిస్తున్నారు. టెలికాన్ఫరెన్సులు, వీడియో కాన్ఫరెన్సుల ద్వారా జిల్లా అధికార యంత్రాంగంతో నేరుగా ముఖ్యమంత్రి అన్ని అంశాలను చర్చించి ఆదేశాలను జారీ చేయడం ద్వారా మంత్రులను, వివిధ శాఖలను ప్రేక్షక పాత్రకు నెట్టివేస్తున్నారు. మండల స్థాయి వరకు కంప్యూటరీకరణ చేసి మొత్తం పాలననంతటినీ ముఖ్యమంత్రి చుట్టూ సలహాదార్లుగా ఉన్న నిరంకుశాధికార బృందం చేతిలో కేంద్రీకరించే పరిస్థితి ఏర్పడుతుంది. హోరెత్తుతున్న ప్రశంసల్లో మునిగిపోయిన చంద్రబాబు నాయుడుగారిలో కొన్ని పొరపాటు వైఖరులు మొదలయ్యాయి. అసహనం పెరిగింది. స్వంత పార్టీలోనే ఏకవ్యక్తి ప్రాధాన్యత మొదలయింది. ప్రశంసలు తప్ప విమర్శలను సహించలేని స్థితి.

“ ప్రపంచబ్యాంకు వ్యవస్థీకృత సర్దుబాటు విధానాలు ఎక్కడ అమలు జరిగినా అక్కడ నిరంకుశ ధోరణులు పెరిగాయి. ఈ విధానాల మూలంగా ప్రజల్లో పెరిగే అసంతృప్తిని అణచివేసేందుకు ప్రభుత్వాలు అంతకంతకు నిరంకుశ చర్యలకు పాల్పడుతాయి. ”

ప్రతిపక్షాలను, ప్రజా ఉద్యమాలను సహించలేని నిరంకుశ ధోరణులు పెరుగుతున్నాయి. ట్రేడ్‌యూనియన్లే అవసరం లేదని, వాటిని నిషేధిస్తామని ఆయన పదేపదే అనడం దీనికి తార్కాణం. విజయనగరంలో ట్రేడ్‌యూనియన్ నాయకులతో మాట్లాడిన సందర్భంలో, విద్యావాలంటీర్ల బృందంతో మాట్లాడిన సందర్భంలోను ఆయన అన్న మాటలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అంగన్‌వాడీ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసి తిరిగి వచ్చే సందర్భంలో కమ్యూనిస్టులను అణచివేయాలని సి.ఎం. అన్న మాటలను, కమ్యూనిస్టులు అమాయక ప్రజలను రెచ్చగొడుతున్నారని పదేపదే అనడాన్ని చూస్తే ప్రజా ఉద్యమాల పట్ల ఎంత అసహనంతో ఉన్నారో విదితం అవుతుంది. ఆర్థికాభివృద్ధి జరగాలంటే నిరంకుశత్వం అవసరమన్న భావాన్ని ప్రజలలో కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు.

కమ్యూనిస్టువ్యతిరేకత

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు కమ్యూనిస్టు వ్యతిరేక విషాన్ని వెళ్ళగక్కుతున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా కమ్యూనిస్టులను ఎద్దేవా చేస్తున్నారు. కమ్యూనిజానికి కాలం చెల్లిందని, మార్క్సిజం పాతకాలపు సిద్ధాంతమని, బూజు పట్టిన ఆలోచనలని తీవ్ర స్థాయిలో దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రతి చిన్న అవకాశాన్ని వినియోగించుకుని కమ్యూనిస్టులను చులకన చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రత్యేకంగా సిపిఐ(ఎం)పై తన కోపాన్ని, ఉక్రోషాన్ని వెళ్లగ్రక్కుతున్నారు. క్యాపిటలిజం, కమ్యూనిజం పాతపడిపోయాయని, క్లింటన్, టోనీ బ్లెయర్ అడుగుజాడలలో తన కొత్తవిధానాన్ని ముందుకు తీసుకువస్తున్నానని కొంతకాలం చెప్పారు. ఏ ఇజం లేదని, ఒక్క టూరిజం మాత్రమే ఉందని చౌకబారుగా మాట్లాడుతున్నారు. ఆరకంగా కొత్తతరం యువకుల్లో కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టి ఉద్యమాలకు దూరం చేయాలను కుంటున్నారు. ప్రచారసాధనాలు కూడా ఈ కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారానికి ప్రాధాన్యత నిస్తున్నాయి. ఈ ప్రచారాన్ని మనం సమర్ధవంతంగా తిప్పికొట్టాలి. బెంగాల్‌లో ప్రైవేటీకరణ చేస్తూవుంటే, చైనా సంస్కరణలు అమలు జరుపుతుంటే రాష్ట్రంలో తన సంస్కరణలను కమ్యూనిస్టులు వ్యతిరేకిస్తూ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని చెపుతున్నారు. ఇవన్నీ చౌకబారు ప్రచారాలు, వక్రీకరణలు. ఎప్పటికప్పుడు ఈ వక్రీకరణలను ఎండగట్టేందుకు మనం తీవ్రంగా కృషి చేయాలి.

ప్రజలను రాజకీయ రహితులుగా చేయడం

ఈ మధ్య ముఖ్యమంత్రి తనపై ఏ విమర్శ చేసినా రాజకీయం చేస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. విద్యుత్ బిల్లుల బకాయిలు ముఖ్యమంత్రే చెల్లించలేదని విమర్శిస్తే అది రాజకీయం చేయడమేనని చెప్తున్నారు. కరువు పనులెందుకు చేపట్టలేదని, అంగన్‌వాడీలకు వేతనాలు పెంచమని అడిగితే రాజకీయం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబునాయుడు గారి నిర్వచనం ప్రకారం రాజకీయం చేయకుండా ఈ ప్రపంచంలో మాట్లాడడానికి ఏదీ దొరికేట్లు లేదు. చంద్రబాబు నాయుడుకి భజన చేయడమొక్కటే ఆయన దృష్టిలో రాజకీయం చేయనిదిగా కన్పిస్తున్నది. వాస్తవంలో రాజకీయం చేయొద్దు అనే వాదనలో విమర్శలు సహించలేని ధోరణి వ్యక్తమవుతున్నది.

మీకెందుకు రాజకీయాలు అనే మాట పదేపదే ముఖ్యమంత్రి నోటి నుండి వస్తున్నది. విద్యార్థులు, కార్మికులు, మహిళలు తమ సమస్యల గురించి చెప్పుకున్నా అది రాజకీయంగానే భావించి వారిని రాజకీయాలకు దూరంగా ఉండాలని బెదిరించడం ఆనవాయితీ అయ్యింది. ఈ ధోరణి ప్రజలను రాజకీయాల గురించి, రాజకీయ పార్టీల విధానం గురించి ఆలోచించని ఒక అచేతనులుగా పరిమితం చేయడానికి ప్రయత్నిస్తుంది. ప్రజలను ఈ రకంగా రాజకీయాలకు దూరం చేయడం ప్రతిఘటన లేకుండా ఉదారవాద విధానాలను అమలు జరపడానికి అవసరం. అందుకనే ముఖ్యమంత్రి ఈ రకంగా వ్యవహరిస్తున్నారు. అధికారం చేపట్టిన వెంటనే ఇక ఐదేళ్ళు పాటు రాజకీయాలను పక్కకు పెట్టి అభివృద్ధి మీద కేంద్రీకరిస్తానని ముఖ్యమంత్రి ప్రకటించారు. అభివృద్ధికి రాజకీయాలు వ్యతిరేకమైనట్లు, అభివృద్ధికి, రాజకీయాలకు సంబంధం లేనట్లుగా చిత్రీకరించి, ఆ రకంగా రాజకీయాల పట్ల చులకన భావం కలిగించి ప్రజలను రాజకీయరహితంగా ఆలోచించేట్లుగా చేసేదిగా ముఖ్యమంత్రి వైఖరి ఉన్నది. ప్రపంచబ్యాంకు ఆలోచనా సరళిలో ఒక ముఖ్యమైన అంశాన్ని ఇక్కడ ముఖ్యమంత్రి

(మిగతా 20వ పేజీలో)

అప్పు - విశ్వరూపం

వి. శ్రీనివాసరావు

నేడు అప్పు ప్రపంచాన్ని శాసిస్తోంది. ఆర్థిక వ్యవస్థలలో రుణవిధానం కీలకపాత్ర వహిస్తుంది. అప్పులతో ధనిక దేశాలు, పేద దేశాలను, ధనికులు, పేదలను దోపిడీ చేయడం సర్వసాధారణమైపోయింది. అప్పుల ద్వారా అభివృద్ధి అనే నినాదాన్ని పాలకవర్గాలు చేపట్టాయి. అప్పు చేసి పప్పుకూడు తప్పని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు మొదలుకొని పల్లెటూరి వడ్డీవ్యాపారి వరకు అప్పులిచ్చే వారే. అసలు కన్నా వడ్డీ ముద్దు అని సామెత. అప్పులతో విడదీయరాని అనుబంధం వడ్డీలది. అమెరికా మొదలుకొని ఆంధ్రప్రదేశ్ వరకు అందరూ అప్పులు తీసుకొనేవారే. అయితే అన్ని అప్పులూ ఒకేరకమైనవి కావు. అందరు చేసే అప్పులూ ఒకరకమైనవి కావు. పేదవారు అప్పులు చేసి దోపిడీకి గురవుతారు. ధనికులు అప్పుచేసి దోపిడీ చేస్తారు. అప్పుల విశ్వరూపం అర్థం కాకుండా మనకు ఆధునిక ఆర్థికశాస్త్రంకూడా అర్థంకాదు.

అప్పులెందుకు చేస్తారు?:- అవసరాలకు అప్పు చేస్తారు. అవి రెండు రకాలు.

ఒకటి: ఉత్పాదక,

రెండు: అనుత్పాదక.

ఒక వ్యక్తి లేదా సంస్థ వడ్డీ అనే ప్రతిఫలాన్ని ఆశించి తిరిగి నిర్దిష్ట గడువులోగా అప్పు తీర్చే హామీపై మరొక వ్యక్తి లేదా సంస్థ లేదా ప్రభుత్వాలకు ఇచ్చేది అప్పు. అప్పును వాయిదాలపై గాని లేదా ఏకమొత్తంలోగాని తీర్చేందుకు ముందుగానే ఒప్పందానికి వస్తారు. అప్పులిచ్చే వారు తమ స్వీయ ప్రయోజనార్థం కొన్ని షరతులు కూడా విధిస్తారు.

అప్పులు-రకాలు

1. వ్యక్తులు చేసే అప్పులు:

ఎ)అనుత్పాదక: కుటుంబ అవసరాల కోసం-పిల్లల చదువుల కోసం -ఆడపిల్లల పెండ్లిండ్ల కోసం-వైద్య అవసరాల కోసం

బి)ఉత్పాదక: వ్యవసాయ పెట్టుబడి కోసం -వ్యాపారం కోసం-చిన్న పరిశ్రమల స్థాపన ఏదైనా వృత్తి చేయడానికి -అప్పు తీసుకొనే వారికి తిరిగి చెల్లించే శక్తి సామర్థ్యాలను అంచనా వేసుకొని ఇచ్చేవారు ఇస్తారు. ఆస్థిపాస్తులు, లేదా నికరాదాయం లేకుంటే ఎవరూ అప్పులివ్వరు. తిరిగి రాబట్టుకొనే హామీకోసం పొలాలు లేదా స్థిరాస్తులుంటే అటువంటివాటిని తాకట్టు పెట్టుకుంటారు. పేదవారైతే ఇంట్లో వున్న సొమ్ములు లేదా వస్తువులు తాకట్టు పెడతారు. బ్రిటీషు హయాంలో వడ్డీవ్యాపారుల పీడనకు వ్యతిరేకంగా పెద్దఎత్తున రైతాంగపోరాటాలు సాగాయి. తలవంచిన బ్రిటీషు ప్రభుత్వం గ్రామీణ రుణవిమోచన చట్టాన్ని తీసుకు వచ్చింది. 1976లో దీన్ని తిరిగి పునరుద్ధరించారు. ప్రస్తుతం షష్టావస్థలోవుంది. ఇంటి అవసరాలకోసం (అనుత్పాదక) అప్పు తెచ్చేవారు వాటిని తీర్చడం అంతతేలిక కాదు. ఉదాహరణకు వైద్యం కోసం, లేదా ఆడపిల్లల పెండ్లి కోసం అప్పు చేశారనుకోండి. ప్రతిసంవత్సరం ఏదైనా నికరాదాయం వస్తే అందులో నుండి తీరుస్తారు. లేకుంటే వడ్డీలు పెరిగి తిరిగి చెల్లించలేని పరిస్థితి వస్తుంది. అప్పుడు ఆస్థి అమ్మితీర్చాల్సిందే. చదువుల కోసం చేస్తే ఉద్యోగం వచ్చిన తర్వాత కాని తీర్చలేరు. ఉద్యోగం రాకుంటే అప్పులే మిగులుతాయి. ఆ విధంగా అప్పు ఆస్థుల మారకానికి దారి తీస్తుంది. ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానం కూడా ఇలాంటిదే. ప్రపంచబ్యాంకు అప్పు తీర్చడానికి ప్రభుత్వఆస్తులు అమ్ముతున్నారు. సంపద కేంద్రీకరణకు ఇదొక రూపం. ఇది అప్పులు చేసే పేదవారి కథ. కాని ధనవంతుల సంగతి అలాకాదు. ఉదాహరణకు ఒక ట్రాక్టరు కొనడానికో లేక మిల్లు కట్టడానికో అప్పు చేశాడనుకుందాం. వాటిలో వచ్చే ఆదాయం నుండే వడ్డీ, అసలు చెల్లించాలి. అంటే వినియోగదారుల నుండే అతను వడ్డీని కూడా వసూలు చేస్తాడు. తన స్వంత ఖజానానుండి



చెల్లించదు. ఒక వేళ మిగులు తగినంత లేకపోతే ఐపి (దివాళా)పెట్టేస్తాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అప్పు ఇచ్చేవాడూ, తీసుకొనే వాడూ ఇద్దరూ దోపిడీకి గురయ్యే అవకాశం వుంది.

దోపిడీ సాధనంగా అప్పు:

ఫైనాన్స్ వ్యాపారం: ఉదాహరణకు ఒక గ్రామంలో ఒకధనిక రైతు బిడ్డ ఆదే గ్రామంలోని చిన్న చిన్న వృత్తిదారులు కష్టపడి పొదుపు చేసుకుంటే వారినుండి తక్కువ వడ్డీకి అప్పు తీసుకుంటాడు. ఇచ్చేవారు డబ్బు గ్యారంటీ కోసం ఉన్నవాళ్లకు ఇద్దామనుకుంటారు. అదే దబ్బును అతను అధిక వడ్డీలకు మారుస్తాడు. అందులో నుండే లాభాలు సంపాదిస్తాడు. ఉదాహరణకు టౌన్‌లో ఒక నిరుద్యోగికి ఆటో కొనుగోలుకి అప్పు ఇస్తాడనుకుందాం. ఆటోవాలా తను రోజంతా కష్టపడి సంపాదించిన దానిలోనుండి వడ్డీలు కడతాడు. కాని ఆ వడ్డీ అసలు డబ్బు యజమానికి పూర్తిగా చెందదు. ఆ విధంగా ఇరువురు కష్టజీవులూ నష్టపోతారు. మధ్యలో ధనవంతుడు బాగుపడతాడు.

వ్యవసాయం: పొలం సాగు చేయడానికి అప్పుతెస్తే దాన్ని తీర్చేందుకు అతను శ్రమపడి పండించిన పంటనుండే అప్పు తీర్చాలి. రైతు పండించే పంట విలువ మూడు అవసరాలకు సరిపడాలి.

ఒకటి: అప్పుతో సహా పెట్టిన పెట్టుబడి తిరిగి రావాలి.

రెండు: కుటుంబ అవసరాలు తీరాలి.

మూడు: భవిష్యత్తు అవసరాలకు (కార్పస్ ఫండు) ఎంతోకొంత మిగలాలి. అంటే అతని శ్రమలో కొంతభాగం అప్పుల మీద వడ్డీలకు పోతుందన్నమాట. తన కోసమే కాక వడ్డీ వ్యాపారిని పోషించడానికికూడా అతను పండించాలి. ఇది నిత్యం సాగే మరో రకం దోపిడీ. ఈ అప్పుల విషవలయం నుండి బయటపడలేనిరైతులనేకమంది ఆత్మహత్యలకు పాల్పడిన విషయం మనకు తెలుసు.

కష్టపడి కూడబెడితే దోపిడీ కాదా?

ఒకరైతు లేదా వ్యాపారి లేదా వృత్తిదారుడు తన కాయకష్టంతో ప్రతిసంవత్సరం కొంతపొదుపు చేసుకుంటాడు. అంతవరకు అది దోపిడీ కాదు. ఆ డబ్బుతో ఒక ఇల్లు కట్టుకోవచ్చు. లేదా పిల్లలను చదివించుకోవచ్చు. లేదంటేసౌకర్యాలు పొందవచ్చు. అలా కాకుండా ఆదే దబ్బుతో ఒక పరిశ్రమ స్థాపిస్తే అది పెట్టుబడిగా మారుతుంది. ఇతరుల శ్రమశక్తిని కొల్లగొట్టదానికి అది తోడ్పడుతుంది. లేకుంటే వడ్డీకి మార్చవచ్చు. అది కూడా దోపిడీ సాధనంగా మారుతుంది. కష్టపడి కూడబెట్టవచ్చు. దానితో సౌకర్యాలు పొందవచ్చు లేదా దోపిడీ చేయవచ్చు. ఎందుకోసం వినియోగిస్తున్నాడు అనేదాన్ని బట్టి స్వభావం వుంటుంది. వారు మిగులు డబ్బుతో అదనంగా పొలం కొన్నారనుకోండి. ఆపొలం సైజు తాను స్వంతంగా సేద్యం చేసుకోలేని స్థితికి చేరుతుంది. అప్పుడు అనివార్యంగా కూలీలను పెట్టుకోవాలి. ఆవిధంగా అతను ధనికరైతు స్వభావం సంతరించుకుంటాడు. వడ్డీ వ్యాపారం విస్తరించి ఒక ఫైనాన్స్ కంపెనీ పెట్టుకోవచ్చు. రైసు మిల్లు స్థాపించవచ్చు. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా మారిపోతాడు. ఇలాంటి వారిని చూపెట్టే కష్టపడి ధనవంతులు కావచ్చని చంద్రబాబులాంటి వారు బోధిస్తారు. నిజానికి ఇలాంటివారు లక్షకో, కోటికో ఒకరుంటారు. తమ దోపిడీ స్వభావాన్ని కాపాడుకోడానికి ఇలాంటి ఉదాహరణలు చెపుతుంటారు.

2. సంస్థలు చేసే అప్పులు

ఒక పారిశ్రామిక వేత్త బ్యాంకు అప్పుతో పరిశ్రమ స్థాపిస్తాడు.. ఉద్యోగుల జీతాలకు, ముడిసరుకు కొనుగోలుకు (వర్కింగ్‌కాపిటల్) కూడా అప్పు తెస్తాడు. ఉత్పత్తి అయిన సరుకు అమ్ముకొని లాభాలు సంపాదిస్తాడు. ఆ మిగులునుండి వడ్డీలు చెల్లిస్తాడు. నష్టాలొస్తే బ్యాంకులే మునుగుతాయి.

అప్పు చక్రం: కార్మికులు నెలపొడవునా పాలు, కూరగాయలు, సరుకులకు అప్పు చేస్తారు. జీతం రాగానే తీరుస్తారు. షావుకారు ద్వారా ఆడబ్బు పారిశ్రామికవేత్తకు చేరుతుంది. అదే డబ్బుతో వారు బ్యాంకురుణం తీరుస్తారు. బ్యాంకు వారికి వడ్డీ రూపంలో లాభం వస్తుంది. షావుకారుకు కమీషన్ రూపంలో లాభం వస్తుంది. ఫ్యాక్టరీ యజమానికి అసలులాభం దక్కుతుంది. ఇక్కడ కోల్పోయేది కార్మికులు తమ శ్రమనే. అదే వారందరికీ లాభాలు తెచ్చిపెడుతుంది.

3. సర్కారు అప్పులు

ప్రభుత్వం కూడా తన అవసరాలకు అప్పు చేస్తుందంటే కొంతమందికి ఆశ్చర్యకరంగా వుండవచ్చు. కాని ఇది పచ్చినిజం. నోట్లు ముద్రించే వారికి అప్పు చేయాల్సిన అవసరమేమిటని పించవచ్చు. సంపద పెరగకుండా నోట్లు ముద్రణ పెరిగితే అది డబ్బువిలువను తగ్గిస్తుంది. ధరలు పెరిగి సరుకుల అమ్మకం తగ్గిపోతుంది. అభివృద్ధి కుంటుపడుతుంది. అందువల్లనే డబ్బుకోసం ప్రభుత్వాలు ఉప్పుచేస్తాయి. ఈ కింది అవసరాల నిమిత్తం సర్కారువారు అప్పుచేస్తారు. 1) రెవెన్యూ లోటు పూడ్చుకోడానికి (అంటే వచ్చే ఆదాయం జీతభత్యాలకు కూడా సరిపోకపోతే అప్పు చేసి ప్రభుత్వమనే సంసారాన్ని నడుపుతారు. ఇది అనుత్పాదక అప్పు). 2) పెట్టుబడుల కోసం (ప్రస్తుతం దాన్ని ఆపి ప్రాథమిక సౌకర్యాల కల్పనకోసం అప్పు చేస్తున్నారు. మొదటిదానిలో ఉపాధి పెరుగుతుంది. లాభాలు వస్తాయి. రెండోది పెట్టుబడిదారులకు మాత్రమే తోడ్పడుతుంది.) 3) పాత అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు ప్రభుత్వానికి అప్పులిచ్చే వారు: 1) బాండ్ల రూపంలో ప్రజలనుండి సేకరిస్తారు. (ఇందిరా వికాసపత్రాలు వగైరా)విదేశాల్లోని భారతీయులు కూడా ఇలాంటి బాండ్ల ద్వారా అప్పులిస్తారు. . 2) బ్యాంకులు, ఇన్సూరెన్సు కంపెనీలు. 3) విదేశాలు (విదేశీ బ్యాంకులు, ప్రపంచబ్యాంకు వగైరా) ఈ అప్పులు తీర్చడానికే ప్రభుత్వం ఆస్తులమ్ముతున్నది. ప్రజలపై అదనపు పన్నులు, చార్జీల రూపంలో భారం మోపుతున్నది. పొదుపు పథకాలు: ప్రభుత్వమే అనేకరకాల పొదుపు పథకాలు ప్రవేశపెడుతుంది. అనేకమంది సామాన్య పౌరులు తమ సంపాదనలో కొంతభాగం (అవసరాలు తగ్గించుకొని)భవిష్యత్ అవసరాలకు పొదుపు చేసుకుంటారు. పోస్టాఫీసు, బ్యాంకు ఫిక్స్‌డ్‌డిపాజిట్, మ్యూచివల్ ఫండ్సు, షేర్ల కొనుగోలు, చిట్‌ఫండ్సు వంటి వివిధ రూపాలలో దాచుకుంటారు. దానిపైవారికి వడ్డీ లేదా డివిడెండు లేదా కమీషన్ వస్తుంది. మన దేశంలో కుటుంబ పొదుపు వారి ఆదాయాలలో 20 నుండి 22 శాతం వరకు వుంటుంది. దీన్ని 24 శాతం వరకూ పెంచాలని పాలకులు తలపోస్తున్నారు. పొదుపును పెంచేందుకు అధిక వడ్డీ పథకాలు ప్రవేశపెట్టేవారు. కాని ఇప్పుడు మారిన విధానాలతో ప్రభుత్వ పొదుపు పథకాలను నీరుకారుస్తున్నారు. వడ్డీరేట్లు తగ్గించారు. గతంలో పోస్టాఫీసులో వేసుకుంటే 12శాతం వచ్చేది. దాన్ని క్రమంగా 9.5శాతానికి తగ్గించారు. ఆరు సంవత్సరాలలో రెట్టింపయ్యే డబ్బు ఏడున్నరేండ్లు పడుతుంది. ఉద్యోగుల ప్రావిడెంటుఫండు కూడా పొదుపులో భాగమే. కార్మికుల జీతాల్లోంచి కొంతభాగం కోతపెట్టి దానికి అంతేమొత్తంలో యాజమాన్యాలు కలిపి పియఫ్ జమచేయాలి. దానిపై కూడా వడ్డీ వస్తుంది. అది కూడా నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా తగ్గించబడింది. అత్యవసరాలలో దానినుండి రుణం కూడా తీసుకోవచ్చు.

వడ్డీరేట్లు తగ్గితే ఎవరికి లాభం?:- పోస్టాఫీసు సేవింగ్సు వడ్డీరేట్లు, పియఫ్ రేట్లు తగ్గించడం వల్ల ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ఎలా వుంటుందనే దానిపై ఇప్పుడు చర్చ సాగుతోంది. ప్రభుత్వ ఏజెన్సీలలో మదుపు చేయడం తగ్గించుకొని సామాన్యులు తమ డబ్బును ప్రైవేటు సంస్థలలో దాచుకుంటున్నారు. లేదా స్థలాలు, ఇండ్ల కొనుగోలుకు (రియల్‌ఎస్టేట్) పెడుతున్నారు. దానికి గ్యారంటీ కూడా లేదు. చాలమంది మోసపోతున్నారు కూడా. అలా ప్రజల డబ్బు ప్రైవేటుకంపెనీల చేతుల్లోకి పోతుంది. ప్రభుత్వానికి అవసరమైన అప్పును కూడా ఇలాంటి సంస్థలనుండే అధికవడ్డీలకు తీసుకుంటుంది. రెవెన్యూలోటులో బాధపడుతున్న ప్రభుత్వాలు జీతభత్యాలు కూడా ఇవ్వలేని స్థితిలో నిర్వహణ కోసమే అప్పులు తెస్తుంటాయి. ఇది దివాళాకోరు ఖజానాకు గుర్తు. ప్రస్తుతం మన రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థితిలోనే వుంది. ఇలాంటి అవసరాల కోసమే ప్రపంచబ్యాంకు వద్ద రు.1500 కోట్లు అప్పు తెచ్చింది. వీటిని తీర్చడానికే ప్రజలపై అదనపు పన్నులభారం మోపుతున్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం చిన్న పొదుపు మొత్తాలను ప్రోత్సహించి పెట్టుబడులకోసం వాడుకుంటుంది. దానిపై ప్రజలకు 14శాతం వడ్డీ

(మిగతా 25వ పేజీలో)

సామ్రాజ్యవాదం-'సామ్రాజ్యం'

జాన్ బెల్లామి ఫోస్టర్

ఈ వ్యాసం రాయడానికి ఒక నెల రోజుల ముందు, సెప్టెంబరు 11 ఘటనకు ముందు పెట్టుబడిదారీ ప్రపంచీకరణకు వ్యతిరేకంగా 1999, నవంబరులో తిరుగుబాటు మొదలయింది. ఆ తర్వాత ఇటీవలికాలంలో జులై 2001లో జినోవాలో మరింత వూపునందుకున్నది. ఈ తిరుగుబాట్లు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంతగా పెట్టుబడిదారీ వ్యవస్థలోని వైరుధ్యాలను బయటపెడుతున్నాయి. అయితే సామ్రాజ్యవాదం అనే మాట అదృశ్యం కావడం ఈ పరిణామం లోని ఒక విచిత్రమైన అంశం. ప్రపంచీకరణ వల్ల అంతర్జాతీయ దోపిడీ లోని కొన్ని తీవ్రమైన స్వరూపాలు, వైరుధ్యాలు నెమ్మదించాయని వామపక్ష భావాలు కలిగిన వారు సైతం కొందరు చెబుతున్నారు. ఇది పాలక వర్గాలకూ ఆసక్తికరంగానే ఉంది. అందువల్లనే ఇటువంటి అభిప్రాయాలకు మీడియాలో విపరీత ప్రచారం లభిస్తున్నది. మైకేల్ హార్డ్, ఆంటోనియో నెగ్రిల నూతన గ్రంథం 'ఎంపైర్' ఈ కోవకే చెందుతుంది. ఈ గ్రంథం లోని అభిప్రాయం ప్రకారం సామ్రాజ్యవాదం అంతరిస్తున్నది. దాని స్థానంలో కొత్తగా (ఎ ఎ ం చ సార్వభౌమాధిపత్యం 'ఎంపైర్' (సామ్రాజ్యం) చోటుచేసుకుంటున్నది. 'ఒక స్పష్టమైన అంతర్జాతీయ ఆధిపత్యం లేకుండా' కొన్ని జాతీయ, జాతి అతీత అంశాల కలయికతో ఏక సూత్ర పాలన క్రింద ఈ సామ్రాజ్యం ఏర్పడుతున్నది.

స్థలాభావం రీత్యా ఈ వాదన లోని అన్ని అంశాలకు ఇక్కడ సమాధానం చెప్పలేను. కేవలం సామ్రాజ్యవాదం అదృశ్యం అవడం అన్నఒక్క అంశం మీదనే నేను వ్యాఖ్యానిస్తాను. హార్డ్, నెగ్రిలు చెప్పిన ఎంపైర్ సంపన్న దేశాలు వర్ధమానదేశాలపై అమలు జరుపుతున్న సామ్రాజ్యవాద ఆధిపత్యానికి సంబంధించింది కాదు. ప్రాదేశిక పరిమితులు, సరిహద్దులతో నిమిత్తం లేని సర్వ వ్యాప్తమైనది. ఈ ఎంపైర్ 'సామ్య్రాజ్యవాదం' ఉచ్ఛదశలో ఉన్నపుడు అది ' ఐరోపా జాతిరాజ్యాల సార్వభౌమాధిపత్యాన్ని వాటి సరిహద్దుల వెలుపలకు విస్తరించడమే' అని చెబుతున్నారు. ఈ అర్థంలో సామ్రాజ్యవాదము, లేదా వలస వాదము నేడు అంతరించింది. కాని హెర్డ్, నెగ్రిలు నూతన తరహా వలస వాదం కూడ అంతరించిందని చెబుతున్నారు. నేరుగా రాజకీయ పెత్తనం లేకపోవడమే కాకుండా పారిశ్రామిక దేశాలు బడుగు దేశాలపై ఆర్థిక ఆధిపత్యాన్ని సైతం చెలాయించడం లేదని చెబుతున్నారు. ప్రపంచ మార్కెట్‌లో ఏకీకృత (హోమోజినైజింగ్) ధోరణిని వ్యతిరేకించే అన్ని రకాల సామ్రాజ్యవాద స్వరూపాలు



ఆ మార్కెట్ వల్లనే నిర్మూలించ బడ్డాయని చెబుతున్నారు. సామ్రాజ్యవాదమనేది పెట్టుబడులు కొన్ని మార్గాల ద్వారానే ప్రవహించడాన్ని అనుమతిస్తుందని, ఆ ప్రవాహాలకు కొన్ని మార్గాలను నిర్దేశిస్తుందని, ప్రాదేశిక ఆంక్షలు విధిస్తుందని, కొన్ని మార్గాలను నిరోధిస్తుందని వారు చెబుతున్నారు. "కాని ప్రపంచమార్కెట్‌కు ఎటువంటి నిబంధనలు, ఆంక్షలు లేని సాఫీ అయిన వాతావరణం అవసరం. ...సామ్రాజ్యవాదాన్ని అధిగమించక పోతే అది పెట్టుబడికి మరణ శాసనమే. ప్రపంచ మార్కెట్‌ను పూర్తిగా సాధించడమనేది సామ్రాజ్య వాదానికి అంతమే. 'కేంద్రము, అంచున ఉండే దేశాలు అన్న సిద్ధాంతం ఇప్పుడు పూర్తిగా నిరుపయోగమైందని వారంటారు. "ఉత్పత్తి వికేంద్రీకరణ, ప్రపంచ మార్కెట్ పటిష్టమవడం , అంతర్జాతీయ విభజన , ప్రపంచ వ్యాపితంగా పెట్టుబడులు శ్రమ ప్రవాహాలు ఫలితంగా విస్తారమైన భౌగోళిక ప్రాంతాలను కేంద్రం అంచున ఉన్న దేశాలు లేదా ఉత్తర దక్షిణ దేశాలు అనే పరిస్థితి లేకుండా పోయింది. అమెరికాకు -బ్రెజిల్‌కు, బ్రిటన్‌కు -ఇండియాకు స్వభావ పరమైన తేడా ఏమీ లేదు. తేడా అల్లా కేవలం తీవ్రతలో మాత్రమే."

నేటి ప్రపంచంలో అమెరికా సామ్రాజ్యవాదం కేంద్ర శక్తిగా ఉందన్న విషయాన్ని కూడ వారు వదిలి పెట్టారు. "అమెరికా ఆ మాటకొస్తే ఏ ఇతర జాతి రాజ్యం నేడు సామ్రాజ్యవాద ప్రాజెక్టుకు కేంద్రంగా ఉండలేదు... సామ్రాజ్యవాదం పని అయిపోయింది. గతంలో ఆధునిక ఐరోపా దేశాల మాదిరిగా ఏ దేశమూ ప్రపంచంలో నాయకత్వ పాత్ర వహించలేదు... సామ్రాజ్యవాద క్రమంలో వియత్నాం యుద్ధం చివరి ఘట్టంగా చెప్పవచ్చు. ఆ తర్వాత ప్రపంచం ఒక నూతన రాజ్యాంగ రాజ్యంలోకి అడుగు పెట్టింది." ఈ నూతన రాజ్యాంగ రాజ్యం మొదటి సారి గల్ఫ్ యుద్ధంలో అనుభవం లోకి వచ్చింది. ఈ యుద్ధంలో అమెరికా "అంతర్జాతీయ న్యాయాన్ని అమలు పరిచే ఏకైక శక్తిగా తన జాతీయ లక్ష్యాల సాధనగా పాల్గొన లేదు. ప్రపంచ న్యాయాన్ని సాధించడం అంటూ పాల్గొన్నది... సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం కాకుండా సామ్రాజ్య ప్రయోజనాల కోసం అమెరికా ప్రపంచ పోలీసు పాత్రను పోషించింది. ఈ విధంగా గల్ఫ్ యుద్ధం జార్జి బుష్ చెప్పినట్లు నూతన ప్రపంచ క్రమాన్ని ఆవిష్కరించింది." వారు సామ్రాజ్యంగా చెబుతున్న నూతన ప్రపంచ క్రమం సార్వభౌమాధిపత్యానికి రాజ్యాంగవాదానికి ప్రపంచ స్థాయిలో జరిగిన ఘర్షణ ఫలితంగా ఆవిర్భవించింది. నూతన తరహా జెఫర్సన్‌వాదం ముందుకొచ్చింది. అమెరికా రాజ్యాంగవాదం ప్రపంచానికి విస్తరించింది. ఇదీ వారి వాదన. దీన్ని నూతన తరహా వాదమని చెబుతున్నారు.

ఇప్పుడు పాత తరహాకు చెందిన మరొక వాదం గురించి చూద్దాం. వామపక్షంలో సైతం ఇది పాత తరహా అని చెప్పుకోవచ్చు. ఇవాన్ మేస్‌జరాస్ తన నూతన గ్రంథం 'సోషలిజం ఆర్ బార్బేరిజం' (సోషలిజమా, ఆటవికవాదమా)లో దీన్ని వివరించారు. పెట్టుబడి ప్రపంచీకరణ సరియైన దిశగా వయనిస్తే నూతన తరహా విశ్వవాదం ఆవిర్భవిస్తుందనడాన్ని ఆయన తిరస్కరిస్తారు.

పెట్టుబడి ఆధిపత్యం కలిగిన వ్యవస్థ శాశ్వతం చేయబడితే దానికి పూర్తి విరుద్ధమైనవ రిణామం సంభవిస్తుందని ఆయన చెబుతారు. "బలవంతంగా తెచ్చిపెట్టే ప్రపంచీకరణ , పెట్టుబడి యొక్క అసమానత అనే తొలగించలేని జాఢ్యం విశ్వవాదం అనే మాటకే పూర్తి విరుద్ధమైనవి... సామాజిక ప్రపంచంలో నిజమైన సమానత్వం లేకుండా విశ్వవాదం అనే ప్రశ్నే లేదు." పెట్టుబడి ఆధిపత్యాన్ని సజీవ సామాజిక సంబంధంగా అర్థం చేసుకోవాలని మేస్‌జరాస్ చెబుతారు. సంక్లిష్టమైన సంబంధాల సమూహంగా దాన్నిపరిశీలించాలి. "పెట్టుబడి వ్యవస్థ అరణ్యం లాంటి వైరుధ్యాలతో నిండి ఉంటుంది. ఈ వైరుధ్యాలను తాత్కాలికంగా నెమ్మదింప చేయవచ్చునేమోగాని పూర్తిగా నిర్మూలించడం అసాధ్యం." పెట్టుబడిదారీ వ్యవస్థలో నిర్మూలించలేని వైరుధ్యాలలో ప్రధానమైనవి: 1,ఉత్పత్తి, దానిపై అదుపు, 2, ఉత్పత్తి ,వినియోగం 3, పోటీ ,గుత్తాధిపత్యం 4, అభివృద్ధి ,వెనుకబాటుతనం (కేంద్రం, అంచున ఉన్న దేశాలు) 5, ప్రపంచ ఆర్థిక విస్తరణ, అంతర పెట్టుబడిదారీ శతృత్వాలు 6, పెట్టుబడి సమీకరణ, సంక్షోభం 7, ఉత్పత్తి ,విధ్వంసం 8, శ్రమ ఆధిపత్యం, శ్రమపై ఆధారపడటం 9, ఉపాధి, నిరుద్యోగం 10, అనింటికీ తెగించి ఉత్పత్తిని పెంచడం, పర్యావరణ విధ్వంసం. "దీనికి పూర్తి స్థాయి ప్రత్యామ్నాయాన్ని నిర్మించడం మాట అలా ఉంచి ఈ వైరుధ్యాలలో ఏ ఒక్కదాన్ని సైతం నిర్మూలించడం సాధ్యమయ్యే పని కాదు." అని మేస్‌జెరాస్ చెబుతున్నారు.

ఈ విశ్లేషణ ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థ చారిత్రిక పురోగమన దశ అంతమయింది. పెట్టుబడిదారీ వ్యవస్థ భూగోళమంతా విస్తరించింది. కానీ ప్రపంచంలోని చాలా ప్రాంతాలలో అది కేవలం పెట్టుబడి ఆవరణాలను మాత్రమే ఉత్పత్తి చేసింది. ఆర్థికంగా వెనుకబడిన దేశాలు సంపన్న దేశాలను అందుకునే అవకాశం ఎంత మాత్రం లేదు. అందుకోవడం అలా ఉంచి నికరమైన ఆర్థిక సామాజిక అభివృద్ధిని కొనసాగించడం కూడ సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ప్రపంచ వ్యాపితంగా కార్మికుల జీవన పరిస్థితులు దిగజారుతున్నాయి. 1970వ దశకంలో ప్రారంభమయిన సుదీర్ఘ వ్యవస్థాగత సంక్షోభం వైరుధ్యాలను పరిష్కరించుకోవడానికి పెట్టుబడికి తాత్కాలికంగానయినా అవకాశం ఇవ్వడం లేదు. బయటినుండి రాజ్యం ద్వారా లభించే మద్దతు వ్యవస్థకు వూపునివ్వడానికి ఎంత మాత్రం సరిపోవడం లేదు. అందువల్ల అదుపుచెయ్యలేని పెట్టుబడి విధ్వంసకత్వం, గత సామాజిక సంబంధాలను ధ్వంసం చేయడం, వాటి స్థానంలో నిలకడయిన ఏ ప్రత్యామ్నాయాన్ని రూపొందించలేకపోవడం అనే లక్షణాలు అంతకంతకూ మరింతగా ముందుకొస్తున్నాయి. మనం ఇప్పుడు నివసిస్తున్నది సామ్రాజ్యవాదం యొక్క అత్యంత వినాశకరమైన దశ అన్నది మేస్‌జెరాస్ విశ్లేషణ లోని కీలకమైన అంశం. సామ్రాజ్యవాదాన్ని మూడు స్పష్టమైన చారిత్రిక దశలుగా విభజించవచ్చునని ఆయన చెబుతారు. అవి 1, తొలి ఆధునిక వలస వాదం 2, లెనిన్ చెప్పిన క్లాసికల్ సామ్రాజ్యవాదం 3, అమెరికా ఆధిపత్యశక్తిగా ఉన్న ప్రపంచాధిపత్య సామ్రాజ్యవాదం. ఈ తృతీయ దశ రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 1970 వ్యవస్థాగత సంక్షోభం తర్వాత మరింత ఘనీభవించింది. ఇతర పెట్టుబడిదారీ దేశాలతో పోల్చుకున్నపుడు అమెరికా తన ఆర్థిక పరిస్థితి దిగజారకుండా జాగ్రత్తపడ్డప్పటికీ ప్రపంచ వ్యవస్థపై తగినంత ఆధిపత్యాన్నిమాత్రం సంపాదించలేక పోయింది. అందువల్లనే పెట్టుబడి యొక్క రాజ్యం పాత్రను నిర్వహించడానికి అమెరికా ప్రమాదకరమైన రీతిలో ప్రయత్నిస్తున్నది.

మేస్‌జరాస్ ఇలా చెబుతున్నారు: "ఇది ఎంత పెద్దదయినప్పటికీ ఒక ప్రాంతాన్ని అదుపు చేయడానికి సంబంధించిన సమస్య కాదు. కొంతమంది ప్రత్యర్థుల చర్యలను సహించడం లేదా అణచివేయడానికి సంబంధించిన అంశం కాదు. మొత్తం వ్యవస్థనే ఒక ఆర్థిక, సైనిక ఆధిపత్య అగ్రరాజ్యం అదుపు చేయడం. ఈ అదుపు కోసం అన్ని పద్ధతులనూ అనుసరిస్తుంది. అవసరమైతే అత్యంత నిరంకుశ చర్యలకు, సైనిక చర్యలకు సైతం పాల్పడుతుంది. పరస్పర విరుద్ధమైన వైరుధ్యాలను అదుపు చేసే విఫల ప్రయత్నంలో ప్రపంచవ్యాపితంగా అభివృద్ధిచెందిన పెట్టుబడి అంతిమంగా 'అనుసరించే పద్ధతి ఇది. ప్రపంచాధిపత్యంపై నాజీల సిద్ధాంతంతో సహా ప్రస్తుత పెట్టుబడి వ్యవస్థ చారిత్రక దశకు ఈ విశ్లేషణ కచ్చితంగా వర్తిస్తుంది."

నేరుగా ఇతర ప్రాంతాలపై రాజకీయ అధికారం లేకపోవడం వల్ల అమెరికా సామ్రాజ్యవాదం కొంత సాత్వికమైనదని చెప్పడం ఎంతమాత్రం సరికాదు. నేటి పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ఇది దోహద పడదు. మేస్‌జెరాస్ చెప్పినట్లుగా ఐరోపా వలసవాదం అంచున ఉన్న దేశాలలో వాస్తవానికి కొద్ది ప్రాంతాన్ని మాత్రమే ఆక్రమించు కున్నది. ఇప్పుడు పద్ధతులు మారాయి. సామ్రాజ్యవాదం పట్టు మాత్రం బాగా పెరిగింది. అమెరికా నేడు సైనిక స్థావరాల పేరుతో అరవై తొమ్మిది దేశాలలో పరాయి ప్రాంతాలపై ఆధిపత్యం కలిగి ఉన్నది. ఈ సంఖ్య ఇంకా పెరుగుతున్నది. ఇంకా చెప్పాలంటే "నేడు సైనిక ఆయుధాల విధ్వంసక శక్తి అనేక రెట్లు పెరిగింది. ముఖ్యంగా వైమానిక ఆయుధాలు అతి ప్రమాదకరంగా మారాయి. అందువల్ల లొంగదీసుకోదలచిన దేశంపై తమ హుకుంలను అమలు జరిపే పద్ధతుల్లోను మార్పులు వచ్చాయి. పదాతి దళాలు, ప్రత్యక్ష ఆక్రమణ ఇప్పుడు అంతగా అవసరం లేదు. అయితే సారాంశంలో మాత్రం ఎటువంటి మార్పు లేదు." సోవియట్ యూనియన్ కుప్పకూలిన తర్వాత, ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిన తర్వాత సామ్రాజ్యవాదం కొత్త దుస్తులు ధరించాల్సిన అవసరం ఏర్పడింది. ఇతర దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ప్రచ్ఛన్నయుద్ధం సాకు ఇప్పుడు పనికి రాదు. సద్దాం హుస్సేన్ లాంటి వారు కొంత పనికివచ్చినా అది తాత్కాలికమే. అప్పుడు కూడ అమెరికా విశ్వకూటమి, ప్రపంచ హక్కు లాంటి పేర్లతో మాత్రమే జోక్యం చేసుకోవలసి వచ్చింది. అయితే అమెరికాయే న్యాయ మూర్తి పాత్రను, అమలు చేసే.పాత్రను నిర్వహించింది.

'సోషలిజమా, ఆటవికవాదమా' పేర్కొన్న ఆందోళన కర అంశాలలో ఇవి ఉన్నాయి: ఇరాక్ పౌరప్రాంతాలపై జరిగిన దాడిలో పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం సంభవించింది. యుద్ధం ఆరంభమయిన నాటినుండి అమలు జరిపిన ఆంక్షల ఫలితంగా ఐదు లక్షల మంది పిల్లలు అసువులు కోల్పోయారు. బాల్కన్లపై సైనిక దాడి, ఆక్రమణ జరిగింది. ఐక్యరాజ్యసమితికి బదులుగా నాటోను దాడికి ఆయుధంగా చేసుకోవడం అనే నూతన విధానాన్ని అమెరికా చేపట్టింది. ఐక్యరాజ్యసమితిని మరింత నిర్వీర్యం చేయడానికి, త్రోసిపుచ్చడానికి అమెరికా ప్రయత్నించింది. బెల్‌గ్రేడ్‌లోని చైనా రాయబార కార్యాలయంపై బాంబు దాడి జరిగింది. చైనాకు వ్యతిరేకంగా అమెరికా జపాన్‌ల మధ్య రక్షణ ఒప్పందం

(మిగతా 21వ పేజీలో)

సామ్రాజ్యవాదం

గుత్త పెట్టుబడిదారీ విధానం పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యున్నత, ఆఖరుదశ. ఈ శతాబ్ది ప్రారంభంలో పెట్టుబడిదారీ గుత్త సంస్థల యొక్క, ద్రవ్య పెట్టుబడి యొక్క ఆధిపత్యం నెలకొని, ముఖ్యమైన పెట్టుబడిదారీ రాజ్యాల మధ్య భౌగోళికంగా ప్రపంచ విభజన పూర్తి అయినప్పుడు సామ్రాజ్యవాదం ప్రారంభమయింది. సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలనూ, ఎగుమతి మార్కెట్ల కోసం, ముడిపదార్థాల వనరులకోసం వాటి పోరాటాన్నీ, ఇతర దేశాల భూభాగాల కోసం, వాటి ప్రజలను బానిసలుగా చేసుకోవడం కోసం, ప్రపంచ సర్వాధిపత్యం కోసం వాటి వెంపర్లాటనూ పెట్టుబడిదారీ విధాన అసమానాభివృద్ధి తీవ్రతరం చేస్తుంది. ఇది వినాశకర యుద్ధాలకు దారితీసింది. దీన్ని తొలగించి, దీని స్థానాన్ని మనిషిని మనిషి దోపిడీ చేయడమన్న బెడదలేని సోషలిస్టు సమాజం (కమ్యూనిజం ప్రథమ దశ) ఆక్రమిస్తుంది.

కరిగిన కల కాదు
చెరగని నిజం సోషలిజం

తెలకపల్లి రవి

ఎందుకు జరిగింది? ఎలా సాధ్యమైంది? లెనిన్ తపస్సు, స్టాలిన్ సేద్యం ఫలించి వెలసిన మహత్తర సామ్యవాద దుర్గం- సోవియట్ యూనియన్ ఎలా విచ్ఛిన్నమైంది? పదేళ్లు గడచినా ప్రతి ప్రగతిశీల వాది హృదయాన్ని తొలచి వేస్తున్న ప్రశ్నలు ఇంకా మిగిలే వున్నాయి. సోవియట్ విచ్ఛిన్నంతో చరిత్ర అంతమైందని సూత్రీకరణలు చేసిన వారి మాట అటుంచి , నూతన చరిత్ర నిర్మాణంకై ముమ్ముందుకు సాగుతూనే వున్న నవ శక్తులూ ఈ ప్రశ్నలకు సమాధానం కోసం అన్వేషణ కొనసాగిస్తూనే వున్నాయి.

ప్రపంచవ్యాపితంగా మార్క్సిస్టు సిద్ధాంత అనుయాయులు, చరిత్ర కారులు ఇప్పటికే అనేక విలువైన విశ్లేషణలు చేశారు. వివరాలు అందించారు. గోర్బచెవ్ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యంగా 1987-89 మధ్య కాలంలోనే భావి పరిణామాల సూచనలు గుర్తించబడ్డాయి. సి.పి.ఐ(ఎం) 1987లోనే సోవియట్ నాయకత్వ ఆలోచనలు పెడదోవ పట్టిన వైనాన్ని నిర్దిష్టంగా ఎత్తి చూపింది. తూర్పు యూరప్ పరిణామాలపై మరో తీర్మానం విడుదల చేసింది. సోవియట్ విచ్ఛిన్నం తర్వాత 1992లో మద్రాసు మహాసభలో వివరమైన తీర్మానం ఆమోదించింది. అంతకు ముందు కూడా 1976లోనే సోవియట్ సమాజంలో పొడసూపుతున్న కొన్ని సమస్యలను మాకినేని బసవ పున్నయ్య విమర్శనాత్మకంగా విశ్లేషించారు. యూరోపియన్ కమ్యూనిస్టు పార్టీల నాయకులు, వామపక్ష వ్యాఖ్యాతలు పుస్తకాలు రాశారు. అవాస్తవిక విమర్శలు, అతి వ్యాఖ్యానాలు కొన్ని వున్నా అవి చాలా సమాచారం అందిస్తాయి.

తాజాగా స్టీఫెన్ వైట్ అనే ప్రొఫెసర్ "రష్యన్ న్యూ పాలిటిక్స్" అనే పేరిట పెద్ద పుస్తకం రాశారు. చైనా పార్టీ కేంద్ర రాజకీయ పాఠశాల ఉపాధ్యక్షుడు యాన్ చుంగయి విషయాలపై తమ అవగాహనను , అనుభవాన్ని వివరిస్తూ రాసిన వ్యాసాన్ని మార్క్సిస్టు పత్రికలో పునర్ముద్రించారు. (త్వరలో అది తెలుగులో పుస్తకంగా వెలువడనుంది.) సారాంశం ఏదైనా హెన్రీ స్మిత్ రాసిన 'న్యూ రష్యన్స్' గోర్బచెవ్ పథకాల అమలు తీరును తెల్పితే పాల్ ఎం సుజీ 'పోస్ట్ రివల్యూషనరీ సొసైటీ' పుస్తకం కృశ్చేవ్, బ్రెజ్నెవ్‌ల కాలపు సైద్ధాంతిక లోపాలను కళ్లకు కడుతుంది.

సోషలిజం నిర్మాణం ఒక సంక్లిష్ట సుదీర్ఘ ప్రక్రియ. మానవ చరిత్రలో ప్రతి వ్యవస్థా నిలదొక్కుకోవడానికి

చాలా కష్టాలు పడింది. పరిణామ క్రమం ఎప్పుడూ సరళరేఖలా సాగలేదు. పురోగమనం, వంకర టింకర మలుపులు, వెనకంజలు ,మళ్లీ ముందుకు చరిత్ర పొడుగునా కనిపించే సత్యం. అభివృద్ధి పట్ల గతి తార్కిక అవగాహన సారాంశమే అది. ఈ ఎగుడు దిగుళ్లు సోషలిజానికీ వర్తించుతాయి. నాయకత్వం వహించే పార్టీ వ్యక్తుల తప్పొప్పులను బట్టి ఈ పరిణామ క్రమం వేగవంతం కావచ్చు. వెనక్కు పోవచ్చు. కాని మలుపులు మాత్రం అనివార్యం. పెట్టుబడిదారీ విధానం రాచరికంపై పై చేయి సాధించిన తర్వాత కూడా బ్రిటన్‌లో నిలదొక్కుకోవడానికి 48 ఏళ్లు పట్టింది. అదే ఫ్రాన్స్‌లో మరింత ఎక్కువ- 86 ఏళ్లు అవసరమైంది. మౌలికంగా ఫ్యూడలిజం క్యాపిటలిజం దోపిడీ వర్గ సమాజాలే. అవి నిలదొక్కుకోవడానికే అంత సమయం పడితే దోపిడీని నిర్మూలించే సోషలిజం మరెంత సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కోవలసి వుంటుంది?

తరచూ చెప్పుకునే రెండో విషయం- సోషలిజం మార్క్సు, ఎంగెల్సులు ఊహించినట్టు బాగా అభివృద్ధి చెందిన దేశంలో గాక వెనకబడిన దేశంలో వచ్చింది. అందుకు లెనిన్ సృజనాత్మక అన్వయం దోహదపడింది. పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి అత్యున్నత స్థాయికి చేరిన తర్వాత దాన్ని కూలదోసి సోషలిజం వచ్చివుంటే అది వేరే విషయం. అలాగాక వెనకబడిన దేశాలలో రావడం వల్ల ప్రత్యేక సమస్యలు ఎదురైనాయి. అందులోనూ సోవియట్‌ను పొత్తిళ్లలోనే పీక నులమాలని 14 దేశాలు చుట్టు ముట్టడం దేశంలో పాత వ్యవస్థను కాపాడుకోవాలనే శక్తులు అంతర్యుద్ధాలు రగిలించడం పరిస్థితిని బీభత్సంగా మార్చేసింది.. ఈ కారణాల వల్ల సోవియట్ స్వీయాభివృద్ధిపై కేంద్రీకరించడానికి అవసరమైన ఉపశమనం లభించలేదు. అంటే ఇంటా బయిటా శత్రువులతో పోరాడటం దాన్ని ఆటంక పరచింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి నిరోధక శక్తుల కేంద్రాలుగా మారిపోవడం ప్రత్యేక సమస్యలు తెచ్చిపెట్టింది.

సోషలిజం అనేది వాస్తవ భౌతిక పరిస్థితులను బట్టి నిర్మించవలసిందే గానీ ఊహాజనితమైంది కాదు. అదే దాని ప్రత్యేకత. అందుకే లెనిన్ నాటి పరిస్థితికి తగినట్టు ఎన్.ఇ.పి (నూతన ఆర్థిక) ప్రారంభించారు. పెట్టుబడిదారీ తరహా చర్యలను తీసుకుని ఉత్పత్తి పెంచడానికి ప్రయివేటు చొరవను ప్రోత్సహించారు. అంతా స్థంభించి వున్న నాటి స్థితిలో అది అవసరమైంది. ఇది తిరోగమనమేనని, అయినా తాత్కాలికంగా తప్పదని ఆయన చెప్పారు. అదే సమయంలో లెనిన్ శ్రామిక వర్గ చొరవను పెంచే పిలుపులు ఇచ్చి సుబ్బోత్నిక్ (పని చేసే శనివారం) ల ద్వారా భారీ ఎత్తున స్వచ్ఛంద శ్రమను ప్రోత్సహించారు. స్టాలిన్ ఈ కృషిలో కీలక పాత్ర వహించారు. ఇది దేశమంతటినీ ఉత్సాహ పరచింది. ఉత్పత్తి అపారంగా పెరిగింది. తర్వాతి కాలంలో సోవియట్ ప్రతిష్టకు , ప్రభావానికి ఈ కాలమే కీలకమైంది. 1922 నాటికి ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తిలో ఒక్క శాతం మాత్రమే తయారు చేస్తున్న సోవియట్ రెండవ ప్రపంచ యుద్ధం

ప్రారంభం నాటికి పది శాతం ఉత్పత్తికి చేరుకోగలిగింది. ఆకలి దశకంగా పేరు పొందిన 30లలో పెట్టుబడి దారీ ప్రపంచ సంక్షోభం మధ్య ఒక్క సోవియట్ మాత్రమే సుస్థిరంగా పురోగమించింది. అయితే ఈ సందర్భంగా ఇంటా బయటా దుష్టశక్తుల కుట్రలను వమ్ము చేయడానికి అనేక ప్రక్షాళన చర్యలు తీసుకున్నారు.(అప్పట్లో ఆ విచారణలన్నీ బహిరంగంగానే జరిగాయి. అయినా వాటిలో కొంత మితిమీరి వ్యవహరించడం జరిగిందని, కాని ఆ నాటి పరిస్థితులు అత్యంత సంక్లిష్టమైనవనేది కూడా సాధారణంగా అంగీకరించిన సత్యం) 1934లో స్టాలిన్ సోవియట్ బాగా అభివృద్ధి చెందిందని , ఇక దేశంలో శతృవర్గాలు లేవని వివిధరకాలైన వైరుధ్యాలు అంతరించాయని ప్రకటించారు. నాటి అమోఘ అభివృద్ధి నేపథ్యంలో ఈ అంచనాకు రావడానికి చాలా ఆస్కారమున్నా అది వాస్తవం కాదని , సోషలిజం నిర్మాణంలో దశలను , అలాగే పరాజిత దోపిడీ వర్గాల దుష్టవ్యూహాలను విస్మరించడానికి ఇది దారి తీసిందని తర్వాత గుర్తించబడింది. ఈ లోగా హిట్లర్ రంగప్రవేశం సోవియట్‌ను అతిదారుణంగా దెబ్బతీసింది. రెండుకోట్ల మంది ప్రాణాలర్పించి పోరాడారు. 'నాజీల కారణంగా 32 వేల ఫ్యాక్టరీలు, లక్ష సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు, 70 వేల గ్రామాలు, 1700 పట్టణాలు ధ్వంసమయ్యాయి.. ఈ మహా వినాశాన్ని తట్టుకుని తిరిగి అభివృద్ధి పథం చేబట్టింది. ఇది ప్రపంచ చరిత్రలో అపూర్వమైన ఘట్టం. దీనంతటికీ నాయకుడైన స్టాలిన్ సామ్రాజ్యవాద దేశాల నేతలతో వ్యూహప్రతివ్యూహాలు నెరపి ప్రపంచ భవితవ్యాన్ని తీర్చిదిద్దారు. తమ జీవిత కాలంలో అత్యధిక ప్రజాదరణ పొంది అత్యంత కీలకపాత్ర వహించిన వ్యక్తిగా స్టాలిన్ సహజంగానే జేజేలందుకున్నారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ నేతగా వెలుగొందారు. అందుకే సామ్రాజ్యవాదులు తమ దాడికి స్టాలిన్‌ను లక్ష్యంగా చేసుకున్నారు.

స్టాలిన్ మరణానంతరం అధికారం చేబట్టిన కృశ్చేవ్ 1956లో ఆయనపై అత్యంత శతృపూరితమైన దాడి చేసి ప్రపంచ కమ్యూనిస్టులను దిగ్భ్రాంతికి , సామ్రాజ్య వాదులను హర్షామోదాలకు గురిచేశారు. స్టాలిన్ చర్యలలో పొరబాట్లను గుర్తించడం వేరు. ఆ పేరిట ఆయనను నరహంతకుడుగా చిత్రించడం వేరు. వాస్తవానికి స్టాలిన్ విధానాల నుండి వైదొలగడానికి మొదటి మెట్టుగా కృశ్చేవ్ ఆయనపై దాడి చేశాడని అతి స్వల్ప కాలంలో తేలిపోయింది.. మార్పు కొనసాగింపు అనేది ఒక క్రమం. స్టాలిన్ స్థానాన్ని పూర్తిగా చెరిపేయాలని ప్రయత్నించడం ద్వారా కృశ్చేవ్ వాస్తవానికి కమ్యూనిస్టు శక్తులన్నిటినీ నిరాయుధం చేసి సోవియట్ సమాజాన్ని గందరగోళంలో ముంచేశారు. అంతటితో ఆగక సామ్రాజ్యవాదంతో శాంతియుత సహజీవన సిద్ధాంతం ప్రవేశ పెట్టారు. విప్లవం అవసరం లేకుండానే పాలక పార్టీలతో కలసి సామాజిక మార్పు సాధించవచ్చనే భ్రమలను సిద్ధాంతాలు తెచ్చారు.

కమ్యూనిస్టు మూల సూత్రాలైన వర్గదృష్టినుంచి వైదొలగిన కృశ్చేవ్ నాయకత్వం అవాస్తవ అంచనాలకు రావడం సహజ పరిణామమే. సామ్రాజ్యవాదం కోటు గుండీ వంటిదనడం, ఐరాస వేదికపై చెప్పు చూపించడం వంటి చర్యలతో కృశ్చేవ్ పరిహాసాస్పదంగా వ్యవహరించారు. ఇంకో వైపున ఉత్పత్తి శక్తుల అభివృద్ధి గురించి నిర్దిష్ట దృష్టిలేకుండానే 1980 నాటికి సోవియట్ కమ్యూనిజం దశలో ప్రవేశిస్తుందని టైం టేబుల్ ప్రకటించారు. స్టాలిన్‌ను నియంత అంటూ దుమ్మెత్తి పోసిన కృశ్చేవ్ ప్రజల సోషలిస్టు చైతన్యాన్ని రాజకీయస్పృహను పెంచే చర్యలు తీసుకోకపోగా పార్టీకి ప్రజలకు దూరం పెరగడానికి కారకులైనారు. . ప్రజల పాత్ర, పార్టీ పాత్ర తగ్గించి అధికార వ్యవస్థ పట్టు బిగియడానికి , సమాజంలో అవలక్షణాలు పొడసూపే చర్యలకు కారకులయ్యారు.

కృశ్చేవ్ అత్యంత అవమానకరంగా తొలగించబడి, బ్రెజ్నేవ్ ఆ స్థానానికి ఎన్నికయ్యే నాటికి సోవియట్ ఆర్థిక సామర్థ్యం అపారంగా వుంది. ఇందుకు కారణం అది వరకటి కాలంలో వేసిన పునాదులే. 1970 నాటికి ప్రపంచ ఉత్పత్తిలో అయిదో వంతు సోవియట్ చేస్తున్నది. 144 దేశాలతో దానికి దౌత్య సంబంధాలు ఏర్పడి వున్నాయి. ప్రపంచ రాజకీయాలలో దాని ప్రతిష్ట బాగా వుంది. అమెరికా కూడా ఆయుధ ఒప్పందాలు నామకార్థంగానైనా కుదుర్చుకుంటున్నది. అయితే అప్పటికే మాంద్యం లక్షణాలు తిష్టవేశాయి. కృశ్చేవ్ హయాంలో వెనకపట్టుపట్టిన సైద్ధాంతిక స్ఫూర్తిని పునరుద్ధరించే చర్యలు తీసుకోలేదు. బ్రెజ్నేవ్ హయాంలో స్టాలిన్ పట్ల అచారిత్రిక

విఛ్చిన్నం వెనక ఎన్ని కారణాలు!

గోర్బచెవ్ హయాంలో సోవియట్ విచ్చిన్నానికి వెనక స్పష్టమైన రాజకీయ కారణాలు వున్నాయి. నిజానికి అవి కృశ్చేవ్ హయాంలో మార్పుల కొనసాగింపు లాటివే.

❋ కృశ్చేవ్ సూత్రీకరణలతో ఉత్తేజం పొంది, ఇరవయ్యవ మహాసభ సంతానం అని పిలవబడే మేధావులు నాయకుల బృందం ఒకటి సోవియట్‌లో కొనసాగుతూ వచ్చింది. కృశ్చేవ్ హయాంలోనే మాస్కోకు సుదూరంగా సైబీరియాలో యూనివర్సిటీల సముదాయం ఒకటి స్థాపించారు. సోషలిజంలో ఇమడటం ఇష్టంలేని మేధావులు రాజధానికి దూరమైనప్పటికీ యధేచ్ఛ వుంటుందనే దృష్ట్యా అక్కడకు వెళ్లి ఇష్టానుసారం మసల గలిగేవారు.

❋ సోషలిజం అభివృద్ధి చెందుతున్న కొద్ది పౌర స్వేచ్ఛలు, ప్రమాణాలు పెరగాలనేది సరైందే. అయితే ఈ మేధావులలో చాలా మంది కోరుకున్నది ప్రజా బాహుళ్య దృష్టితో కాదు. తమ స్వీయ రచనలు, పరిశోధనలు, భావాల వ్యాప్తికి పాశ్చాత్య సంపర్కానికి అవకాశం లేకపోవడమే వారి నెక్కువగా బాధించింది. వారి వ్యాఖ్యలు, ఇంటర్వ్యూలలో కూడా సమాజం గురించిన ధ్యాన కన్నా వ్యక్తి వాద ప్రతిపాదనలే అధికమయ్యాయి.

కృశ్చేవ్

గోర్బచెవ్

❋ స్వీయ వృద్ధికి సంబంధించిన కెరీరిస్టు దృష్టి పెరిగి, కమ్యూనిస్టు సిద్ధాంతాలపై విశ్వాసం లేకపోయినా కేవలం పదవుల కోసం పార్టీలో చేరే ధోరణి పెరిగింది.

❋ గోర్బచెవ్ , షెవర్ద్నాడ్జె, ఎల్సిన్ వంటి వారు మొదట్లో పెద్ద తీవ్ర వాదుల వలె మామూలు కన్నా అతిగా క్రమశిక్షణ అంటూ హడావుడి చేసేవారు !

❋ గోర్బచెవ్ అధికారంలోకి వచ్చాక పార్టీ నిర్ణయాత్మక స్థానాల్లో 80 శాతం మందిని మార్చేసాడు. వీరిలో అత్యధికులు పైన చెప్పినటువంటి ఇరవయ్యవ పార్టీ మహాసభ సంతానమే! వీరిని అంతకు ముందు ప్రచ్ఛన్న సంస్కరణ వాదులు అనేవారట....

❋ గోర్బచెవ్ సమాజంలో మార్పులు తేవడానికి ముందు మీడియాను ఎన్నుకున్నాడు. సర్వేల పేరిట సోషలిజం ఉనికినే ప్రశ్నించే అంశాలను చర్చకు వదిలాడు. నాటక సినిమా రంగాన్ని కూడా వాడుకున్నాడు. ఆయన సలహా దారులు సహాయకులు అందరూ ఆ కోవకు చెందిన వారే. పార్టీ ప్రధాన కార్యదర్శి సర్వాతీతుడనే భావం ఆ పార్టీలో పాతుకు పోయి వుండటం వల్ల లిగచెవ్ వంటి వారు విమర్శలు చేస్తున్నా మౌలికంగా ఎదుర్కోలేకపోయారని ప్రకాష్ కరత్ ఒకసారి రాశారు.

❋ సోవియట్ వుండకపోతే తమ అధికారానికే ప్రమాదమని తెలిసీ మితవాదులు ఇలా ఎందుకు చేశారనేది ఒక ప్రశ్న. దీనికి ఎంగెల్సు రాసిన ఒక లేఖలో జవాబు లభిస్తుంది. పాలకులు అవకాశ వాదులైతే వున్న వ్యవస్థను మార్చేసి అయినా తమ అధికారం కాపాడుకోవాలనుకుంటారని అయన చెబుతాడు.

పైన చెప్పిన నేపథ్యంలో సోషలిజంపై విశ్వాసం కోల్పోయిన సోవియట్ నేతలు చాలా మంది దాన్ని కూలదోసి అయినా తామే గద్దెపై కొనసాగాలని కోరుకున్నారు. ఇప్పటి రష్యా నేతలలో 80 శాతం మంది ఇది వరకటి కమ్యూనిస్టులేనని తెలుసుకుంటే ఈ సత్యం బోధ పడుతుంది.

వైఖరిని సవరించుకోలేదు. ఇంకో వైపున ప్రణాళికల రూపకల్పన గజిబిజిగా తయారైంది. విదేశీ సంబంధాలలో కూడా వర్గదృష్టి, కమ్యూనిస్టు అవగాహన లోపించాయి. అమెరికా కమ్యూనిస్టు వ్యతిరేకత కారణంగా రక్షణరంగంలో విదేశీ వ్యవహారాలలో సోవియట్ శాంతి సంరక్షణ పాత్ర కొనసాగింది. కాని దేశంలో సమాజ జీవితంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే చర్యలు తీసుకోకపోగా అసంతృప్తి పెరిగింది, అవినీతికి, అవలక్షణాలకు గట్టిబీజాలు పడ్డాయి. నాయకత్వం మాత్రం ప్రవర్థితసోషలిజం అనే చెబుతూ వచ్చింది.

ఈ పూర్వరంగంలో 1982లో యూరీ ఆంద్రొపోవ్ పగ్గాలు చేపట్టగానే పరిస్థితిని చక్కదిద్దడానికి కొన్ని చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ఉత్పత్తి రంగంలో అవ్యవస్థను చక్కదిద్దడానికి , కార్మికులతో ప్రత్యక్షంగా చర్చించి భాగస్వామ్యం పెంచడానికి ప్రాధాన్యత నిచ్చారు. సోషలిజం అనేది సుదీర్ఘ కాలం పట్టే ప్రక్రియ తప్ప హడావుడిగా వచ్చేది కాదని తొలిసారిగా ఆయన స్పష్టం చేశారు. సమాజ జీవితంలో దుర్లక్షణాలు తొలగించడానికీ కృషి చేశారు. బ్రెజ్నెవ్ సన్నిహిత బంధువులతో సహా అవినీతి పరులపై చర్యలు తీసుకోవడానికి వెనకాడలేదు. అయితే పదవి చేపట్టే నాటికే 65 ఏళ్లు పైబడిన ఆంద్రొపోవ్ అతి స్వల్ప కాలంలోనే అస్వస్థులై కన్నుమూశారు.



స్వల్పకాలం పాటు చెర్నంకో వున్న తర్వాత గోర్బచెవ్ నాయకత్వం చేపట్టారు. సోవియట్ సోషలిజం అప్పుడు మూల మలుపులో వుంది. గోర్బచెవ్ వున్న అవకాశాలను ఉపయోగించుకుని సోషలిజాన్ని అభివృద్ధి చేసే బదులు పెట్టుబడిదారీ తరహా ఆలోచనా ధోరణకి గురైనాడు. అంత ఆత్మహత్యా సదృశంగా వ్యవహరించిన నాయకుడు ఆధునిక చరిత్రలో అగుపించడు. తొలుత గోర్బచెవ్ కమ్యూనిస్టు పరిభాషలోనే మాట్లాడారు. మొదట్లో ఆమోదం పొందడం కోసం అలా చేశాడని అనతికాలంలో స్పష్టమైంది. గోర్బచెవ్ తొలి రోజులలో పెట్టుబడిదారీ విధానం శత్రువని, సోషలిజం గొప్పదని చెబుతూ వచ్చారు. తమ సమాజంలో లోపాలు తొలగించుకోవడానికి సంస్కరణలు అవసరమన్నారు. అవి ఎలా వుంటాయో స్పష్టమైన తర్వాత , ఆయన వర్గ దృష్టి విడనాడి మానవ విలువలు, మానవతా పూరిత సోషలిజం అంటూ పల్లవి అందుకున్నాక మాత్రమే ఆయన నిజస్వరూపం వెల్లడైంది. ఆ వెంటనే తొలిగా వ్యతిరేకించిన పార్టీ సి.పి.ఐ(ఎం) కావడం గమనార్హం. అత్యధిక ప్రజలకు మేలు చేసే సోషలిజం నుంచి దృష్టి మరలించడానికి తెచ్చిన మానవ విలువల సిద్ధాంతాన్ని ప్రథమ సోషలిస్టు దేశాధినేత వల్లించడం మొదలెట్టాక ఇక అంతా తలకిందులవడంలో ఆశ్చర్యం ఏముంటుంది? తన భావాలు అమలు జరపడం కోసం ఆయన పార్టీ చరిత్రలోనే లేని స్థాయిలో కమిటీల సభ్యత్వాలను మార్చివేసి తన మద్దతు దారులతో నింపివేశాడు. ఆంద్రొపోవ్ హయాంలో ప్రణాళికల రూపకల్పనలో కార్మిక సంఘాలను సంప్రదించే పద్ధతి పునరుద్ధరించగా గోర్బచెవ్ మాత్రం మహాసభలలో కార్మిక ప్రాతినిధ్యం బాగా తగ్గించే మార్పులు తెచ్చి తన ప్రతిపాదనలు నెగ్గించుకున్నారు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం పనికిరాదని, పార్టీలో పోటీ వేదికలు పెట్టుకోవచ్చని కార్యదర్శి గోర్బచెవ్ పార్టీని తనే ఒకో పోటు పొడుస్తూ అంతిమంగా రద్దు చేసినట్టు ప్రకటించారు. సోషలిజంలో ఉత్పత్తి పరిణామం నాణ్యత పెంచి ప్రజలను సంతృప్తి పరచడం, శ్రామిక వర్గ నియంతృత్వం పరిధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం అవసరం కాగా గోర్బచెవ్ బూర్జువా ప్రజాస్వామ్య పథంలో పయనించారు. నిజానికి మితవాద దిగజారుడుకు పరాకాష్ట గోర్బచెవ్. సోషలిజం నిర్మాణానికి సంబంధించిన సమగ్ర దృష్టి, చిత్త శుద్ధి, నిర్మాణ దక్షత లేకుండా అటు అతిశయోక్తులకు(1980 నాటికి కమ్యూనిజం వచ్చేస్తుంది, వగైరాలు) ఇటు మితవాద తరహాలో దివాళాకోరు సూత్రీకరణలకు(శాంతియుత సహజీవనం, బూర్జువా తరహా విశృంఖలత్వం) గురైన ఫలితం చివరకు గోర్బచెవ్ శల్యసారథ్యంలో సోవియట్ విచ్ఛిన్నానికి దారితీసింది.

ఏమైనా ప్రపంచ చరిత్రలో శ్రామిక వర్గానికి పాలనానుభవం అతి తక్కువ. రాజ్యాంగ యంత్ర నిర్వహణ, ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, పార్టీకి, ప్రజలకు, నాయకులకు వుండే సంబంధాలు , సామాజికి నైతిక సాంస్కృతిక విలువలు అన్నీ చరిత్ర క్రమంలో రూపొందవలసినవే తప్ప రెడీమేడ్ పరిష్కారాలు లేవు. ఇవన్నీ బలీయమైన సామ్రాజ్యవాద ప్రత్యక్షపరోక్షదాడిని ఎదుర్కొంటూ చేయవలసిన బృహత్తర కర్తవ్యాలు. మార్క్సిస్టు మహోపాధ్యాయుల బోధనలను ఆయా దేశాలలో నిర్దిష్టపరిస్థితలకు అన్వయిస్తూ ముందుకు సాగడం, తప్పుల నుంచి నేర్చుకుంటూ ఒప్పుల వైపు నడవడం తప్ప మార్గాంతరం లేదు.

సోవియట్ కన్నా ముందు పతనమైన తూర్పు యూరప్ దేశాల నుంచి అనేక పాఠాలు తీసుకోవలసి వుంటుంది. ఏ దేశమూ మక్కీకి మక్కీగా మరో దేశాన్ని అనుసరించడం సరైంది కాదు. సోవియట్ నమూనాను యథాతథంగా అనుసరించడం, తర్వాత రివిజనిస్టు పోకడలకు లోనవడం ఆ దేశాలలో సోషలిజాన్ని చిన్నాభిన్నం చేసింది.

చైనాతో సహా మిగిలిన సోషలిస్టు దేశాలు ఈ అనుభవాల నుండి నేర్చుకుని తమ వ్యవస్థను కాపాడుకోగలిగాయి. ముఖ్యంగా చైనా ఈ నాడు బలీయమైన ఆర్థిక శక్తిగా తయారవుతున్నది. అది కూడా అతివాద మితవాద తప్పిదాలకు గురైంది. అయితే సోవియట్‌లో స్టాలిన్ సమస్యలాగే మావో మరణానంతరం ఆయన తప్పిదాల గురించి చర్చ వచ్చినపుడు వాటిని నిస్సంకోచంగా ఎత్తిచూపుతూనే ఆయన మహత్తర పాత్రను నొక్కి చెప్పడం చైనా పార్టీ ప్రత్యేకత.

అంటే చారిత్రక, ఆర్థిక, రాజకీయ అంశాలన్నిటిలోనూ స్వీయ మానసిక ధోరణిని, తాత్కాలిక మనుగడను ఉత్సాహ నిరుత్సాహాలను బట్టిగాక వాస్తవాల ప్రాతిపదిక నిర్ణయాలు చేసి అమలు జరపడం ద్వారానే మార్క్సుబోధలను అమలు జరపడం సాధ్యమవుతుంది. ఉత్పత్తి పెంచకుండా, ఉత్పత్తి శక్తులైన ప్రజలను ప్రత్యక్ష భాగస్వాములను చేయకుండా సోషలిజం పురోగమించదు. అదే విధంగా సామ్రాజ్యవాదం పట్ల అప్రమత్తత లేకపోతే ఎప్పుడైనా కాటు వేయగలుగుతుంది. రీగన్ సోవియట్‌ను దుష్ట సామ్రాజ్యం అని విషం కక్కుతుంటే పట్టించుకోకుండా గోర్బచెవ్ పరస్పరాధారిత ప్రపంచం అంటూ మంత్ర జపం చేసి ఎల్సిన్ కు దేశాన్ని ధారాదత్తం చేశారు. రష్యాలో సోవియట్ విచ్ఛిన్నానంతర శిథిలతను ప్రపంచమంతా గమనిస్తోంది. బూర్జువా ప్రజాస్వామ్య బూటకత్వం ఎల్సిన్ పార్లమెంటుపై ట్యాంకులు నడిపినప్పుడే తేలిపోయింది. ప్రావ్దాలో సత్యం వుండదు అని ఎద్దేవా చేసిన వారు ఇప్పుడు రష్యాలో సెన్సార్‌షిప్ పెట్టాలంటున్నారు. విదేశీ పెట్టుబడిదారులు, దేశీయ దళారులు, మాఫియాల కబంధ హస్తాల్లో చిక్కిన రష్యన్లు విలవిలలాడి పోతున్నారు. ఈ కారణంగానే ఆక్కడా ఇతర మాజీ సోషలిస్టు దేశాలలో పూర్వపు కమ్యూనిస్టులకు ఆదరణ, విజయాలు పెరుగుతున్నాయి.

సోషలిజం నిర్మాణం చాలా కష్టభూయిష్టమైన ప్రక్రియ కనుక అనేక మలుపులు, మజిలీలు, ఎదురుదెబ్బలు సంభవిస్తుంటాయని సదా గమనంలో వుంచుకోవాలి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వ పాత్ర , దాని నాయకత్వం తప్పులు చేయకుండా జాగ్రత్త పడటం ఈ క్రమం వేగంగా సాగడానికి దోహదపడతాయి. జరిగిన తప్పుల నుంచి పాఠాలు తీసుకుంటూ శ్రామికవర్గం ప్రస్థానం సాగిస్తుంది. తప్పుల నుంచి నేర్చుకుని సరిదిద్దుకోవడమే సిద్ధాంత స్పష్టతకు ప్రధాన మార్గమని ఎంగెల్సు అన్న మాట ఈ సందర్భంగా స్మరించుకోవాలి.

“కంగారు పడవలసిన పని లేదు. మార్క్సిజం అదృశ్యమైందని , అది ఇంకెంత మాత్రం ఉపయోగపడదని అనుకోకండి. అదేం ఓడి పోలేదు. అలాటి భావాలు నిజం కాదు......” అని డెంగ్ సియావో పింగ్ అన్న మాటలు అక్షర సత్యాలు.

సెప్టెంబర్ 11 అంతర్జాతీయ పరిణామాల తర్వాత ప్రపంచ ప్రజలు అమెరికా సామ్రాజ్య వాద ప్రమాదాన్ని మరింత సూటిగా చూడగలుతున్నారు. ఇలాటి ఆధిపత్య యుద్ధోన్మాద ధోరణులకు ప్రత్యామ్నాయం సోషలిజం ద్వారానే సాధ్యం. సోషలిజం అంటే కేవలం ఒక ఆర్థికమో, రాజకీయమో మాత్రమే కాదు. సర్వ సమగ్ర ప్రత్యామ్నాయమైన ఒక వ్యవస్థ. దాన్ని నిర్మించడానికి అన్ని చోట్ల ఒకే కొలమానాలు కాలమానాలు వుండవు. పదేళ్ల కిందటి ఎదురు దెబ్బలు దాని విశిష్టతను గాని విజయాలను గాని అదృశ్యం చేయజాలవు.

సోషలిజం కరిగిన కల కాదు, చెరగని నిజం !

అపూర్వ పుస్తక సేకరణ
స్ఫూర్తి : డా॥ వెలగా వెంకటప్పయ్య
అలమూరి విక్రమ్, సజ్జావారిపాలెం,
వేమూరు Cell : 9392055065

పట్టణప్రాంతాలలో పార్టీ నిర్మాణం చాలా కీలకమైనది. చైనా విప్లవానికి ముందు పట్టణాలలో పార్టీ నిర్మాణానికి గాను చైనా కమ్యూనిస్టు పార్టీ అనుసరించిన పద్ధతులను, తీసుకున్న జాగ్రత్తలను ఈ వ్యాసం విశ్లేషిస్తుంది.

పట్టణప్రాంతాల్లో పార్టీ పని
షాంఘై అనుభవం

పట్టణాలలో మా కృషిని సాగించటంలో మా ముందున్న లక్ష్యాలు ఇవి :

1. పునాది వర్గాల ప్రజలను ఆర్గనైజు చేయటం. (పునాది వర్గాల ప్రజలు అంటే మా భావం కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితర మేధావులు)
2. ఐక్య సంఘటనను నెలకొల్పటం.
3. శత్రు శ్రేణులలోకి చొచ్చుకుపోవటం.
4. గ్రామీణ ప్రాంతాలలోని సాయుధ పోరాటానికి నేరుగా సహకరించడం.

ఈ నాలుగు అంశాలలోనూ మొదటిది మౌలికమైనదీ, ప్రధానమైనదీ కూడా. పునాది వర్గాలకు చెందిన విశాలజన బాహుళ్యాన్ని విస్తృతంగా ఆర్గనైజు చేయకుండా మిగిలిన మూడు అంశాలనూ పరిపూర్తి చేయలేం.

1. ప్రజలను విస్తృతంగా ఆర్గనైజు (నిర్మాణయుతం) చేయటం.

పట్టణాలలో శత్రువుతో మేము పోరాడే క్రమంలో మేము సాగించిన పోరాటాలు ప్రజాపోరాటాలు, సాయుధ పోరాటం కాదు. ప్రజాపోరాటాన్ని ప్రారంభించే ముందు మనం పెద్ద ఎత్తున ప్రచార కృషి సాగించి ప్రజలను విస్తృతంగా నిర్మాణయుతం చేయాలి. పార్టీ నిర్మాణం వెనుక వారిని సమైక్య పరచాలి. నిశ్చయాత్మకమైన యుద్ధంలో శత్రువుతో తలపడదానికే మేము అత్యున్నత పోరాట రూపాన్ని ఉపయోగించాము. స్థూలంగా చెప్పాలంటే, మేము చట్టబద్ధ అవకాశాలన్నిటినీ పూర్తిగా వినియోగించుకున్నాము. విశాలజన బాహుళ్యాన్ని విస్తృతంగా ఆర్గనైజు చేయాలంటే చట్టబద్ధమైన బహిరంగ పోరాట రూపాలను ఉపయోగించాలి. ఎందువల్ల నంటే, మనం కేవలం రహస్య పోరాట రూపాలనుమాత్రమే ఉపయోగించుకొనేటట్లయితే దాని పరిధి చాలా స్వల్పంగా ఉంటుంది. పాక్షికంగా బహిరంగంగా వుండే కార్యకలాపాలను మాత్రమే నిర్వహించినట్లయితే అప్పుడు కూడా దాని పరిధి పరిమితంగానే వుంటుంది.

పార్టీ నిర్మాణం రహస్యంగా ఉండాలని అంటున్నాం. ఎంత రహస్యంగా ఉంటే అంతమంచిది. అయితే ప్రజా సంఘం మాత్రం బహిరంగంగానే వుండాలి. అది ఎంత విస్తృతంగా వుంటే అంతమంచిది, చట్టబద్ధ అవకాశాలను ఉపయోగించుకోవడమంటే మా భావం సామాజిక ఆచారాలు, అలవాట్లు తదితరాలు ఏమేరకు అనుమతిస్తే ఆ మేరకు పూర్తిగా ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఉదాహరణకు వివిధ సెక్షన్ల ప్రజలకోసం వివిధ ప్రజా సంఘాలను నిర్వహించాం. కార్మికులకు ట్రేడ్ యూనియను, విద్యార్థులకు విద్యార్థి సంఘం, ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ సంఘం, అలాగే ఇంకా ఎన్నో.

కొమింటాంగ్ వచ్చే ముందు లభించిన కాలాన్ని ట్రేడ్ యూనియన్ ఆర్గనైజ్ చేయడానికి సన్నాహక కమిటీని రూపొందించటానికి ఉపయోగించుకున్నాం. (అంతకు) ముందు మాకు మా స్వంత ట్రేడ్ యూనియన్ లేదు. ఆ సన్నాహక కమిటీలలో మా పార్టీ సభ్యులు కూడా ఉన్నారు. కానీ వారా కమిటీలలో సాధారణ కార్మికుల హోదాతోనే ఉన్నారు. అంతేతప్ప కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల పేరిట కాదు. జౌళి మిల్లులు, ఇంజనీరింగ్ పరిశ్రమలు, పబ్లిక్ రంగ పరిశ్రమలు (పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్) ఈ రంగాలలోని ట్రేడ్ యూనియన్లు మా చేతులలో ఉండేవి. కొమింటాంగ్ వచ్చిన తర్వాత మా ట్రేడ్ యూనియన్ల మీద అజమాయిషీ చెలాయించడానికి ప్రయత్నించారు. ట్రేడ్ యూనియన్లు రిజిష్టరు చేయాలని ఆదేశించారు. లేనట్లయితే వాటిని రద్దు చేస్తామని ప్రకటించారు. మేం ట్రేడ్ యూనియన్లను రిజిష్టరు చేశాం. రిజిస్ట్రేషను తర్వాత కొమింటాంగ్ తన మనుష్యులను మా ట్రేడ్ యూనియన్లలోకి పంపించింది. మేము వారిని రానిచ్చాం. కానీ ట్రేడ్ యూనియన్ లోపలనే వారితో పోరాటం నిర్వహించాం. మా ట్రేడ్ యూనియన్లతోపాటు కొమింటాంగ్ కూడా అనేక ట్రేడ్ యూనియన్లను ఆర్గనైజ్ చేసింది. కొమింటాంగ్ అజమాయిషీ ఉన్న ఫ్యాక్టరీలలో మాకు కూడా కార్మికులున్నారు. అందువలన మేము కూడా వారి యూనియన్లలో చేరాము. మేము వాటిని పచ్చ (విద్రోహ) ట్రేడ్ యూనియన్లు అని పిలిచేవాళ్ళం. కొమింటాంగ్ నిర్వహణలో ఒక ట్రేడ్ యూనియన్ ఉన్నంతకాలం. వాటిలో కార్మిక జన బాహుళ్యం ఉన్నంతకాలం మేము కార్మిక జనబాహుళ్యంతోపాటు కొమింగ్‌టాంగ్‌తో కలిసి ఆ ట్రేడ్ యూనియన్లలో పనిచేశాం. కొమింటాంగ్ ట్రేడ్ యూనియన్ల నాయకులు సాధారణంగా కార్మిక వర్గ ప్రయోజనాల కోసం పనిచేసేవారు కారు. వారు దిగమ్రింగుడు స్వాములు. కార్మిక వ్యతిరేకులు. కార్మికులచే తీవ్రంగా ద్వేషించబడే వారిని ఏకాకులను చేసి వ్యతిరేకించటం, తక్కువ నేరాలను చేసిన వారినీ, కార్మిక వ్యతిరేకులు కాకుండా వారిపట్ల సానుభూతి కలిగివుండే వారిని మా వైపు రాబట్టుకొనటం ప్రధానంగా తీసుకున్నాం. కార్మికులను సమైక్య పరచడానికి, కార్మికుల ప్రయోజనాలకు అనుగుణ్యంగా చేయగలిగిందంతా చేయడానికి తద్వారా వారి విశ్వాసాన్ని చూరగొనడానికి మా శాయశక్తులా కృషి చేశాం. క్రమంగా అన్ని శ్రేణులలో నుండి కొంతమంది కార్మికులను కూడగట్టగలిగాం.



షాంఘై నగరంలో ఒక భాగం

వర్కుషాపులో నాయకత్వ స్థానాన్ని సాధించగలిగాం. రోజులు గడిచే కొద్దీ వర్కుషాపులో జరిగే వాస్తవిక కృషి మా చేతులలోకి వచ్చింది. (నాయకత్వ స్థానం మాత్రం కొమింటాంగ్‌ది) ఈ విధంగా అంతిమంగా మొత్తం సంస్థనే మేము అజమాయిషీ చేశాం. మెజారిటీ విద్యార్థి సంఘాలు మా పార్టీ చేతులలోనే ఉండేవి. విద్యార్థులలో కొమింటాంగ్ ప్రభావం అతి స్వల్పంగానే ఉండేది. ఆ సంఘాలలోని పని విధానం కూడా ట్రేడ్ యూనియన్ల మాదిరిగానే ఉండేది.

మా నిర్మాణం యొక్క రెండవ రూపం : పార్టీ నాయకత్వంలో మధ్యంతరంగా ఉండే ప్రజా సంఘాలను నెలకొల్పాం. అంటే అటువంటి సంఘాలకు రాజకీయ రంగు ఉండేది కాదు. మేము వాటిని సమగ్ర సాంస్కృతిక, వికాస సంఘాలు అనే వాళ్ళం. ఉదాహరణకు, జపాను వ్యతిరేక

యుద్ధకాలంలో, ప్రారంభంలో జపాను వ్యతిరేక జాతీయ విమోచన ప్రజానంఘాన్ని బహిరంగంగా ప్రారంభించాం. కానీ అది ఏమంత విస్తృతమైంది కాదు. జపానీయులు అణచివేతకొనసాగిస్తున్నకాలంలో అది అభివృద్ధి కాలేకపోయింది. విభిన్నమైన పేర్లనీ, రూపాలనీ – ఉదాహరణకు విరామసమయ వికాస కేంద్రాలు, క్లబ్బులు మొ॥ ఉపయోగించి చూశాం. ప్రజల ఆసక్తినీ, డిమాండ్లనూ ప్రాతిపదికగా తీసుకొని వారిని ఆర్గనైజు చేయడానికి ప్రయత్నించాం. ఉదాహరణకు పాటల దళాన్నీ, సంగీత శిక్షణాలయాన్నీ, ఆటలు, గ్రంథాలయాలు, అధ్యయన తరగతులు, చర్చాగోష్టులు మొ॥ వాటిని నిర్వహించాం. వేసవి కాలంలో ఈత టీములను ఆర్గనైజు చేశాం. అటువంటి సంస్థలు చట్టబద్ధమైనవి. ఉదాహరణకు పాటల బృందాన్ని తీసుకుందాం. సాధారణమైన పాటలు పాడటానికి పాటల బృందాలను నిర్వహించాం. కొద్దికాలం తర్వాత జపాను వ్యతిరేక విప్లవ గీతాలు పాడటానికి శిక్షణ నిచ్చాం. అప్పటికీ వారు దానితో తృప్తి పడలేదు. వారు గెరిల్లా పాటలు పాడ గోరారు. ఆ తర్వాత కొంతమంది గెరిల్లా దళాలలో కూడా చేరారు, అటువంటి సంస్థలలో క్రమంగా మా రాజకీయాలను ప్రచారం చేయడానికీ, వారి రాజకీయ చైతన్యాన్ని పెంపొందించి వారిని అభివృద్ధి చేయడానికీ కృషి చేశాం. నవలలు చదవటం మరొక ఉదాహరణ. ప్రారంభంలో మామూలు నవలలు చదివించాం కానీ కొంతకాలం తర్వాత అభ్యుదయ సాహిత్యం కావాలని వారు డిమాండు చేశారు. క్రమంగా మార్క్సిస్టు–లెనినిస్టు గ్రంథాలను చదివారు. చివరకు విప్లవంలో చేరారు. ఆ రోజుల్లో బ్యాంకుల్లోనూ, విదేశీ సంస్థలలోనూ, చైనా కార్మికులూ, సిబ్బందీ ఉండేవారు. మేము వారిని నిర్మాణయుతం చేశాము. 1937–38లో అంటే జపాను వ్యతిరేక యుద్ధ ప్రారంభ దినాలలో అటువంటి ప్రజా సంఘాలలో పనిచేసే కార్మికులూ, సిబ్బందీ దాదాపు 3000 వరకూ ఉండేవారు. కానీ తర్వాత ఆ సంఖ్య 10,000 వరకూ పెరిగింది. మొత్తం మీద రెండు లక్షల మంది ఈ పనిచేసేవారు. చట్టబద్ధమైన ఆచ్ఛాదనలో పార్టీ కృషిచేసింది. బ్యాంకులలోనూ, విదేశీ సంస్థలలోనూ ఉన్న పార్టీ సభ్యులు తమ పార్టీ సభ్యత్వ హోదాలో కాకుండా సాధారణమైన కార్మికులుగా, సిబ్బందిగా ఈ సంఘాలలో చేరారు. అటువంటి ప్రజా సంఘాలలో చేరిన వారి నుండి మేమే కొద్ది మందిని ఎంచుకొని చురుకైన కార్యకర్తలుగా రూపొందడానికి వారికి శిక్షణ ఇచ్చాం. వారి రాజకీయ చైతన్య స్థాయిని పెంపొందించి ఆ తర్వాత పార్టీలోకి రిక్రూట్ చేసుకున్నాం.

మూడవ రూపం: ప్రతిభావంతంగా ఉండిన చట్టబద్ధమైన సామాజిక సంఘాలను కదిలించడానికి కూడా మేము ప్రయత్నించాం. అందులో కొన్ని విదేశీయులకు చెందినవి కూడా (ఉదా: వై.ఎం.సి.ఎ.). మేము వాటిలో చేరి కార్యకలాపాలు కొనసాగించాం. మేము స్వజాతీయ సంఘాలలో కూడా చొచ్చుకుపోయి పార్టీ పని చేయడానికి అటువంటి సంఘాల చట్టబద్ధమైన హోదాను ఉపయోగించుకొన్నాం. వై.ఎం.సి.ఎ., వై.డబ్ల్యు.సి.ఎ. సంఘాలు (క్రైస్తవమత సంఘాలు Young Men's Christian Association, Young Women's Christian Association – అను) రాత్రి పాఠశాలలు, గ్రంథాలయాలు నడుపుతుండేవి. మేం అటువంటి గ్రంథాలయాల లోనూ, రాత్రి పాఠశాలలోనూ చేరి మా పార్టీ సభ్యులను ఉపాధ్యాయులుగా నియమించాం. కొన్నిసార్లు వారు ఇంగ్లీషు బోధించేవారు. ఉదాహరణకు ఉద్యోగం ఏర్పాటు చేయడం, విద్య, పాఠశాల, గ్రంథాలయం మొ॥ వాటిని నడపడం. ఇది దీర్ఘకాలికమైన కృషి. సాధారణంగా అటువంటి సంస్థలలో అభ్యుదయకర కృషి సాగించబడేది కాదు.

నాల్గవ రూపం: నిర్మాణయుతంగా లేని, చెల్లా చెదురుగానున్న 10 లేక 12 మంది వ్యక్తులను నిర్మాణయుతం చేసేవాళ్లం. ప్రత్యేకించి వాతావరణం చాలా చెడ్డగా వున్నప్పుడు అటువంటి వ్యక్తులను నిర్మాణయుతం చేయడానికి ప్రయత్నించాం. అంటే పెద్ద పెద్ద ప్రజా సంఘాలను నిర్మించుకోవడానికి పాలక వర్గాలు అనుమతించని సందర్భాలలోనన్న మాట. వారి జీవనభృతికి సంబంధించిన తక్షణ అవసరాలకు అనుగుణంగా వారిని ఆర్గనైజు చేశాం. ఉదాహరణకు కొంతమంది కార్మికుల వేతనాలు అతి స్వల్పంగా ఉండేవి. తమదైనందిన జీవితంలో వారు కష్టాలకడలిలో తేలియాడుతూ ఉండేవారు. అటువంటి : 10–12 మంది కార్మికులను ఒక

"పెద్ద పెద్ద నగరాలలో కార్మికవర్గం కేంద్రీకృతమై ఉంటుంది. అలాగే పెటీ బూర్జువా వర్గంలోని ఉన్నత శ్రేణి (ప్రొఫెసర్లు, ఉన్నత స్థానాలలో ఉండే మేధావులు) కూడా కేంద్రీకృతమై ఉంటుంది. అందువలన ఐక్య సంఘటనను ఆర్గనైజు చేయటం ముఖ్యం."

సహకార సంఘం స్థాపించుకొనేటట్లు ఆర్గనైజు చేశాం. వారి వర్గచైతన్యాన్ని క్రమంగా మేల్కొలిపాం. ఈ రకంగా మన మౌలిక సమస్యలను పరిష్కరించుకోలేమని వారికి చెప్పాం. మౌలిక సమస్యలను పరిష్కరించుకోవాలంటే సమాజ స్వరూపాన్నే క్షుణ్ణంగా మార్పు చేయాలని వారికి చెప్పాం. అంటే మనం విప్లవం సాధించాలి అని చెప్పాం. కొంత మంది ముందుకు వచ్చారు. వారిని రిక్రూట్ చేసుకున్నాం. అలా పునాది వర్గాల ప్రజలను నిర్మాణయుతం చేసే రూపాలు ఎన్నో ఉన్నాయి.

ఐదవ రూపం: "బాగా అధ్యయనం చేయండి. బాగా కృషి చేయండి. ప్రజలతో చెలిమిచేయండి" అన్న నినాదం ఇచ్చాం. ఒక పార్టీ సభ్యుడు ఒక కొత్త ప్రదేశానికి వెళ్ళినప్పుడు అది ఒక ఫ్యాక్టరీ అయినట్లయితే మా పార్టీ సభ్యుడు అక్కడ కార్మికుడుగా చేరేవాడు. మొట్టమొదట అతడు చేయవలసిన పని ఏమంటే అతడు బాగా పనిచేయాలి. తద్వారా అతడు తన తోటి సాధారణ కార్మికులలో ఒక ప్రతిష్ట సంపాదిస్తాడు. అప్పుడు మాత్రమే అతడు కార్మికులను తన వెనుక ఐక్యం చేయగలుగుతాడు. ఈ పార్టీ సభ్యుడు విద్యార్థి అయినట్లయితే అతడు బాగా చదవాలి. తన అధ్యయనంలో అతడు కొన్ని విజయాలు సాధించగలిగినట్లయితే మిగిలిన విద్యార్థులను ఐక్యం చేయగలుగుతాడు. కొద్దికాలం తర్వాత సాధారణ విద్యార్థులలో అతడు తనకొక ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న కారణంగా అతడిని తన తరగతి నాయకుడుగా ఎన్నుకొనే అవకాశం ఉంది. ఇలాంటి అవకాశాలే ఇంకా ఎన్నో. అందువలన "బాగా అధ్యయనం చెయ్యి. కష్టించి పనిచెయ్యి, ప్రజలతో చెలిమి చెయ్యి" అన్నది మా నినాదం:

ఆరవ రూపం: సాంస్కృతిక, విద్యా రంగాలలోని ప్రముఖ వ్యక్తులతో ఐక్యం కావడానికి కొద్దిమంది వ్యక్తులు సాపేక్షికంగా ప్రగతిశీలమైన సంఘాలను ఆర్గనైజు చేయటం. కానీ ఇది సంఖ్యరీత్యా గొప్పదిగా ఉండదు. అంతేగాక ఇది ఉన్నత శ్రేణికి సంబంధించినదిగా ఉంటుంది. దానిని ధృఢతరం చేయటానికి కొన్ని ప్రజాతంత్ర సంఘాలను, శాంతి సంఘాలను ఆర్గనైజు చేశాం. శాంతి, ప్రజాస్వామ్యంకోసం సాగిన ఉద్యమం ఇందుకు ఉదాహరణ. ఈ సంస్థల ద్వారా శాంతిని కాంక్షిస్తూ అంతర్యుద్ధాన్ని వ్యతిరేకించే వారితో మేము ఐక్యమయ్యాం. అటువంటి వ్యక్తుల మధ్యకు ప్రగతి శీలురు అన్న పేరుతో పార్టీ సభ్యులను పంపించాం. అటువంటి ప్రగతిశీల సంస్థల సభ్యులలో కొందరిపై అప్పుడప్పుడు కొమింటాంగ్ నేరారోపణ చేసి విచారించవచ్చును. వారిని కాపాడటానికి ప్రయత్నించాం. కొమింటాంగ్ నేర విచారణ బారినుండి వారిని కాపాడటానికి కొన్నిసార్లు వారిని హాంకాంగ్‌కో, విముక్త ప్రాంతాలకో తరలించడానికి కృషి చేశాం.

పై రూపాలన్నింటిలోనూ స్త్రీలు కూడా ఉండేవారు. దీనితోపాటు మహిళా సంఘాలుకూడా ఉండేవి. స్త్రీలయొక్క ప్రత్యేక డిమాండ్లు, అవసరాలకు అనుగుణంగా వారిని ఆర్గనైజు చేశాం. వృత్తులలో ఉన్న మహిళల కోసం మహిళా క్లబ్బులను నిర్వహించాం. అల్లిక పనులలో ఆసక్తి ఉన్నవారికోసం అల్లిక పనుల దళాలను ఆర్గనైజు చేశాం. ఇలాంటివి ఎన్నెన్నో...

2. ఐక్య సంఘటన: పెద్ద పెద్ద నగరాలలో కార్మికవర్గం కేంద్రీకృతమై ఉంటుంది. అలాగే పెటీ బూర్జువా వర్గంలోని ఉన్నత శ్రేణి (ప్రొఫెసర్లు, ఉన్నత స్థానాలలో ఉండే మేధావులు) కూడా కేంద్రీకృతమై ఉంటుంది. అందువలన ఐక్య సంఘటనను ఆర్గనైజు చేయటం ముఖ్యం. పట్టణాలలో ఐక్య సంఘటనను నెలకొల్పటంలోని ప్రధానలక్ష్యం జాతీయ బూర్జువా వర్గం. ఎందువల్లనంటే వారికి కూడా జపాను వ్యతిరేక డిమాండ్లున్నాయి. వారు జపాను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకులు. వారుకూడా జాతీయ విమోచనాన్ని కోరుతారు. అంతర్యుద్ధ కాలంలో జాతీయ బూర్జువా వర్గం అమెరికన్ సామ్రాజ్యవాదానికి, చియాంగ్ కై షేక్ కూ వ్యతిరేకంగా వుంది. అందువలన మేం వారిని మా వైపు సమీకరించుకోగలిగాం. మేము వివిధ దశలలో వివిధ నినాదాలు ఇచ్చాం. ఉదాహరణకు అమెరికన్ వస్తువులను బహిష్కరించాలనీ, చైనాలో తయారైన వస్తువులనే ఉపయోగించాలనీ నినాదమిచ్చాం. ఎందువల్లనంటే జాతీయ వాణిజ్యమూ, పరిశ్రమలూ ఈ రకంగా డిమాండు చేశాయి. ఈ నినాదం ఇవ్వటం ద్వారా మేము వారిని మా వైపు సమీకరించుకోగలిగాం.

జాతీయ బూర్జువా వర్గానికి కష్టాలు ఎదురైనప్పుడు- ఉదాహరణకు కొమింటాంగ్ వారిమీద భారీ ఎత్తున పన్నులు విధించినప్పుడు - ప్రయివేటు పరిశ్రమలనూ వాణిజ్యాన్నీ ఆదుకోవాలనే నినాదం ఇచ్చాం. ఆ రోజులలో విద్యారంగంలో నిధుల సంక్షోభం ఏర్పడింది. అప్పుడు విద్యారంగానికి నిధులు పెంచాలన్న నినాదం ఇచ్చాం. అటువంటి నినాదాల ద్వారా యూనివర్శిటీలు, కాలేజీలలోని ప్రొఫెసర్లు, అధికారులను మా వైపు సమీకరించుకోగలిగాం. షాంఘై విముక్తి కాబోతున్న సమయంలో ఫ్యాక్టరీలనూ, కర్మాగారాలను సంరక్షించుకోడానికి కార్మికులను ఆర్గనైజు చేశాం. ఆ సమయంలో కొమింటాంగ్ మీ ఫ్యాక్టరీలను విద్రోహ పూరితంగా విధ్వంసం చేయబూనుకున్నదని పెట్టుబడిదారులకు వివరించాం. తమ ఫ్యాక్టరీలను కాపాడుకోడానికి వారు మాతో చేతులు కలిపారు. ఇలాంటి ఉదాహరణలు ఇంకెన్నో వున్నాయి.

3. శత్రు శ్రేణులలోకి చొచ్చుకు పోవడం:

శత్రువు నిర్వహణలోవున్న రాజకీయ, ఆర్థిక, సైనిక సంస్థలలోకి మేము చొచ్చుకుపోయాం. సాధ్యమైతే సమాచారాన్ని సేకరించేందుకు వీలుగా సుదీర్ఘకాలం వాటిలో పనిచేయడానికీ, ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసేటట్లు ఆ సంస్థలలోని వారిని ప్రేరేపించడానికి మేమా సంస్థలలోకి చొరబడ్డాం. సహజంగానే ఈ పని చాలా ప్రత్యేకమైనది. అటువంటి పని చేయడానికి రాజకీయంగా విశ్వసనీయమైన పార్టీ కామ్రేడ్ ఉండాలి. ఎందువల్లనంటే వారు దీర్ఘకాలికమైన, కష్టభూయిష్టమైన కృషి చేయాలి. వారు కృషి చేయవలసింది ప్రగతి శీలురుగా గుర్తించబడడానికి కాదు. అటువంటి సంస్థలలో నాయకత్వస్థానాలలోకి ఎగబాకడానికి వారు కృషిచేయాలి. తద్వారా నాయకత్వ స్థానాన్ని తమ అదుపులో ఉంచుకోవాలి. మరింత మంది మిత్రులను సంపాదించడానికి కూడా కృషి చేయాలి. విముక్తికి పూర్వం షాంఘై పోలీస్ బ్యూరో అజమాయిషీలో 20 జిల్లాలు, సబ్ బ్యూరోలు వుండేవి. సబ్ బ్యూరోలన్నింటిలోనూ మా పార్టీ శాఖలు వుండేవి. ఇవి చిన్నా, పెద్దా పార్టీ శాఖలు. ఒక్కొక్క దానిలో 10 నుండి 20 మంది వరకు సభ్యులుండేవారు. షాంఘై పోలీసు బ్యూరోలో తుపాకులు మరమ్మత్తుచేసే సెక్షను ఒకటి వుంది. సాధారణంగా అక్కడ ఎప్పుడూ అనేక తుపాకులు మరమ్మత్తులో వుండేవి. మేము ఎల్లప్పుడూ మా తుపాకులనుకూడా అక్కడే మరమ్మత్తు చేయించే వాళ్లం. మరమ్మత్తు చేసిన తర్వాత మా తుపాకులను అక్కడే ఉంచేవాళ్లం. షాంఘైని ఆక్రమించుకోబోతున్న సందర్భంలో మేం వాటిని తీసుకున్నాం. (మా తుపాకులను భద్రంగా దాచుకోడానికి ఇంతకంటే క్షేమకరమైన ప్రదేశం ఇంకొకటి ఎక్కడుంటుంది).

గ్రామీణ ప్రాంతాలలోని పోరాటంతో ప్రత్యక్ష సహకారం

జపాను వ్యతిరేక యుద్ధం సాగుతుండిన కాలంలో షాంఘై పార్టీ కమిటీలోని నాయకత్వ స్థాయి కామ్రేడ్స్ ఎల్లవ్వుడూ అధ్యయనం చేయడానికి, పనిచేయడానికీ నూతన నాల్గవ సైన్యంలోకి వెళుతూ ఉండేవారు. స్థూలంగా చెప్పాలంటే పట్టణాలలో విప్లవ ప్రజా ఉద్యమం స్థావర ప్రాంతాలలోని సాయుధ పోరాటంతో సహకరించేదిగా ఉండాలి. ఐతే మేమీ పనిని యాంత్రికంగా చేయలేదు. 'మేమెల్లవ్వుడూ నగరంలోని వాస్తవిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకునే పనిచేశాం. నగరంలోని వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొనటం అంటే మా భావం వాస్తవికతలకు అనుగుణ్యంగా ఆయా అంశాలను నిర్ణయించాలి. మనకు తగినంత బలం ఉన్నదా! అటువంటి డిమాండు ఉన్నదా? ప్రజలు మనవైపునే ఉన్నారా! ఇటువంటివీ ఆ పరిస్థితులు.

> "మేమెల్లప్పుడూ నగరంలోని వాస్తవికపరిస్థితులను దృష్టిలో పెట్టుకునే పనిచేశాం. నగరంలోని వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొనటం అంటే మా భావం వాస్తవికతలకు అనుగుణ్యంగా ఆయా అంశాలను నిర్ణయించాలి. మనకు తగినంత బలం ఉన్నదా! అటువంటి డిమాండు ఉన్నదా? ప్రజలు మనవైపునే ఉన్నారా! ఇటువంటివీ ఆ పరిస్థితులు."

కానీ విముక్తి ప్రాంతాలకు ప్రత్యక్షంగా తోడ్పడే అనేక పనులు చేశాం. ఉదాహరణకు సాంకేతిక నిపుణులు, మేధావులు, డాక్టర్లు, నర్సులు మొ॥ వారిని విముక్త ప్రాంతాలకు నిరంతరం పంపిస్తూ వారితో ప్రత్యక్షంగా సహకరించాం. ఇది ఒక రకం.

రెండవ పద్ధతి: విముక్త ప్రాంతాలకు వివిధ రకాల పదార్థాలను, వస్తువులను పంపించడానికి కృషి చేశాం. ఉదాహరణకు యంత్రాలు: అక్కడ గనుక టంకశాల (Mint నాణాలను ముద్రించే స్థలం) ఉన్నట్లయితే అక్కడికి అచ్చు వేసే యంత్రాన్ని పంపించాం. అక్కడ ఆయుధాగారం ఉన్నట్లయితే ఆయుధాలను తయారుచేసే యంత్రాలను పంపించాం. వీటికితోడు నూలుగుడ్డలు, వైద్య పరికరాలు, మందులు మొ॥ ఎన్నో పంపించాం. ఒక్క మాటలో చెప్పాలంటే అక్కడి అవసరాలను బట్టి వివిధ రకాల సరుకులను, వస్తువులను, సామాగ్రినీ పంపించాం. శిక్షణా తరగతులకు హాజరుకావటానికి, అధ్యయనం చేయడానికీ మా కార్యకర్తలు వంతులవారీగా విముక్త ప్రాంతాలకు వెళ్లారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.)

ప్రతినిధులు అడిగిన ప్రశ్నలు:

1. బహిరంగ సంఘాలన్నింటిలోనూ పార్టీ రహస్య శాఖలను నెలకొల్పారా? వాటి మధ్య సంబంధాలను ఎలా నిర్వహించేవారు?
2. అటువంటి బహిరంగసంఘాలలో పనిచేసేటప్పుడు ఎదురైన సమస్యలేమిటి?
3. మీ విధానాన్ని ఎదుర్కోవడానికి శత్రువు అనుసరించిన విధానమేమిటి?
4. పార్టీ చేసిన ప్రత్యక్ష కృషి ఏమిటి?
5. ముద్రణ, ప్రచార కృషిని ఎలా నిర్వహించారు?

(చర్చల సారాంశం)

అంతర్జాతీయ సంఘటనల పట్ల సంఘీభావంగా ప్రజాప్రదర్శనలు నిర్వహించాం. కానీ ఈ ప్రదర్శనలను ప్రజాతంత్ర సంఘాల పేరు మీదనే నిర్వహించాం. కొన్ని సందర్భాలలో అసలు అస్థిత్వంలోనే లేని సంఘాల పేరు మీద కూడా అటువంటి ప్రదర్శనలు నిర్వహించాం.

విముక్తికి పూర్వం (పార్టీ) వార్షికోత్సవాల లాంటి వేమీ జరపలేదు. పార్టీనిర్మాణం పూర్తిగా రహస్యం గా ఉండేది. ఒక ఫ్యాక్టరీలో ముగ్గురు సభ్యులున్నట్లయితే వారితో ఒక పార్టీ శాఖను నిర్వహించాం. ఆ పార్టీ శాఖ క్రింద ముగ్గురికంటే ఎక్కువ మంది ఉంటే వారిని గ్రూపులుగా విభజించేవాళ్లం. వివిధ గ్రూపులలోని పార్టీ సభ్యులు ఒకరికొకరు తెలిసేవాళ్లు కాదు.

ఉత్పత్తి సంబంధాలు అంటే...

పాదార్థిక సంపదయొక్క సామాజిక ఉత్పత్తి, మార్పిడి, పంపిణీల క్రమంలో ప్రజల మధ్య ఉండే సంబంధాలు. ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి సాధనాలపై యాజమాన్య స్వభావం మీద ఆధారపడి వుంటాయి. ఉత్పాదక శక్తులు; ఉత్పత్తి సంబంధాలు - ఈ రెంటి సమ్మేళనే ఉత్పత్తి పద్ధతి. ఉత్పాదక శక్తులు అభివృద్ధి చెందడం, శ్రమ పరికరాలు నిర్దుష్టం కావడంవల్ల పాత ఉత్పత్తి సంబంధాలస్థానే, ఉత్పాదక శక్తుల ఉన్నత అభివృద్ధిస్థాయికి అనుగుణమైన కొత్త ఉత్పత్తిసంబంధాలు నెలకొంటాయి. సోషలిజానికి పూర్వపు సమాజంలో, ఉత్పత్తి సంబంధాలు పాలక, పాలిత, దోపిడీ, పీడన సంబంధాలు. ఈ విధంగా వ్యక్తిగత యాజమాన్య సంబంధాలు తుదకు, ఉత్పాదక శక్తుల అభివృద్ధికి అవరోధంగా తయారవుతాయి. వీటిస్థానాన్ని, ఉత్పత్తి సాధనాలపై పౌర యాజమాన్యం ప్రాతిపదికగాగల సోషలిస్టు సంబంధాలు ఆక్రమిస్తాయి. ఇది, దోపిడీనుండి విముక్తి పొందిన మానవుల పరస్పర సోదర సహకారానికి, సౌభ్రాతృత్వ పరస్పర సహాయ సంబంధాలకు దారితీస్తాయి. సోషలిజంలో ఉత్పత్తి సంబంధాలను, చైతన్యంతో, ఒక పథకం ప్రకారం, సమాజ ఉత్పాదక శక్తుల పెరుగుదలకు అనుగుణంగా మెరుగుపరచడం జరుగుతుంది.

సైద్ధాంతిక గ్రంధాలు

1.	కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక	మార్క్స్, ఎంగెల్స్	22.00
2.	నిత్య నూతన కర్తవ్య దీపిక కమ్యూనిస్టు ప్రణాళిక	సుకోమల్‌సేన్	10.00
3.	గోథా కార్యక్రమ విమర్శ	కార్ల్‌మార్క్స్	6.00
4.	కుటుంబం స్వంత ఆస్తి రాజ్యముల ఆవిర్భావం	ఫ్రెడరిక్ ఎంగెల్స్	26.00
5.	సోషలిజం: శాస్త్రీయం-ఊహాజనితం	ఎంగెల్స్	10.00
6.	ప్రాథమిక ఆర్థిక సూత్రాలు	మార్క్స్, ఎంగెల్స్	15.00
7.	ఏం చేయాలి?	లెనిన్	20.00
8.	లెనిన్ రచించిన ఏంచేయాలి గురించి	వి.పి. ఫిలటోవ్	10.00
9.	భారత కమ్యూనిస్టుపార్టీ(మార్క్సిస్టు) కార్యక్రమము		8.00
10.	పార్టీ కార్యక్రమంపై వివరణ వ్యాసాలు	సూర్జిత్, ప్రకాష్, ఏచూరి	10.00
11.	మార్క్సిజం-సమాజం	క్యూబా రచయితల వ్యాసాలు	15.00
12.	లెనినిజం-పునాదులు	స్టాలిన్	15.00
13.	పార్టీ పనివిధానం చక్కదిద్దుకుందాం	మావో	8.00
14.	కమ్యూనిస్టు నిపుణుడు	మావో	4.00
15.	కార్యకర్తలను నాయకులను ఎలా తయారు చేసుకోవాలి	స్టాలిన్, డిమిట్రోవ్ మావో, లీషావ్‌చీ, చౌఎన్‌లై	9.00
16.	మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలి	లీషావ్‌చీ (పార్టీ అంతరంగికపోరాటం)	15.00
17.	మార్క్సిజం అంటే ఏమిటి?	ఎమిలి బరన్స్	10.00
18.	సోషలిజం ఓనమాలు	లియో హ్యూబర్‌బన్	5.00
19.	మార్క్సిస్టు సిద్ధాంత సులభ పరిచయం	శివవర్మ	12.00
20.	మార్క్సిస్టు మూలగ్రంధాల సులభ పరిచయం	మారిస్‌కార్న్‌ఫోర్త్	15.00
21.	శాఖా కార్యదర్శుల పని విధానం		3.00
22.	భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు)నిబంధనావళి		3.00
23.	పార్టీ ఫ్రాక్షన్లు, ప్రజాసంఘాలు		4.00
24.	ఆందోళన-ప్రచారం-నిర్మాణం	సి.పి.ఐ(ఎం)రాష్ట్ర కమిటీ	15.00
25.	పార్టీ నిర్మాణం-ప్రజాసంఘాలు	లావుబాలగంగాధరరావు	10.00
26.	పార్టీ నిర్మాణావలోకనం	తెలకపల్లి రవి	7.00
27.	మార్క్సిజం అంటే ఏమిటి? (మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ తాత్విక రచనల నుండి)	సం॥హోవర్డ్ సెల్సం, హారీ మార్టెల్	8.00
28.	భౌతికవాదం-భావవాదం (మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ తాత్విక రచనల నుండి)	॥ ॥	12.00
29.	గతితర్కం, గతి తార్కికపద్ధతి	॥	12.00
30.	చారిత్రక భౌతికవాదం	మార్క్స్,ఎంగెల్స్	15.00
31.	గతితార్కిక చారిత్రక భౌతికవాదం	స్టాలిన్	5.00
32.	గతి తార్కిక భౌతికవాదం	నండూరి ప్రసాదరావు	12.00

పై పుస్తకాలుదొరకు చోటు

ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

లెనిన్ జైలు డైరీ

.... నేను జైల్లో ఏకాంత జీవితం గడుపుతూ, ప్రపంచాన్నీ , జీవితాన్నీ వాంఛిస్తూ అనుభవించిన వ్యధలో పరిపక్వత చెందాను. అయినా మన ఆశయం న్యాయసమ్మతం కాదేమోనన్న అనుమానం నా హృదయంలో ఎన్నడూ అంకురించలేదు. ఆశరక్తపుటేరుల్లోమునిగివున్నప్పుడు, వేలాదిస్వాతంత్ర్యయోధులు జైళ్ళలో బంధింపబడి వున్నప్పుడు, లేదా సైబీరియా మంచు ప్రదేశాల్లో నివసిస్తూన్నప్పుడు నేను గర్వంతో ఉప్పొంగిపోతాను. ఇప్పుడేకాదు బహుశా చాల సంవత్సరాలవరకు నా మనోస్థితి యిదే. ఇప్పటికే పాత వ్యవస్థను తుత్తునియలు చేసేందుకు అశేషప్రజానీకం పురోగమించడం చూస్తున్నాను. వారిలోకొత్తపోరాటాలు జరిపేందుకు తర్ఫీదు పొందుతున్న పోరాటయోధులున్నారు. వారితో నేను కలిసివున్నందుకు, వారిని స్వయంగా చూస్తున్నందుకు, వారితో కలిసి ఉద్వేగం పొందుతున్నందుకు, వారిని అర్థం చేసుకొంటున్నందుకు గర్విస్తున్నాను. నేను కూడా వారితో సన్నిహితుణ్ణై చాలా బాధలనుభవించినందుకు గర్విస్తున్నాను. నేనీ జైల్లో ఉండడం అప్పుడప్పుడు కష్టంగా ఉంటుంది. భయంకరంగా కూడా ఉంటుంది. ...అయినా, నేను మరోజన్మ ఎత్తి తిరిగి జీవయాత్ర ప్రారంభించవలసి వస్తే, యిదే విధంగా ప్రారంభిస్తాను. ఇది కేవలం విధి నిర్వహణ కోసం కాదు. తప్పనిసరైనందున కాదు. నాకిది స్వతస్సిద్ధమైన ఆవశ్యకత.

...నేనెన్నటికీ నాకర్మాన్ని నిందించను: అనేకసంవత్సరాల జైలు నిర్బంధాన్ని నిందించను. ఎందుచేతంటే, యీ భయంకరమైన "ప్రాసాదపు" గోడల బయటనున్న మరో పెద్ద జైలును కూల్చడానికి యీ బాధలన్నీ అవసరమని నేనెరుగుదును. నాది ఉబుసుపోని తాత్విక చింతన కాదు. బెరకైన లెక్కల అంచనా కాదు. స్వాతంత్ర్యం కొరకు, సంపూర్ణజీవితం కొరకు నాలోని పటుతర వాంఛయొక్క ఫలితమిది. అరుగో! అక్కడ నా కామ్రేడ్లు, స్నేహితులు నా ఆరోగ్యం కోసం సందేశాలందిస్తున్నారు. ఇక్కడ నేనుకూడా, జైలుకొట్లో ఒంటరిగా ఉన్నప్పటికీ, వారిని గురించే ఆలోచిస్తున్నాను. వారంతా చిరాయువులగుగాక. ఆయుధ ధారులగుదురుగాక. ప్రస్తుత పోరాట ఆశయానికి అర్హులగుదురు గాక:...

జూన్ 3, 1909

...జీవించడం అంటే అర్థం, విజయంపట్ల అకుంఠితమైన విశ్వాసం కలిగియుండడం కాదా?

సామ్రాజ్యవాదుల విఫల ప్రయోగశాల

అర్జెంటీనా

ఎం.కోటేశ్వరరావు

ప్రపంచంలో అత్యల్ప ద్రవ్యోల్బణం కలిగిన దేశాలలో ఒకటిగా అర్జెంటీనా జేజేలు అందుకుంది. ద్రవ్యలోటు 1990లో 6-8 మధ్య ఉండగా 1998 నాటికి 1.4 శాతానికి తగ్గింది. మరుసటి ఏడాది ధరలు పెరగపోగా తగ్గాయి. మాంద్యం ఉన్నప్పటికీ 1999లో ద్రవ్యలోటు ప్రపంచబ్యాంక్ సూచించే దానికంటే తక్కువగానే 2.6 శాతానికి పెరిగింది. అనేక సాంఘిక అభివృద్ధి సూచికలు గత పదేండ్లలో ఎంతో మెరుగుపడ్డాయి. శిశు మరణాలరేటు 25నుండి 18కి తగ్గింది. అభివృద్ధి రేటు కూడా ప్రపంచబ్యాంక్ అభిప్రాయం ప్రకారం పెరిగింది. పెట్టుబడిదారీ అర్ధశాస్త్రం ప్రకారం ఇవన్నీ శుభసూచనలే. అందుకే పెట్టుబడిదారీ అర్ధశాస్త్రవేత్తలు, ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్ సిద్ధాంతవేత్తల ప్రశంశలు పొందింది. వాటి ప్రమాణాలు, షరతుల ప్రకారం సంస్కరణలు అమలు జరిపి, అభివృద్ధి సూచికలను ప్రదర్శించి నాడు ప్రశంసలు పొందిన దేశం నేడు తలకు మించిన రుణభారంతో దివాళా ప్రకటించి, తీవ్రమాంద్యంలో కూరుకుపోయి తమను ఆదుకొమ్మని అడుగుతున్న దీనావస్థలో ఉంది. సంస్కరణలు జయప్రదమైతే మాంద్యం ఎందుకు వచ్చిందన్నది ప్రశ్న.

సంస్కరణలకు ప్రతిపక్షం సహకరించటంలేదని ఆరోపించే చంద్రబాబులు అక్కడ లేరు. అధికారంలో వారున్నా వీరున్నా పోటీ పడి అమలు జరిపింది ఒకే విధానాలు, అయినా సంస్కరణల ప్రయోగం ఘోరంగా విఫలం అయింది. ఒక నాడు ప్రశంసలతో పొంగిపోయిన అర్జెంటీనియన్లు తగిన ఫలితం అనుభవించాలన్న నేటి సూటిపోటి మాటలతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నానాటికీ పెరుగుతున్న అసంతృప్తిని సంఘటిత ఉద్యమనిర్మాణరూపమిచ్చి ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించే కార్మికవర్గ పార్టీలేని లోటు అక్కడ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. సందర్భంలో మార్క్సిజం-లెనినిజం విఫలం అయిందని పెట్టుబడిదారి విధానానిదే భవిష్యత్ అని చెప్పే వారు అర్జెంటీనా పరిణామాలను ఏవిధంగా నిర్వచిస్తారో చెప్పాలి.

ఆసియా టైగర్లు కుప్పకూలిన తరువాత ప్రయివేటీకరణ, ప్రభుత్వ ఖర్చు తగ్గింపు చర్యలను అమలు జరిపిన అర్జెంటీనాను పొగిడిన అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) ఇపుడు రుణం ఇచ్చేందుకు నిరాకరిస్తున్నది. గతంలో అంగీకరించిన మొత్తంలో 120కోట్ల డాలర్లు బిగబట్టుకుంది. రెండువేల ఒకటవ సంవత్సరం డిసెంబర్ మాసంలో చెల్లింపుల సంక్షోభం తలెత్తింది. కనుచూపు మేరలో పరిష్కారం కనిపించక రెండేళ్లనాడు ప్రజల అభిమానం పొందిన అధ్యక్షుడు ఫెర్నాండో డెలారువా దివాళా ప్రకటించి రాజధాని వదలి పారిపోయారు. లాటిన్ అమెరికా పారిస్‌గా పేరుపొందిన రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో జనం వీధి పోరాటాలు, లూటీలకు దిగారు. వివిధ ప్రాంతాలలో జరిగిన సంఘటనలలో 21 మంది ప్రాణాలు కోల్పోయారు.

ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్ సంస్థల ప్రయోగాలకు కేంద్రంగా మారిన అర్జెంటీనా విషాద పరిణామాలు అనేక మందికి కనువిప్పు కలిగిస్తున్నాయి. సామ్రాజ్యవాద ప్రసార మాధ్యమాలు అక్కడి పరిణామాలను తక్కువ చేసి చూపటానికి, లేదా మూసి పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. అంతర్జాతీయ సంస్థలు చెప్పిన చర్యలను తు:చ తప్పకుండా అమలు జరిపినా విఫలం కావటం వాటి దివాళాకోరుతనాన్ని వెల్లడించాయి. సమస్యల పరిష్కారం, అభివృద్ధికి ప్రపంచీకరణ పరిష్కారం కాక పోగా ధనిక దేశాల ప్రయోజనాలకే వాటి విధానాల లక్ష్యం అన్నది స్పష్టం. అర్జెంటీనాలో జరిగిన దానికి పూర్తి భాధ్యత బ్రెట్టన్‌ఉడ్ కవలలను రిమోట్‌తో నడిపిస్తున్న ధనిక దేశాలదే. బిబిసి నిర్వహించిన అభిప్రాయసేకరణలో అభిప్రాయాలు ప్రపంచ



రాజధాని వీధుల్లో భారీ ప్రదర్శనలు

ఆర్థికసంస్థల విధానాలను ప్రశ్నించేవారి సంఖ్య నానాటికి పెరుగుదలను సూచిస్తున్నాయి. వాటి సారాంశం ఇలా ఉంది. "అర్జెంటీనా వనరులు, ఉత్పత్తి, సేవలపై విదేశీ పెత్తనం ఉండటమే ప్రస్తుత సంక్షోభానికి ప్రధానకారణం. తరువాత వంతు మెక్సికోది, అక్కడ ఇంతకంటే దారుణమైన సంక్షోభం రాబోతున్నది. కాపిటలిజం, ప్రపంచీకరణదే ప్రధాన బాధ్యత. పదమూడు శాతం వేతనంలో కోత అంటే అమెరికా కార్మికులకు ఎలా ఉంటుందో ఆలోచించండండి. తరువాతి వంతు పరాగ్వేదే. ఐఎంఎఫ్ విధానాలు ప్రజలను ఇబ్బందులనుండి బయటపడవేసేవి కాదని ఇది రుజువు చేసింది." ఇలా చెప్పిన వారితోపాటు "మన కమ్యూనిస్ట్ వ్యతిరేక లక్ష్యాలను సాధించటానికి ఎంతో మానవ మూల్యంచెల్లించాల్సి వస్తున్నది. అందువలన అర్జెంటీనాను మనం రక్షించాలి, లేకుంటే అమెరికా వ్యతిరేక భావనలు మరింతగా పెరుగుతాయని" కూడా చెప్పిన వారున్నారు.

తాత్కాలిక అధ్యక్షుడు అడాల్ఫో రోడ్రిగెజ్ సా కూడా చేతులెత్తేశారు. ఆర్థికవ్యవస్థ బాగోగులు చూడడం తనవల్ల కూడా కావడం లేదని చెబుతూ రాజీనామా

లాటిన్ అమెరికాలో విముక్తి, సోషలిస్ట్ ఉద్యమాలు పెరగకుండా నిరోధించేందుకు అమెరికా ప్రోత్సహించిన మిలిటరీ నియంతల పాలనకు సంపద్వంతమైన అర్జెంటీనా కూడా గురైంది. అనేక దేశాలలోమాదిరే ప్రజా ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచారు. ఇరవై నుండి 30 వేలమంది యువతీ యువకులు అదృశ్యం అయ్యారు. నిజానికి వారంతా రహస్య పోలీసు దళాల చేతులలో హతులయ్యారు. అనేకమందిని విమానాలలో తీసుకువెళ్లి 13వేల అడుగున ఎత్తునుండి కిందికి తోసివేశారని ఒక సైన్యాధికారి వెల్లడించారు. అలాంటి నియంతలకు రోమన్ కాథలిక్ చర్చ్ కూడా మద్దతు ఇచ్చింది. అర్జెంటీనా సమీపంలోని ఫాక్‌లాండ్స్ దీవులు ఇంధన సంపదలతో ఉన్నాయి. మిలటరీ పాలకులు వివాదాస్పదమైన ఈదీవులను స్వాధీనం చేసుకోవటంతో బ్రిటన్-అర్జెంటీనా మధ్య 1982లో యుద్ధం చెలరేగింది. అర్జెంటీనా ఓడిపోవటంతో మిలటరీ నియంతలు అధికారం నుండి తప్పుకున్నారు. తరువాత పౌరపాలన ఏర్పడినప్పటికీ పరిస్థితులలో పెద్దగా మార్పేమీ లేదు. అమెరికా కనుసన్నలలో పనిచేసే ప్రభుత్వం పక్షం, ప్రతిపక్షం ఏర్పడ్డాయి. మిలిటరీ పాలన అంతమైన ఆరేండ్ల తరువాత 1989లో ప్రజాకర్షక నినాదాలతో అధికారానికి వచ్చిన కార్లోస్ మెనెమ్ అనుసరించిన విధానాలు ప్రస్తుత దుస్థితిని మరింత వేగం చేసేందుకు బాటవేశాయి. అమెరికా ఆదేశాల మేరకు తమ కరెన్సీ పెసోను డాలర్‌తో మారకానికి అనుసంధానం చేశారు. అంటే పౌరులు స్వేచ్ఛగా పెసోలు ఇచ్చి తమకు అవసరమైన మేరకు డాలర్లు కొనుగోలు చేయవచ్చు. ఈవిధానం అమెరికన్లతో పాటు తమ ప్రజల జీవితాలను మార్చివేస్తుందని మెనెమ్ కబుర్లు చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధీకరిస్తానని చెప్పిన పెద్దమనిషి అధికారానికి రాగానే అమెరికా పెట్టుబడిదారులు, ఐఎంఎఫ్ ఆదేశాల మేరకు నాలుగేండ్లలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా ప్రయివేటీకరణ అమలు జరిపిన గొప్ప సంస్కర్తగా పేరు ప్రఖ్యాతులు పొందారు. (మనదేశంలో చంద్రబాబునాయుడు అలాంటి పాత్ర పోషణకు తగిన వ్యక్తిగా గుర్తించిన ప్రపచంబ్యాంక్ అదే పనిచేయించింది.) బాంక్‌లు, రైలు, విమాన, టెలికం, ఒకటేమిటి అన్నింటినీ తెగనమ్మివేశారు. ప్రపంచబ్యాంక్ తన నివేదికలో ఇలా పేర్కొన్నది." రికార్డు టైమ్‌లో అన్ని ప్రధాన సంస్థలను ప్రయివేటీకరించి ప్రపంచంలో అర్జెంటీనాకు సాటిలేదనిపించింది." అని పొగడగా ఐఎంఎఫ్ అధిపతి మైకేల్ కామ్‌డెసెస్ "ఇటువంటి చర్యలు దీర్ఘకాలంలో అత్యంత నాణ్యమైన అభివృద్ధికి నిజంగా వెన్నుదన్నుగా ఉంటాయని" చెప్పారు. "ఐఎంఎఫ్ అర్జెంటీనా మధ్య ఒప్పందం ఒక్క లాటిన్ అమెరికా దేశాలకే గాక వర్ధమాన ప్రపంచ దేశాలకు ఒక నమూనా అవుతుందని" న్యూయార్క్‌టైమ్స్ పత్రిక మెనెమ్‌ను ఆకాశానికి ఎత్తింది. ఇదంతా ఆసియన్ దేశాల అభివృద్ధి గాలిబుడగ ఒక్కసారిగా పేలిపోక ముందునాటి మాట. దేశాన్ని అన్ని విధాలుగా దిగజార్చిన మెనెమ్ పెరోనిస్ట్ పార్టీ 1999 ఎన్నికలలో ఓడిపోయింది. ఈపార్టీనుండి ఫిరాయించినవారు, రాడికల్‌పార్టీ, తదితరులతో ఏర్పడిన సంకీర్ణకూటమి నాయకుడు డె లా రౌవా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అయితే పార్లమెంట్‌లో మెజారిటీ లేకపోవటంతో జాతీయ ప్రభుత్వ ఏర్పాటుకు పెరోనిస్ట్‌లను ఆహ్వానించినా తిరస్కరించారు.

ఆసియన్ టైగర్లు కూలిపోయిన తరువాత అసలు కథ మొదలైంది. అప్పటివరకు లాటిన్‌అమెరికా దేశాలలో అర్జెంటీనా వస్తువులు చౌక ధరలకు లభ్యం అయ్యేవి. సంక్షోభంనుండి బయట పడేందుకు ఆసియన్‌దేశాలు చౌకగా మార్కెటింగ్ చేయటంతో అక్కడినుండి కారుచౌకగా ఎగుమతులు ప్రారంభమై ప్రపంచంలో అనేక దేశాలు అతలాకుతలం అయ్యాయి. సంక్షోభానికి ముందు అర్జెంటీనా నెలకు ఆసియానుండి 3.4లక్షల జతల బూట్లు దిగుమతి చేసుకోగా అనంతరం ఆ సంఖ్య 20లక్షలకు పెరిగింది. లాటిన్ అమెరికాలో ఇదే పరిస్థితి ఎదురైన బ్రెజిల్, ఉరుగ్వే, పరాగ్వే, చిలీ, బొలీవియా దేశాలు మెర్‌కోసర్ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. అయినప్పటికీ పరిస్థితులు మెరుగు పడలేదు. ప్రపంచబ్యాంక్ నివేదిక 1998 ప్రకారం జనాభాలోని మూడుకోట్ల 60లక్షలమందిలో కోటీ 34లక్షల మంది దారిద్ర్యరేఖకు దిగువకు చేరగా మరో ఇరవై లక్షలమంది అత్యంత దరిద్రులుగా మారారు. పనిచేయగలిగిన వారిలో మూడింట రెండువంతుల మందికి ఉపాధిలేదు. అధికారిక లెక్కల ప్రకారం దారిద్ర్యరేఖకు దిగువకు చేరిన వారిసంఖ్య కోటీ 50లక్షలకు చేరింది. నెలకు 470 డాలర్లకంటే తక్కువ ఆదాయం వచ్చే వారిని దరిద్రులుగా పరిగణిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు రెండువేలమంది అదనంగా ఈతరగతిలో చేరుతున్నట్లు ఫైనాన్షియల్‌టైమ్స్ పత్రిక వెల్లడించింది. ప్రపంచ పెట్టుబడిదారులకు విశ్వాసం కలిగించాలంటే అవసరమైతే అర్జెంటీనాకు తాను పదిబిలియన్ డాలర్ల రుణం ఇస్తానని ఐఎంఎఫ్ ముందుకు వచ్చింది. రుణంతో పాటు మరికొన్ని షరతులను ముందుకు తెచ్చింది. అదే మరింత దారుణమైన రెండవదశ సంస్కరణల అదేశం. వాటిలో కార్మిక మార్కెట్‌లో సంస్కరణలు జరగాలన్నదే ప్రధానమైనది. కొండలా పెరుగుతున్న

రుణభారాన్నితగ్గించాలంటే పొదుపు చర్యలు విధిగా అమలు జరపాలని ఆదేశించారు. నూటముఫ్పైరెండు కోట్ల బిలియన్ డాలర్లకు రుణభారం పెరిగింది. గడువు మేరకు చెల్లించే పరిస్థితిలేకపోవటంతో డిలారౌవు ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలపై కన్నువేసింది. నెలకు వెయ్యిడాలర్లకు మించి తీసుకోరాదని 2001 డిసెంబర్ మొదటి వారంలో అంక్షలు విధించటంతో సంక్షోభ స్వరూపం ప్రజలకు పూర్తిగా అవగతమైంది. అందుకు నిరసనగా జనరల్ సమ్మె జరిపారు. పోలీసులు కూడా వారితో కలిశారు. దేశంలో పలుచోట్ల కొట్లాటలు చెలరేగాయి. దాంతో డి లా రౌవు పదవినుండి తప్పుకొని రాజధాని వదలి పారిపోయారు. ఆయన స్థానంలో 600కోట్లడాలర్ల ఆస్తుల అధిపతి, పచ్చి మితవాది రామన్‌పోర్టా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అతని స్థానంలో మరికొద్ది రోజులలోనే మరో అధ్యక్షుడిగా అడాల్ఫో రోడ్రిగజ్ సా గద్దెనెక్కారు. వారంరోజులలోనే తాను దేశంలోని పరిస్థితులను అదుపుచేయలేనని చేతులెత్తారు.

గత పదేండ్లలో అర్జెంటీనా సంపదలను సంస్కరణల పేరుతో బహుళజాతి గుత్తసంస్తలు కరిమింగిన వెలగ పండులా హరించి వేశాయి. ఆర్థికవ్యవస్థ 1990-98 మధ్య 141 బిలియన్ డాలర్లనుండి 298 బిలియన్లకు పెరిగింది. లాటిన్ అమెరికాలో 1980 దశకం వరకు ఉన్నంతలో సంపదలను సమంగా పంపిణీ చేసిన దేశంగా పేరుంది. అంతకు ముందు దశాబ్దంలో దేశంలోని ఉన్నత వర్గాలకు చెందిన ఇరవైశాతం మంది దిగువ తరగతిలో 20శాతం పొందిన ఆదాయాల కంటే ఎనిమిది రెట్లు ఎక్కువ పొందారు. పదేండ్ల ప్రపంచీకరణ తరువాత ఇప్పుడది 14 రెట్లు అయింది. ఆదాయాల వ్యత్యాసం ప్రస్తుతం మెక్సికో, మలేషియా, స్పెయిన్, కోస్టారికాల కంటే ఎక్కువగా ఉంది. ప్రపంచాన్నే కుదిపి వేస్తాయని భావిస్తున్న ప్రస్తుత అర్జెంటీనా ఆకస్మిక పరిణామాలకు కారణం ఐదేండ్లుగా దేశాన్ని పట్టిపీడిస్తున్న మాంద్యం, పర్యవసానంగా 85 శాతం మంది ప్రజల కొనుగోలు శక్తి 40శాతంపైగా పడిపోయింది. మరోవైపు వేళ్లమీద లెక్కించదగిన ఐదు శాతం మందికి నడమంత్రపు సిరి వచ్చింది. ప్రయివేటీకరణ తరువాత ప్రజలపై అనేక భారాలు మోపారు. గోరుచుట్టుపై రోకటిపోటులా రెండువేల ఐదవ సంవత్సరం వరకు అన్నిరకాల ఖర్చులను నిలిపి వేయాలని డి లా ప్రభుత్వం ఆదేశించింది. స్థానిక ప్రభుత్వాలు పెన్షన్‌లు చెల్లించలేమని చేతులెత్తాయి. స్టాక్ మార్కెట్ నిలిచిపోయింది. పెసోలతో డాలర్‌లను మార్చుకునే అవకాశం ఉన్నప్పటికీ ఏక్షణంలో అయినా దివాళా

> “ప్రపంచీకరణ పేరుతో అనుసరిస్తున్న విధానాల వలన ఎక్కడైనా సమస్య తలెత్తితే అక్కడికే పరిమితం కావటం లేదు. ఆర్థిక, సాంఘిక సంక్షోభానికి దారితీస్తున్నది. దానిని ఇతరులపై మోపి తాము బయటపడేందుకు అమెరికా వంటి ధనిక దేశాలు అనుసరిస్తున్న విధానాలు సమస్యలను మరింత విషమంగావిస్తున్నాయి.”

తీయవచ్చనే ముందుచూపుతో దుకాణాల వారు డాలర్లు మాత్రమే కావాలని అడుగుతున్నారు. విలువను అధికారికంగా తగ్గించకపోయినా గతంలో ఒకపెసోకు ఒక డాలరు వచ్చేది ఇపుడు 1.7 ఇవ్వాల్సి వస్తున్నది. కొత్త ప్రభుత్వం మరింత సంక్షోభాన్ని నివారించేందుకు పెసోతో పాటు విలువలేని కొత్త కరెన్సీని ముద్రించి మార్కెట్‌కు విడుదల చేసింది. అంటే పెసోకి విలువ లేకుండా చేయటమే.

ప్రపంచీకరణ ముప్పు ఇది

ప్రపంచీకరణ పేరుతో అనుసరిస్తున్న విధానాల వలన ఎక్కడైనా సమస్య తలెత్తితే అక్కడికే పరిమితంకావటంలేదు. సంబంధిత దేశాలన్నింటా ఆర్థిక, సాంఘిక సంక్షోభానికి దారితీస్తున్నది. దానిని ఇతరులపై మోపి తాము బయటపడేందుకు అమెరికా వంటి ధనిక దేశాలు అనుసరిస్తున్న విధానాలు సమస్యలను మరింత విషమంగావిస్తున్నాయి. ఒకదేశం దివాళా ప్రకటిస్తే అది ప్రపంచంపై ప్రభావం చూపుతున్నది. ఆసియన్ దేశాల సంక్షోభం ప్రపంచ పెట్టుబడిదారీ విధాన సంక్షోభంగా గమనించాలి. ఆసియా-పసిఫిక్ ప్రాంతాన్నితన ఆధునిక నమూనాగా కాపిటలిజం చెప్పుకున్నది. ఇప్పుడది పగటికలగా మారింది. ఆసియన్ దేశాల అభివృద్ధిరేటు రెండు శాతానికి పడిపోయింది. జపాన్ పరిస్థితి మరీ దిగజారి 1.1 శాతంకూడ ఉండే పరిస్థితిలేదు. అమెరికాలో గత ఏడాది కాలంగా ఉన్న మాంద్యం పెరుగుతున్నది తప్ప తగ్గటంలేదు. దానికి ఇప్పుడు జపాన్ తోడైంది. ధనిక దేశాల రుణభారం నానాటికీ పెరిగిపోతున్నది. ఫలితంగా వాటి ·మధ్య విభేదాలు కూడా పెరుగుతున్నాయి. ఆసియన్ దేశాల కరెన్సీవిలువ తగ్గింపుతో జపాన్‌సరుకుల ధరలు పెరిగాయి. పోటీ శక్తితగ్గింది. అదేశాలలో పెట్టుబడులు పెట్టిన అనేక జపాన్, అమెరికన్‌బాంక్‌లు కుప్పకూలాయి. అందుకే ఐఎంఎఫ్ ద్వారా ఆసియన్‌దేశాలను ఆదుకొనేందుకు అమెరికా వందబిలియన్ డాలర్ల సహాయాన్ని ప్రకటించింది. నిజానికి ఇది ఆసియన్‌దేశాలపై పెత్తనానికి దారి తీస్తుంది.. అందుకే జపాన్ వ్యతిరేకత తెలిపింది. తన ఆధ్వర్యంలో నడిచే విధంగా వందబిలియన్‌డాలర్ల సహాయపథకం అమలు జరగాలని అందుకుగాను తాను సగం మొత్తం సమకూర్చుతానని పేర్కొన్నది. దీనిని అమెరికా అంగీకరించలేదు. కనీసం దక్షిణకొరియాకు అయినా తన సహాయాన్ని అనుమతించాలని అమెరికా కోరింది. అదే జరిగితే ఒక నాటి తనవలస అయిన దక్షిణ కొరియాను చేతులారా అమెరికన్లకు అప్పగించటమే అవుతుందని భావించిన జపాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. తమ బాంక్‌లను సంరక్షించుకోవాలంటే అమెరికా ట్రెజరీ బిల్స్‌లో ఉన్న పెట్టుబడులను అమ్ముకోక తప్పదని పరోక్షంగా హెచ్చరించింది. అదే జరిగితే అమెరికానెత్తిన బండ పడ్డట్లే. చెల్లింపుల సంక్షోభం తలెత్తుతుంది. విదేశాలనుండి పెట్టుబడులు రాకుండా గడిచే పరిస్థితి లేదు. అనేక ఆసియా దేశాలు తమ మార్కెట్లను తన బహుళజాతి గుత్త సంస్థల కార్యకలాపాలకు తెరవాలని అమెరికా డిమాండ్ చేస్తున్నది. అంతర్గతంగా డిమాండ్ సృష్టించటానికి అమెరికా తన పౌరులకు భారీ మొత్తంలో అప్పులిచ్చింది. మాంద్యం కారణంగా అక్కడి సమాజంలో సాంఘిక సమస్యలు వస్తున్నాయి. సాంఘిక భద్రతా పథకాలకు కోత పెట్టారు. అనేక మందికి ఉద్యోగాలు ఎప్పుడు పోతాయో తెలియదు. రుణభారాన్ని ఎలా తగ్గించుకోవాలో సలహాలిచ్చే ఏజన్సీలు పుట్టగొడుగుల్లా పెరిగాయి. అనేకమంది ప్రవాసులు అక్కడ దిగజారుతున్న పరిస్థితులను చూసి తమ పెట్టుబడులను తమ దేశాలకు లేదా మరోదేశానికి తరలించేందుకు చూస్తున్నారు.

అమెరికా బ్యాంక్‌లు, వాటితో చేతులు కలిపిన సంస్థలు అర్జెంటీనా కష్టజీవుల పెన్షన్ మొత్తాలను కాజేసేందుకు పూనుకున్నాయి. కార్మికుల పెన్షన్ మొత్తాలను తక్కువ వడ్డీలకు తీసుకొని అధిక వడ్డీ రేట్లకు అర్జెంటీనా ప్రభుత్వానికే బాండ్లరూపంలో ఇచ్చాయి. కొంత మొత్తాలను స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులుగా పెట్టాయి. లాభాలు వస్తే చెల్లిస్తాయి. లేకుంటే ఎలాంటి ప్రతిఫలం దక్కదు. ప్రయివేటీకరణను కార్మికులు వ్యతిరేకించినప్పటికీ యూనియన్‌లు మితవాదుల ఆధీనంలోనే ఉన్నాయి. పాలకులను ఎదుర్కొని పోరాటాలుగాని, ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయగలస్థితికి ప్రస్తుతం అక్కడ కార్మికవర్గం ఇంకా ఎదగలేదు. పిల్లిని గోడవరకు తరమవచ్చు తరువాత అది తిరగబడక తప్పదు. అందుకు అర్జెంటీనా మినహాయింపుకాదు.

బాబుగారి సిద్ధాంతరహిత సిద్ధాంతం

(5వ పేజీ తరువాయి)

తన అభిప్రాయంగా ప్రచారంలో పెడుతున్నారు. మానవుడికి డబ్బు సంపాదనే మహోన్నత లక్ష్యమన్నట్లు ముఖ్యమంత్రి ప్రచారం చేస్తున్నారు. కోట్లు గడించిన వ్యక్తుల గురించి ఎంతో ఆదర్శ ప్రాయంగా ప్రతి సమావేశంలో ఉద్బోధిస్తారు. వ్యక్తిగత స్వార్థం, సంపాదన, అనుభవించటం మానవునికి ఉండాల్సిన విలువలివే అన్నట్లు, సమాజం, సమానత్వం, ప్రజాశ్రేయస్సు వంటి విలువలకు ఏమాత్రం విలువలేనట్లు చంద్రబాబు నాయుడుగారి మాటలుంటున్నాయి. ఈ రకమైన వ్యక్తివాదం, లాభార్జన దృష్టి వంటి విలువలను సమాజంలో పెంచి పోషిస్తున్నారు.

ప్రచార హోరు

ప్రపంచబ్యాంకు ఎక్కడ అడుగు పెట్టినా అక్కడ ప్రచారానికి చాలా ప్రాధాన్యత యివ్వబడుతుంది. బహుళజాతి సంస్థల కార్పొరేట్ సంస్కృతి కూడా యిదే. కార్పొరేట్ సంస్థలు తమ సరుకును మిరుమిట్లు గొలిపే ఆకర్షణీయమైన వ్యాపార ప్రకటనల ద్వారా ప్రజల మనస్సును ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తాయి. దీని కోసం చాలా విలువైన ధనాన్ని ఖర్చుజేస్తాయి. ఈ కార్పొరేట్ పద్ధతిని మన రాష్ట్రానికి ఇఒ గా ప్రకటించుకున్న ముఖ్యమంత్రి కూడా అనుసరించడంలో ఆశ్చర్యం లేదు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు డయల్ యువర్ సిఎం కార్యక్రమం ద్వారా వివిధ ఛానల్స్‌లో ప్రభుత్వ వ్యాపార ప్రకటనల ద్వారా టివి మాధ్యమాన్ని వినియోగిస్తున్నారు. పత్రికల్లో అందులో తన విధానాలకు అండగా నిలిచే ప్రముఖ పత్రికలలో వ్యాపార ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఇంటర్‌నెట్ ద్వారా ప్రభుత్వ ప్రచారాన్ని నిర్వహించేందుకు ఒక అమెరికన్ కంపెనీని నియమించారు. ఈ ప్రచార సాధనాలన్నింటిలోను నిపుణులు రూపొందించిన ఉపన్యాసాలు, నినాదాలు, అభిప్రాయాలను ముఖ్యమంత్రిగారు పుంఖానుపుంఖాలుగా వల్లేవేస్తున్నారు. ఈ ప్రచార ప్రవాహంలో అందరినీ ముంచెత్తుతున్నారు. ప్రపంచబ్యాంకు, విదేశీ బహుళజాతి సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తమ ప్రయోజనాలను కాపాడగల సమర్థవంతమైన వ్యక్తిగా చూస్తున్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని విదేశీ మీడియా, స్వదేశీ గుత్త పత్రికలు ఆయనకు విస్తృతంగా ప్రచారాన్నిస్తున్నాయి. విదేశీ ప్రతినిధి వర్గాలు కూడా ప్రపంచబ్యాంకు ప్రోత్సాహంతో హైదరాబాదు నగరాన్ని సందర్శిస్తున్నాయి.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారి దూరదృష్టిని, సంస్కరణల తపనను ప్రశంసిస్తున్నాయి. ఈ ప్రచార ప్రభావం ఏమీ లేదనుకోవడం పొరపాటు. 18 గంటలు కష్టపడే ముఖ్యమంత్రని, ఈ ప్రభుత్వం అభివృద్ధికోసం తపన పడే ప్రభుత్వమని, చురుకుగా పనిచేసే ప్రభుత్వమని అనేకమందిని నమ్మించగలిగింది. అభివృద్ధి జరుగుతుందని నమ్మకం కల్గించింది. అత్యధిక ప్రజానీకానికి ప్రత్యక్షమైన లాభమేమీ కలగక పోయినప్పటికీ ప్రచార హోరు మూలంగా ప్రారంభంలో భ్రమకి లోనయ్యారు. ఈ ప్రభుత్వ ప్రచార హోరుని ఎదుర్కొనాలి. మన శక్తినంతటినీ ఉపయోగించి ప్రభుత్వ ప్రచార బూటకత్వాన్ని ఎండగట్టాలి.

లెనిన్ దృష్టితో
నీతి నియమాలు - మానవత్వం

అలెగ్జాండర్ దెమెన్ త్యేవ్

"కమ్యూనిస్టు నీతి నియమాలంటూ ప్రత్యేకంగా వున్నాయా" అని ప్రశ్నించుకొని, లెనిన్ "వున్నాయి" అన్నారు. మనకు నీతి నియమాలు లేవని తరచు అంటూంటారు. నీతినియమాలను పూర్తిగా కమ్యూనిస్టులు తోసివుచ్చుతారని బూర్జువా వర్గం తరచుగా ఆరోపిస్తుంది. అసలు సమస్యను గందరగోళపరచడానికి, కార్మిక-కర్షకుల కండ్లలో దుమ్ము కొట్టేందుకూ ఇదొక మార్గం.

"నీతి నియమాలను, ధార్మికతను మనం ఏ దృష్టితో నిరాకరిస్తాము?"

"నీతి నియమాలను భగవదుద్దేశ్యాలనుగా ప్రతిపాదించే బూర్జువా వర్గం దానికిచ్చే అర్థంలో మనం వానిని నిరాకరిస్తాం.

"మానవాతీత, వర్గాతీత దృక్పథం మీద ఆధారపడిన ఏ నీతి నియమాన్నయినా మనం నిరాకరిస్తాం. అది మోసం అని, దగా అని, భూస్వాములు, పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం కార్మిక, కర్షకుల్ని మోసగించడమని చెప్తాం.

"సర్వకాలిక ధార్మికతను మనం నమ్మం. ధార్మికత గురించిన కథలు అసత్యమని నిరూపిస్తాం. ధార్మికత అనేది ఉన్నతస్థాయికి పెరగడంలో, శ్రమదోపిడిని వొదుల్చుకోవడంలో మానవసమాజానికి తోడ్పడడం కోసం...

"కమ్యూనిజాన్ని దృఢపరిచేందుకూ, పరిపూర్తి చేయడానికి జరిగే పోరాటం మీద కమ్యూనిస్టు ధార్మికత ఆధారపడివుంది" అన్నారు లెనిన్.

ధార్మికత అనేది మానవుని సామాజిక చైతన్యరూపాలలో ముఖ్యమైనదని లెనిన్ అంటారు. ధార్మికత అంటే దైనందిన ప్రవర్తన నియమాలు మాత్రమేననంటేనూ, వీనిని అలవరచుకోవడమే నంటేనూ లెనిన్ అంగీకరించరు. అంతరాత్మ, న్యాయం, ఆదర్శం, మానవత అనే వానికి లెనిన్ దృష్టిలో ఎంతో ప్రాముఖ్యం వున్న భావనలు, నిర్దిష్ట చారిత్రక వర్గ వస్తువు కలిగి, అవి మానవుని గొప్పతనాన్ని సూచిస్తుంటాయి అన్నారు లెనిన్.

ప్రజానీకానికి న్యాయము అనేది "వట్టిమాట మాత్రం కాదు. పిడికెడు అన్నం కోసం మాడి వచ్చిపోవడానికి సంబంధించిన అతి తీవ్ర, తక్షణ బృహత్సమస్యగాని..." అన్నారు లెనిన్.

ప్రేమ కన్నను మానవత చాలా ఉన్నతమని లెనిన్ అవగాహన. "దుష్టత్వానికి కష్టం కలిగించకుండా మంచిచేయడం అసంభవం" అన్నారు. 19వ శతాబ్దపు రష్యన్ విప్లవ ప్రజాతంత్రవాది నికోలాయ్ చెర్నిషేవ్‌స్కీ 1917 అక్టోబరు విప్లవం తర్వాత లెనినూ, బోల్షివిక్కులూ మానవతను మంటగలిపారని, క్రూరత్వం చూపారని నిందిస్తున్న ఘట్టంలో "ప్రేమ, ద్వేషాలు" "ధార్మికత-మానవత" సమస్యలకు విశేష ప్రాధాన్యం వచ్చింది. "హింస మా ఆదర్శాలకే విరుద్ధం" అన్నారు లెనిన్, విప్లవానికి పూర్వం, విప్లవానంతరం "హింసతో కమ్యూనిజం తేలేము" అన్నారు. అయితే సామాజిక-రాజకీయ పోరాటం జరుగుతున్న పరిస్థితులలో హింసనుపయోగించాల్సి ఉంటుందని చెప్పారు. దుర్మార్గాన్ని ప్రతిఘటించక పోవడం అజ్ఞాన జనితం, మూర్ఖం అంటారు లెనిన్. హింసకు కల్పన చేసింది మార్క్సిస్టులూ, కమ్యూనిస్టులూ కాదు. మానవ చరిత్రకు పూర్వమే వాస్తవ పరిస్థితుల గతి క్రమంలో హింస పుట్టింది. దోపిడీ, పీడక శక్తులతోడి పోరాటంలో ఆ వర్గాలు చూపే ప్రతిఘటన హింసను అనివార్యం చేస్తుంది.

భూస్వాముల, బూర్జువావర్గాల పాలనను, పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మూలించేందుకు రష్యను కార్మిక వర్గం సాయుధ తిరుగుబాటు జరిపింది. కార్మికవర్గం నియంతృత్వాన్ని స్థాపించింది. సోషలిస్టు వ్యవస్థా శత్రువుల్ని అణచి వేసింది. "ఆయుధాలు అధికార సాధనాలూ చేతనున్న హింసాత్మకుల మీద బలప్రయోగం చెయ్యకుండా ప్రజలు వారిచేత నుంచి విముక్తులు కాలేరు" అన్నారు లెనిన్.

నిర్దిష్ట చారిత్రక పరిస్థితులలో బూర్జువా దౌర్జన్యానికి ప్రతిగా ప్రజావిప్లవ హింసను వుపయోగించాలన్న లెనిన్, వ్యక్తిగత దౌర్జన్యాన్నీ, హింసను, ప్రతిహింసను, అరాచక దౌర్జన్యాలను నిరసించారు. "ప్రజావిప్లవపు బలాధిక చర్యలకూ, వ్యక్తిగత రాజకీయ హత్యలకూ సంబంధమే లేదు" అన్నారు లెనిన్.

విప్లవకర ప్రజానీకపు హింసాత్మక చర్యలను బలపరిచినా లెనిన్ శాంతియుతంగా సోషలిజం లోకి పరివర్తన రావడాన్నే సమర్థించారు. కార్మిక వర్గం శాంతియుతంగానే అధికారం చేపట్టకోరుతుంది"- అన్నారాయన 1899లో.

సోషలిస్టు పరిణామాలు నచ్చచెప్పడం, నైతిక బలం, బోధన, నిర్మాణ కృషిద్వారా తీసుకురావాలని లెనినూ, కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయపడ్డాయి.

"తమ అధికారాన్ని తిరిగి ఏర్పరచగోరే వారిపై బలప్రయోగం పనిచేస్తుంది. అయితే, అక్కడితో దాని ప్రాధాన్యం ముగుస్తుంది. ఆటు తరువాత పలుకుబడి, ఆదర్శం మాత్రమే, పనికొస్తాయి" అన్నారు లెనిన్.

లెనిన్ విప్లవ ప్రయోజనాలను సర్వప్రథమంగా భావించారు. విప్లవం ఎంత కఠిన మయినదయినా, కార్మిక ప్రజల యెడ ప్రేమా, సహభావుకత్వ భావమూ పోరాటంలో నిర్మాతృత్వం అంత ప్రధానమైనవి. విప్లవం ప్రజానీక ప్రయోజనాలనూ, విప్లవ ప్రయోజనాలను కూడా కాపాడుతుంది.

సామ్రాజ్యవాదం-సామ్రాజ్యం

(9వ పేజీ తరువాయి)

కుదిరింది. ఆవిర్భవిస్తున్న అగ్రరాజ్యంగా చైనాపై అమెరికా సైనికవాద ఎదురుదాడి దృష్టి అధికమయింది. ప్రపంచాధిపత్యం కోసం అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తున్న పరిస్థితిలో అమెరికా, ఐరోపాల మధ్య ప్రస్తుతం పైకి కనిపిస్తున్న సామరస్యమయినా దీర్ఘకాలం కొనసాగుతుందన్న గ్యారంటీ లేదు. పెట్టుబడి అభివృద్ధి ప్రస్తుత దశలో వ్యవస్థ లోపల ఈ సమస్యకు పరిష్కారం లేదు. ప్రపంచీకరణ ప్రపంచ రాజ్యాన్ని అనివార్యం చేస్తున్నప్పటికీ స్వభావ రీత్యానే పెట్టుబడి భిన్నత్వాన్ని కోరడం వల్ల అది అసాధ్యమవుతుందని మేస్‌జెరాస్ అంటారు. అందువల్ల ఈ ప్రమాదకర సామ్రాజ్యవాద దశ విస్తృతమవుతున్న ఆటవికవాదంతోను, అది సృష్టించే విధ్వంసకర పరిస్థితులతోను మెలగవలసి వస్తుంది. ప్రపంచీకరణ లేదా సామ్రాజ్యవాదానికి సంబంధించిన రెండు విరుద్ధ విశ్లేషణలు– ఒకటి, 'సామ్రాజ్యం' అనే ప్రపంచ సార్వభౌమాధిపత్యం ఆవిర్భవించిందని చెప్పే నవీన వాదం, ఇది అత్యంత ప్రమాదకరం అని చెప్పే పాతతరహా వాదం. సెప్టెంబరు 11 ఘటన తర్వాత, అఫ్ఘనిస్థాన్‌లో ఉగ్రవాదంపై ప్రపంచ యుద్ధం ఆరంభమయిన తర్వాత నేడు ఈ వాదాలు ఎలా ఉంటాయో చూడాలి. సామ్రాజ్యాన్ని సవాలు చేసింది ఒక జాతిరాజ్యం కాకుండా సామ్రాజ్యానికి వెలుపల ఉన్న అంతర్జాతీయ ఉగ్రవాదం కాబట్టి తమ సిద్ధాంతానికి ఢోకా లేదని మొదటి తరహా వాదులు చెప్పవచ్చు. హార్డ్, నెగ్రీలు గల్ఫ్ యుద్ధం గురించి చెప్పినట్లుగా ఇప్పుడు అమెరికా తన జాతి ప్రయోజనాల కోసం కాకుండా ప్రపంచ హక్కును ఉద్ఘాటించడానికి అఫ్ఘనిస్థాన్‌లో ప్రపంచ పోలీసు పాత్రను నిర్వహించిందని చెప్పవచ్చు. అయితే ఉగ్రవాద సంక్షోభానికి అమెరికాయే కేంద్రమని దృఢంగా విశ్వసించే రెండవ అభిప్రాయం దీనికి పూర్తి భిన్నమయిన వ్యాఖ్యానం చేస్తుంది. ఈ అభిప్రాయం ప్రకారం ప్రపంచ వాణిజ్యకేంద్రంపై, పెంటగన్‌పై ఉగ్రవాద దాడి జరిగిందంటే అది ప్రపంచ సార్వభౌమాధిపత్యంపైన లేదా నాగరికతపైన జరిగిన దాడి జరిగినట్టు కాదు. (న్యూయార్క్ లోని ఐ.రా.స. భవనంపై దాడి జరగ లేదు.) అమెరికా చెపుతున్నట్టు స్వేచ్ఛపైన, ప్రజాస్వామ్యంపైన దాడి అంతకన్నా కాదు. అమెరికా ఆర్థిక శక్తిపైన, సైనిక శక్తిపైన అంటే అమెరికా ప్రపంచ ఆధిపత్యం పైన దాడి గురిపెట్టబడింది. ఈ దాడులు ఎంత మాత్రం సమర్థించలేనివి. అయితే ఇవి విస్తృతమయిన అమెరికా సామ్రాజ్యవాద చరిత్రకు, ప్రపంచాధిపత్యం కోసం అమెరికా జరిపే ప్రయత్నానికి సంబంధించి, ముఖ్యంగా మధ్య ఆసియాలో అమెరికా జోక్యం చరిత్రకు సంబంధించినవి. అంతేకాదు అమెరికా ప్రపంచ రాజ్యాంగవాదంతో స్పందించలేదు. కేవలం పోలీసు చర్యగా కూడ కాదు. సామ్రాజ్యవాద పద్ధతిలోనే స్పందించింది. అంతర్జాతీయ ఉగ్రవాదంపై ఏకపక్షంగా యుద్ధాన్ని ప్రకటించింది. తన యుద్ధ యంత్రాన్ని అఫ్ఘనిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వంపైకి వదిలిపెట్టింది.

అఫ్ఘనిస్థాన్‌లో అమెరికా సైన్యం గతంలో ఏ శక్తుల ఆవిర్భావానికైతే తానూ పాత్ర వహించిందో ఆ ఉగ్రవాద శక్తులనే నిర్మూలించాలని ప్రయత్నం చేస్తున్నది. అమెరికా తన రాజ్యాంగ సూత్రాలనే విస్మరించి తన సామ్రాజ్యవాద పథకాలకు ఉపయోగపడుతుందనుకున్న చోట ఉగ్రవాద గ్రూపులను చాలా కాలంగా ప్రోత్సహిస్తున్నది. తానుగా ఉగ్రరాజ్య విధానాలను అనుసరిస్తున్నది. అమాయక పౌరుల ప్రాణాలను హరిస్తున్నది. ఇప్పుడు అమెరికా ఉగ్రవాదంపై యుద్ధం పలుదేశాలలో సైనిక జోక్యాన్ని అవసరం చేస్తుందని తానే చెబుతున్నది. ఇరాక్, సిరియా, సూడాన్, లిబియా, ఇండొనీషియా, మలేషియా, ఫిలిప్పీన్స్ లాంటి దేశాలను తన జోక్యాన్ని మరింత పెంచేందుకు లక్ష్యాలుగా ఇప్పటికే గుర్తించింది. ఇదంతా కూడ ప్రపంచ వ్యాపితంగా ఆర్థిక వ్యవస్థ దిగజారుతున్న సమయంలో, ప్రధాన పెట్టుబడిదారీ దేశాలలో అణచివేత అధికమయిన పరిస్థితిలో జరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థలోని 'అదుపు చేయలేని విధ్వంసం' అంతకంతకూ మరింత అధికంగా ముందుకు వస్తున్న పరిస్థితి నేడు ఉంది. సామ్రాజ్యవాదం అభివృద్ధిని తన చుట్టూ మాత్రమే కేంద్రీకరించుకొని అంచున ఉన్న దేశాలను వెనుకబాటుతనానికి పరిమితం చెయ్యాలన్న విధానం ఉగ్రవాదానికి బీజాలు వేసింది. చివరికి అది ప్రధాన సామ్రాజ్యవాద దేశాలకే బెడిసికొట్టింది. కనుచూపుమేరలో అంతం కనిపించని విధ్వంసాన్ని సృష్టించింది.

పెట్టుబడిదారీ వ్యవస్థ తన చారిత్రక పురోగామి దశను ముగించుకున్న తర్వాత సామ్రాజ్యవాదం, ఆటవికవాదం, ఉగ్రవాదం అని మాత్రమే ఈ పరిణామాలను చూడగలం. మానవజాతికి ఇప్పుడు సోషలిజాన్ని పునర్నిర్మించడం, ప్రజాపోరాటాలను ఉధృతం చేయడం మాత్రమే మిగిలిన ఆశ.

–మంత్లీ రివ్యూ, డిసెంబర్ 2001 సంచిక నుండి

(ఈ వ్యాసం ఇస్త్వాన్ మేస్‌జెరాస్‌పై అక్టోబర్ 14, 2001న న్యూయార్క్ లోని బ్రెట్ ఫోరం నుద్దేశించి చేసిన ప్రసంగం ఆధారంగా తయారు చేయబడింది.)

కార్మికవర్గ నియంతృత్వం

సోషలిస్టు విప్లవం ఫలితంగా స్థాపితమై, పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజానికి పరివర్తన జరిగే దశ అత్యంతం కొనసాగే కార్మికవర్గ పాలన. ఇది సోషలిజం నిర్మాణానికి అత్యవసరం. మార్క్సిస్టు –లెనినిస్టు పార్టీ ఆధ్వర్యాన వుంటూ రైతాంగం, తదితర ప్రగతిశీల సామాజిక శక్తులతో బాంధవ్యం నెరపుతూ పనిచేసే కార్మికవర్గం సమాజంలోనూ, రాజ్యవ్యవస్థలోనూ నాయకత్వ స్థానం అలంకరిస్తున్నది. కాబట్టి ఈ విధమైన అధికారాన్ని కార్మికవర్గాధికారం అని అంటున్నాము. ఈ అధికారాన్ని నియంతృత్వం అని ఎందుకంటున్నామంటే, శ్రామిక ప్రజలకు అతి విస్తృతమైన ప్రజాస్వామ్యాన్ని నిశ్చయంగా సమకూర్చుతూనే, మునుపటి దోపిడీ వర్గాల ప్రతిఘటననూ, సోషలిజం పట్ల శత్రుత్వం వహించే వారి కార్యకలాపాలనూ అణచివేయడానికి, బలప్రయోగానికి అది పూనుకోవచ్చు. కార్మికవర్గ నియంతృత్వ అంతస్సారం బలప్రయోగం, విధ్వంసనకాదు. నవసమాజ నిర్మాణ ప్రధాన శ్రామిక ప్రజలను నడిపించేందుకు సృజనాత్మక వ్యవస్థాగత కార్యకలాపాలే దాని అంతస్సారం. ఇదే మునుపటి రకాల రాజ్యాధికార వ్యవస్థలకూ దీనికీ గల వ్యత్యాసం. పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజానికి పరివర్తన చెందే కాలంలో రైతాంగానికి, మొత్తం పెట్టీ బూర్జువా బృందాలకూ కార్మికవర్గం నాయకత్వం వహించేలా చేయడానికి అవసరమైనదేమిటంటే, "కార్మికవర్గ నియంతృత్వం, ఏకవర్గ పాలన, దాని సంఘటిత బలంపైనా, క్రమశిక్షణ పైనా, పెట్టుబడిదారీ విధాన సంస్కృతి, విజ్ఞాన సాంకేతిక రంగాల సమస్త విజయాలపైనా ఆధారపడిన దాని కేంద్రీకృత అధికారవ్యవస్థ, ప్రతి శ్రమజీవి మనస్తత్వంతో దాని శ్రామిక అనుబంధం, గ్రామసీమల్లోని లేదా చిన్న పరిశ్రమల్లోని అనైక్యంగా ఉన్నట్టి, అంతగా అభివృద్ధి చెందనట్టి, రాజకీయంగా అంత దృఢచిత్తం లేనట్టి శ్రామిక ప్రజల్లో దాని ప్రతిష్ట" అని లెనిన్ స్పష్టం చేశారు. (వి.ఐ. లెనిన్ సంపూర్ణ రచనలు సం. 29, పుట 389) కార్మికవర్గ నియంతృత్వం స్థానిక పరిస్థితులను బట్టి, అంటే, ఆయా దేశ ఆర్థిక, రాజకీయ అభివృద్ధిస్థాయి, దానిలో వర్గ శక్తుల బలాబలాలు, సోషలిస్టు విప్లవం అనుసరించిన పంథా శాంతియుతమైనదా, శాంతియుతేతరమైనదా అన్న విషయం, జాతీయ సంప్రదాయాలు మొదలయిన వాటిని బట్టి వేరువేరు రూపాలు ధరిస్తుంది. దోపిడీ వర్గాల రద్దు తరువాత (శ్రామిక ప్రజలుగా వారు పరివర్తన చెందిన తరువాత) సోషలిజం క్రమేణా పటిష్టం కావడంలో కార్మికవర్గ నియంతృత్వ రాజ్యవ్యవస్థ క్రమక్రమంగా యావన్మంది ప్రజల రాజ్యవ్యవస్థ రూపం ధరిస్తుంది. ఈ వ్యవస్థలో అధికారం యావన్మంది శ్రామిక ప్రజలది. కార్మికవర్గం నాయకపాత్ర వహిస్తుంటుంది.

వ్యవసాయ ధరలపై పన్నెండు సూత్రీకరణలు

జయతి ఘోష్

వ్యవసాయ సమస్యకు సంబంధించి చేసే వాదనలలో పలు భావాలు, అర్థాలు, విశేషంగా చర్చకు తావునిస్తాయి. కాగా, వ్యవసాయ ధరల అంశానికి సంబంధించిన వరకూ చాలా మేరకు నిర్దిష్టత, స్పష్టత ఉన్నట్లుగానే కనపడుతుంది. ప్రధాన స్రవంతికి చెందిన ఆర్థిక సనాతన వాదం వ్యవసాయ ధరలకు సంబంధించిన ఈ భావ స్పష్టతపై ఆధారపడి తన ప్రతిపాదనలను చేస్తోంది. తద్వారా, ఈ ఆర్థిక వాదం వ్యవసాయరంగంలో 'స్వేచ్ఛా విపణి'పై పరిపూర్ణంగా ఆధారపడి, అలాగే ఈ పద్ధతిద్వారా ధరలు నిర్ణయించబడే విధానాన్ని ముందుకు తోసేందుకు వినియోగించుకుంటోంది. దీని తాలూకు సాధారణ తర్కం ఈ విధంగా సాగుతుంది. ఆర్థిక మూలకాలలకు తప్పుడు సంకేతాలను పంపే వక్రమైన ధరలవ్యవస్థే, పలు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఉత్పత్తి పెంపుదలకు, ఆదాయాల వృద్ధికీ ప్రధాన ఆటంకంగా ఉంది. అంతర్జాతీయ ధరలకు భిన్నంగా ఉండటం అనే అర్థంలో ఈ ధరల వ్యవస్థ వక్రమైనది. అది అంతర్జాతీయ పోటీకి అనుగుణంగా లేని సాపేక్ష ధరల వ్యవస్థను సృష్టిస్తోంది. దీని వలన వ్యవసాయరంగం నష్టపోతోంది. ఫలితంగా, వ్యవసాయరంగంలో మరిన్ని పెట్టుబడులకు, ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. ప్రభుత్వ జోక్యం వల్లనే ఈ ధరల విధానం ఏర్పడుతోంది. మొత్తం ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే స్థూల ఆర్థిక, వ్యాపార, లేదా పారిశ్రామిక విధానాల రూపంలో ఉండే ప్రభుత్వ జోక్యం వలన ఈ ధరల విధానం రూపుదిద్దుకుంటోంది. అలాగే ; వివిధ ఆర్థిక విభాగాల సంబంధిత నిర్దిష్టపన్నులు, సబ్సిడీల వలన కూడా ఇది జరుగుతోంది. కాబట్టి, 'ధరలను చక్కదిద్దటం' ద్వారా వ్యవసాయాభివృద్ధి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అలాగే, వ్యవసాయ రంగంలో మరిన్ని ఉపాధి అవకాశాలకు, ఆదాయాల పెంపుదలకు మార్గం సుగమం అవుతుంది. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ జోక్యాన్ని బాగా తగ్గించటం ద్వారా ఇది సాధ్యమౌతుందనేది పైవాదనలన్నింటికీ మూల ప్రతిపాదన.

ఈ వాదన కొత్తదేమీ కాదు. తొట్టతొలుత, లిటిల్ స్కిటో వీప్కి, స్కాట్(1966)లు ఈ వాదనను బలంగా ముందుకు తెచ్చారు. ప్రపంచబ్యాంకు వంటి సంస్థలు (ఉదాహరణకు: ప్రపంచ అభివృద్ధి నివేదిక, 1986) ఈ వాదనను పదేపదే పునరుద్ఘాటిస్తున్నాయి. కాగా, గత కొద్ది

> " ఆర్థిక మూలకాలకు తప్పుడు సంకేతాలను పంపే వక్రమైన ధరలవ్యవస్థే, పలు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఉత్పత్తి పెంపుదలకు, ఆదాయాల వృద్ధికీ ప్రధాన ఆటంకంగా ఉంది. "

సంవత్సరాలకాలంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు, గతంలోని 'సోషలిస్ట్' దేశాల వ్యవసాయానికి సంబంధించిన పలు చర్చలలో ఈ వాదన ఒక పిడివాద స్థాయిని పొందింది. ఈ కారణం చేతనే, ఈ వాదనను ప్రస్తుతం పరిశీలించటం అవసరం. ఈక్రింద, ఈ మొత్తం వాదన తాలూకు ప్రధాన ప్రతిపాదనలను సాధ్యమైనంత క్లుప్తంగానూ, క్రమపద్ధతిలోనూ చర్చించటం జరిగింది. చర్చ నిమిత్తమై కొన్ని సమస్యలను ముందుకు తేవటం మాత్రమే ఈ వ్యాసం లక్ష్యం. ఈ సమస్యలను సమగ్రంగా విమర్శకు గురిచేయటం ఈ వ్యాసంలో చేయలేదు.

వ్యాపార విధానాలు, మారకం రేటు

ప్రతిపాదన 1: దిగుమతుల నియంత్రణలు, అతిశయీకరించిన మారకంరేటుల వలన దేశీయ ఆర్థిక రంగంలోని వివిధ విభాగాల మధ్య సంబంధం వ్యవసాయ రంగానికి ప్రతికూలంగా ఏర్పడుతుంది. దీనివలన వ్యవసాయరంగంలో పెట్టుబడులకు ఆటంకం ఏర్పడుతుంది. అలాగే, వ్యవసాయరంగంలో ఉత్పత్తి విస్తరణకూడా దెబ్బతింటుంది.

ప్రతిపాదన తాలూకు లోపం : వ్యాపార నియంత్రణలు, అతిశయించిన మారకం రేటు; జాతీయ వ్యాపార పరిస్థితులు వ్యవసాయానికి అనుకూలంగా పనిచేయటంలో ఏ మాత్రం ఆటంకం కాజాలవు. దీనికిగాను ఆయా దేశాలు వ్యవసాయానికి ఇస్తున్న సబ్సిడీలు, అలాగే, వ్యవసాయధరలు ఏర్పడే తీరు (ఉదాహరణకు : ప్రభుత్వం గనుక వ్యవసాయ ధరలకు కనీస స్థాయిని నిర్ణయించగలిగితే) సాధనాలు కాగలవు. అంతేకాకుండా పారిశ్రామిక రంగంలో వివిధ ప్రధాన సంస్థలు కలిసి వస్తువుల ధరలను నిర్ణయించుకునే తీరు వలన; వ్యవసాయ ధరల స్థాయి, వ్యాపారరంగంలోని వివిధ విభాగాల మధ్యనున్న సంబంధాన్ని స్పష్టంగా వెల్లడించలేదు. వాస్తవానికి ఈ సంబంధం పారిశ్రామిక వేత్తలు నిర్దేశించిన లాభాలపై ఆధారపడి ఉంటుంది. విదేశీ వ్యాపార సంబంధిత వ్యవస్థాగత లోటుపాట్లు ఉన్నచోట కూడా, విదేశీ వ్యాపారాన్ని సరళీకరించటం పై పరిస్థితిని కొద్దిమేరకు మాత్రమే మార్చగలదు. కాగా, క్రింద 5వ వాదనలో పేర్కొన్నట్లుగా వివిధ ఆర్థిక విభాగాల మధ్య సంబంధాలను వ్యవసాయానికి అనుకూలంగా మార్చటం, తప్పనిసరిగా ఆ రంగంలో పెట్టుబడుల పెరుగుదలకు, అలాగే ఉత్పత్తి పెరుగుదలకు దారితీస్తుందా అనేది అస్పష్టమైన అంశమే.

ప్రతిపాదన 2 : దిగుమతులను సరళీకరించటం, 'వెసులుబాటు'గల మారకంరేటును (అంటే మారకం రేటును తగ్గించటం) ఏర్పర్చటం, పలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో వ్యవసాయ ఎగుమతుల పెరుగుదలకు దారితీస్తుంది. తద్వారా వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుంది. అలాగే, వ్యవసాయ సంబంధిత ఆదాయాలుకూడా పెరుగుతాయి.

ప్రతిపాదన తాలూకు లోపం: ఈ వాదన పలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు అత్యంత సాధారణమైన పరిస్థితులలో పరీక్షకు నిలబడలేదు. ప్రపంచంలో వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండు పెరగని పరిస్థితి,

సరఫరా అనేది మధ్యేకాల పరిస్థితులలో వెలుపలి అంశాల (వాతావరణం వంటి) చేత నిర్ణయించబడుతున్నప్పుడు, లేదా సంబంధిత సరుకులు తీవ్రమైన మార్కెట్ ఒడిదుడుకులకు లోనయ్యే పరిస్థితి ఉన్నప్పుడు, అంటే, ఈ సరుకులకు ధరల స్థిరీకరణ చర్యలు అవసరమైనప్పుడు ఇది మరింత నిజం. వ్యాపార సరళీకరణ, మారకంరేటు తగ్గింపు వంటి చర్యల వలన ఒక దేశంలోని వివిధ ఆర్థిక విభాగాల మధ్య మారే సంబంధం కూడా తప్పనిసరిగా మరింత ఎక్కువ స్థాయిలో వ్యవసాయ ఎగుమతులకు దారితీయగలదనేది సరికాదు. అంతేకాకుండా, ఎగుమతుల మొత్తం పెరగటమంటే; ఎగుమతుల విలువ పెరగటం కాకపోవచ్చు. పెరుగుదలలేని లేదా తగ్గుదల సైతం ఉండే అవకాశం ఉన్న ప్రాథమిక ఉత్పత్తుల ఎగుమతుల విషయంలో ఇది మరింత నిజం. తమ వ్యాపార విధానాలను సరళీకరించుకున్న పలు దేశాలు ఎగుమతుల మొత్తాన్నయితే పెంచుకోగలిగాయి కానీ, ఎగుమతుల ద్వారా లభించే విదేశీమారకాన్ని పెంచుకోలేకపోయాయి. ఏదేమైనా, క్రింద చర్చించిన విధంగా, మొత్తం ఉత్పత్తిని ప్రోత్సహించటంలో ఎగుమతుల డిమాండ్ అనేది కేవలం ఒక్క అంశం(సాపేక్షంగా అత్యంత తక్కువ ప్రాధాన్యత కలది) మాత్రమే. ఈ అంశంలో కొన్ని 'విజయగాథలు' ఉన్నాయి– 1980వ దశకంలో అత్యంత ఎక్కువ విలువగల వ్యవసాయ ఎగుమతుల రేట్లను సాధించిన దేశంగా చిలీ దేశాన్ని భావిస్తున్నారు. అయితే, ఈ దేశం ఇప్పటికే అస్థిరమైన అమెరికా మార్కెట్‌పై కేంద్రీకరించటమనే సమస్య తాలూకు ఫలితాలను చవిచూస్తోంది. మించి, వ్యవసాయ ఎగుమతులను పెంచుకున్న పలు దేశాలలో, దేశీయ వినియోగం తగ్గిపోయింది. ఇతరేతర విదేశీ చెల్లింపుల అవసరాన్ని నెరవేర్చుకునే క్రమంలో ఈ పరిస్థితి ఏర్పడుతుంది. దీనికి ఉదాహరణగా వలసవాద భారతదేశంనుంచి – నేటి సబ్‌సహారా ఆఫ్రికా దేశాల వరకూ పేర్కొనవచ్చు.

ఉత్పత్తుల ధరలు

ప్రతిపాదన 3: ఆహార సబ్సిడీలవంటి వాటి రూపంలో ఉత్పత్తుల మార్కెట్లో ప్రభుత్వ జోక్యం వలన ఉత్పత్తిదారులకు ప్రోత్సాహం తగ్గుతుందని వాదన.

ప్రతిపాదన తాలూకు లోపం: సుస్పష్టంగా, ప్రభుత్వ జోక్యం ఒకే దిశలో పనిచేస్తుందనటానికి ఎటువంటి తార్కిక ఆధారమూ లేదు – ఈ రకమైన జోక్యం పనిచేసే తీరును ఒక దేశంలోని వర్గశక్తుల పరస్పర సంబంధపు అంతిమఫలితంగా చూడాలి. ముఖ్యంగా అదనపు ఉత్పత్తి చేసే రైతుల రాజకీయ బలం, సమాజంలోని ఇతర బృందాల మధ్య సంబంధంగా దీనిని చూడాలి. పలు ఆఫ్రికా దేశాల, ప్రభుత్వ ధాన్య సేకరణ, ధాన్యం ధరలను కృత్రిమంగా తక్కువ స్థాయిలో ఉంచింది. కాగా, దక్షిణ ఆసియాలో, ముఖ్యంగా భారతదేశంలో, ఆహార మార్కెట్లో ప్రభుత్వ జోక్యం; ఆహారాన్ని ఉత్పత్తి చేసేందుకు రైతుకయ్యే అన్ని ఖర్చులతో తగిన మేరకు లాభాన్ని కలిపి కనీస ధరను నిర్ణయిస్తోంది. దీని వలన అదనపు ఉత్పత్తి చేసే రైతులకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది. అయితే ఇతర తరహాల ఉత్పత్తిదారులు, వ్యవసాయ రంగంలోని కార్మికులపై ఇది తప్పనిసరిగా సానుకూల ప్రభావం చూపకపోవచ్చు.

ప్రతిపాదన 4: పంటలకు 'గిట్టుబాటు ధరలను' హామీ చేయటం సమర్థవంతంగా మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు దోహదపడగలదు. ఇది ప్రభుత్వ జోక్యం లేని స్వేచ్ఛావ్యాపార వ్యవస్థలో జరుగుతుంది.

ప్రతిపాదన తాలూకు లోపం: వ్యవసాయరంగంలో ఉత్పత్తికనుక నిరవధికంగా కొనసాగాలంటే ఆ రంగంలో ఉత్పత్తుల ధరలు తప్పనిసరిగా ఉత్పత్తికయ్యే ఖర్చులకంటే అధికంగా ఉండాలనేది నిర్వివాదం. అయితే దీనికై ప్రభుత్వ జోక్యం తప్పనిసరి. అభివృద్ధి చెందిన దేశాలలో కూడా ఇది అవసరం. ఎందుచేతనంటే, తగిన మద్దతు ధరల పథకాలు లేకుంటే ఉత్పాదకత అభివృద్ధివలన, ఇతర ధరలతో సాపేక్షంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు భారీగా పడిపోతాయి. ఇక ప్రాథమిక ఉత్పత్తులతో ముడిపడి వున్న అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉత్పత్తి, ధరల తాలూకు ఒడిదుడుకుల ప్రమాదం ఎప్పుడూ అదనంగా వుంది. అంటే, ఉత్పత్తిలో చిన్నకారు రైతులు హెచ్చుస్థాయిలో ఉన్న పరిస్థితిలో ఏదో ఒక రూపంలో స్థిరీకరణ వ్యవస్థ అవసరం. ఆహారభద్రతను గ్యారంటీ చేయడం, ఆహార ఉత్పత్తిలో దేశీయ స్వావలంబనకై పలు సందర్భాలలో ఇటువంటి కొన్ని చర్యలు అవసరం. కానీ, ధరల మద్దతు పథకాలు మాత్రమే తమంతట తామే వ్యవసాయ ఉత్పత్తిని పెంచటమనే సవాలును స్వీకరించలేవు. దీనికై గ్రామీణ ప్రాంతాలలో మౌలికసదుపాయాల వంటివాటి పాత్ర చాలా ఉంటుంది. నేడు ప్రపంచంలోని పలు దేశాలలో రైతులకు 'గిట్టుబాటు ధరలు' కల్పించేందుకు తప్పనిసరిగా క్రమబద్ధమైన ప్రభుత్వ జోక్యం అవసరం. వాస్తవానికి, ఇప్పటికే వ్యవసాయరంగంలో బాగా ఉత్పాదకతను పెంచుకున్న, అలాగే ఈ ఉత్పాదకతల పెరుగుదల చారిత్రకంగా గణనీయమైన స్థాయిలో వున్న పారిశ్రామిక దేశాలలో ప్రభుత్వ సబ్సిడీలు భారీగా వున్నాయి. అయితే, ఇది వ్యవసాయ ఉత్పత్తులను పెంచటంలో ఇతర అంశాల పాత్ర కూడా ఉన్నదనేదానికి ఏ మాత్రం విరుద్ధంకాదు.

> "వివిధ ప్రభుత్వాలు ధరలను అదుపు చేస్తూ, ప్రభావితం చేస్తూ వున్నాయి. అలాగే ఈ విషయంలో బడా కార్పొరేట్ సంస్థలు, ప్రధాన అంతర్జాతీయ మదుపుదారుల వత్తిడి కూడా వుంది. ప్రాథమిక వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో, అభివృద్ధి చెందిన దేశాలు మార్కెట్లను అదుపు చేయటానికి సంబంధించిన ఆధారాలు కోకొల్లలుగా వున్నాయి. ఇక, ఉత్పత్తి చేసిన సరుకులు సేవల విషయంలో కూడా ధరలను నియంత్రించే ప్రయత్నాలు అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్నాయనడానికి ఆధారాలున్నాయి."

ప్రతిపాదన 5 : మరే ఇతర రకాల ప్రోత్సాహకాలు లేదా జోక్యాలకంటే ధరల అంశమే వ్యవసాయ పెట్టుబడులపై ఎక్కువ సానుకూల ప్రభావం చూపగలదు.

ప్రతిపాదన తాలూకు లోపం: వ్యవసాయ ఉత్పత్తుల ధరలలో సాపేక్ష మార్పుల వలన పంటల తీరుతెన్నులలో మార్పు వస్తుందన్నది తెలిసినదే. అయితే, ఈ మార్పు నిర్దిష్ట పంటల ఉత్పత్తిని మాత్రమే ప్రభావితం చేయగలదు. కాగా, స్థూల వ్యవసాయ ఉత్పత్తిపై ధరల ప్రభావం నామమాత్రమేనేది పలు అధ్యయనాల నిర్ధారణ. భారత దేశ వ్యవసాయరంగంతో సహా పలు ఇతర అధ్యయనాల ప్రకారంగా వ్యవసాయ ఉత్పత్తుల పెంపుదలలో ధరలు మాత్రమే అత్యంత ప్రధానమైనవి కావు. నీటి పారుదల, విద్యుత్ మొదలైన ఉపరితల రంగాలలో ప్రభుత్వ పెట్టుబడి పాత్ర మరింత కీలకమైనది. వ్యవసాయరంగంలో ప్రభుత్వ, ప్రయివేటు పెట్టుబడుల మధ్య సానుకూల సంబంధాన్ని, భారత దేశంలో జరిగిన అధ్యయనాలు రుజువు చేస్తున్నాయి. ఒక ప్రక్క మొత్తం వ్యవసాయ పెట్టుబడులు, ఉత్పత్తికి; మరో ప్రక్క వ్యవసాయ ఉత్పత్తుల ధరకు చాలా తక్కువ సంబంధం ఉండటాన్ని దశాబ్దకాలం పాటి వ్యవసాయ రంగపు తీరుతెన్నులు నిరూపిస్తున్నాయి. కాగా, ఎంత బలహీనమైన స్థాయిలోనైనా ప్రభుత్వ పెట్టుబడులు, సంస్థాగత సంస్కరణలు వ్యవసాయరంగంలో ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడ్డాయనేది కూడా ఈ అధ్యయనాలు రుజువుచేస్తున్నాయి.

ఉత్పాదకాల ధరలు

ప్రతిపాదన 6 : వేతన చట్టం, అలాగే పారిశ్రామిక విధానాల రూపంలో ప్రభుత్వ జోక్యం ఉత్పాదకాల 'అసంబద్ధ' సాపేక్షధరలకు దారితీస్తుంది. దీనివలన, ఇప్పటికే అదనపు మానవ వనరులు వున్న వ్యవసాయరంగంలో, పెట్టుబడులకు హెచ్చు ప్రాధాన్యత కల్పించటానికి ప్రోత్సాహాన్నిస్తుంది.

ప్రతిపాదన తాలూకు లోపం : వ్యవసాయరంగంలో ఉత్పత్తి విధానం ఎంపిక, పాక్షికంగా మాత్రమే సాపేక్షధరలపై ఆధారపడి ఉంటుంది. భూపంపిణీలో అసమానతల ప్రభావాన్ని కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలి. వ్యవసాయరంగంలో కార్మికులకు డిమాండు, సరఫరాలపై సీజన్ల ప్రభావాన్ని కూడా

గుర్తించాలి. కార్మికుల అందుబాటు తీరు, కార్మికులపై అదుపు స్థాయి, పర్యవేక్షణా సమస్యలు మొదలయిన వాటిని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. వ్యవసాయరంగంలో యాంత్రికీకరణకు ఇచ్చే సబ్సిడీలు మరింత పెట్టుబడుల కేంద్రీకృత పద్ధతులకు ప్రోత్సాహాన్నివ్వవచ్చు. అయితే, వ్యవసాయరంగంలో పెట్టుబడులు ప్రాధాన్యతగల పద్ధతులకు ఇదొక్కటే కారణం కాదు. లేదా ఇతర అంశాలు గనుక వ్యతిరేక దిశలో పనిచేస్తే పెట్టుబడులకు అధిక ప్రాధాన్యతగల పరిస్థితి ఏర్పడకపోవచ్చు.

ప్రతిపాదన 7 : వ్యవసాయ ఉత్పత్తిని పెంచేందుకు గాను ఉత్పాదకాల సబ్సిడీలు (రుణ సబ్సిడీలతోసహా), ఉత్పాదకాల ధరలను తక్కువగా ఉంచటంకంటే అధిక ఉత్పత్తి ధరలు, ఎగుమతులకై ఉత్పత్తి చేసే అవకాశాలను కల్పించటం బాగా పనిచేస్తాయి.

ప్రతిపాదన తాలూకు లోపం : వాస్తవానికి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రోత్సాహాన్నిచ్చేందుకు గాను ధరల యంత్రాంగంపై ఆధారపడదల్చుకుంటే; ఉత్పాదకాలపై సబ్సిడీలపైననే ఎక్కువగా ఆధారపడటం బాగా సమర్ధవంతమైన చర్య. మనం ఆశిస్తున్న ఉత్పత్తి పెంపుదలపై కేంద్రీకరణకు ఈ సబ్సిడీలు మరింత ప్రోత్సాహాన్నివ్వగలవు. అంతేగాకుండా, వ్యవసాయ ఉత్పత్తుల ధరల పెరుగుదలవలన ఏర్పడే ద్రవ్యోల్బణం కారణంగా సాధారణ సరుకుల ధరల పెరుగుదల పరిస్థితిని నివారించేందుకు కూడా ఉత్పాదకాల సబ్సిడీలే సముచితం.

ప్రతిపాదన 8: ఉత్పాదకాలపై సబ్సిడీలవలన రేషనింగు, కొరతలు ఏర్పడతాయి. దీనంతటివలన ధనవంతులైన రైతులే ఎక్కువలాభపడతారు.

ప్రతిపాదన తాలూకు లోపం : డిమాండ్‌కు సరిపోయేమేరకు సరఫరాలేనపుడే ఉత్పాదకాల సబ్సిడీలు రేషనింగుకు దారితీస్తాయి. అలాగే, ఉత్పాదకాల సబ్సిడీని కొన్ని వర్గాల రైతులకు మాత్రమే ఇచ్చినప్పుడుకూడా ఇది జరుగుతుంది. ఇటువంటి సబ్సిడీలను (తక్కువ వడ్డీ రేటుకు రుణాలవంటివి) ఎంపిక చేసిన రైతాంగ విభాగాలకు మాత్రమే ఇవ్వటం సరికాదు. ఎందుచేతనంటే, ఇటువంటి సబ్సిడీల విధానం, ఆయా ఎంపిక చేసిన విభాగపు రైతులను వలుమార్లు చేరుకోదు. రాజకీయంగా శక్తివంతులు లేదా అధికారగణంతో దగ్గరసంబంధాలున్నవారికి మాత్రమే ఇటువంటి సబ్సిడీలు చివరికి దక్కుతాయి. 'సార్వజనీన' సబ్సిడీలు మరింత మెరుగయిన విధానం. అయితే, ఈ విధానాన్ని మొత్తం వ్యయంతో బేరీజువేసుకొని చూడాలి. ఎక్కువ ఉత్పత్తి చేసేవారే, ఉత్పాదకాల సబ్సిడీలవలన ఎక్కువగా లాభపడతారనేది నిర్వివాదం. అంతమాత్రాన, ఈ రకమైన సబ్సిడీల వ్యవస్థ ఉత్పత్తి దృక్పథం నుంచి (ఆదాయపంపిణీ దృక్పథంనుండి కాక) చూస్తే అసమర్ధమైనదనే వాదన సరైనదికాదు.

ఉపాధి, వేతనాలు

ప్రతిపాదన 9 : సాపేక్ష ధరలను ప్రతికూలంగా చేయటం ద్వారానూ, వ్యవసాయ పెట్టుబడులను, ఉత్పత్తిని కుదించటం ద్వారానూ, వ్యాపార నియంత్రణలు క్రమడిమాండును తగ్గించి వేస్తాయి. అందుచేత, ఇతర రంగాలలోలాగానే వ్యవసాయరంగంలో ఉపాధిని పెంచేందుకు ఇతర దేశాల వ్యాపారాన్ని సరళీకరించాలి.

ప్రతిపాదన తాలూకు లోపం : వాస్తవానికి, వ్యాపార సరళీకరణ ఉత్పాదకాల సాపేక్ష ధరలను మరింతగా పెట్టుబడుల కేంద్రీకృత విధానాలవైపు మరల్చగలదు. ఆహారపదార్ధాల ధరల పెరుగుదల రూపంలో ఇది జరుగుతుంది. ఈ పెరుగుదల వలన వేతనాల పెరుగుదల తప్పనిసరి అవుతుంది. కాగా మరో ప్రక్క నిజవేతనాలు వాస్తవానికి పడిపోవచ్చు. కొత్త దిగుమతుల ద్వారా వ్యవసాయ సంబంధిత యంత్రాలు చౌకగా లభించినప్పటికీ ఈ పరిస్థితి ఏర్పడవచ్చు. అందుచేత, వ్యవసాయరంగంలో పెరిగిన పెట్టుబడులు, ఉత్పత్తి వలన ఉపాధి అవకాశాలు పెరగకపోవచ్చు. భారత వ్యవసాయరంగంలో తగ్గిపోతున్న ఉపాధి అవకాశాలే దీనికి తార్కాణం.

ప్రతిపాదన 10: కనీసవేతనాల చట్టం వలన వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు కుంటుపడతాయి.

ప్రతిపాదన తాలూకు లోపం : కనీస వేతనం వలన, వ్యవసాయరంగంలో కార్మికులకున్న డిమాండ్ నామమాత్రంగా మాత్రమే ప్రభావితమౌతుంది. దీనికి భిన్నమైన వాదనను రుజువుచేసేందుకు ఆచరణాత్మక ఆధారాలు లేవు. రాష్ట్రాలవారీగా చూస్తే, వ్యవసాయరంగ సంబంధిత ఉపాధి అవకాశాల పెరుగుదల అత్యంత ఎక్కువగా వున్న (ఉదాహరణ : కేరళ) కొన్ని రాష్ట్రాలు, కనీసవేతన చట్టం సమర్ధవంతంగా అమలు జరుగుతోన్న అతికొద్ది రాష్ట్రాల జాబితాలో ఉన్నాయి. అలాగే, కనీస వేతనాల చట్టం అమలులో వెనకబడి వున్న రాష్ట్రాలు గత దశాబ్దకాలం లేదా పైబడిన కాలంలో వ్యవసాయ రంగంలో ఉపాధికల్పనా పెరుగుదలను నామమాత్రం గానో లేదా అసలుకే లేకుండానో నమోదు చేసుకున్నాయి.

ధరలు ఏర్పడే తీరు

ప్రతిపాదన 11 : ప్రభుత్వ జోక్యం లేనపుడు, అభివృద్ధి చెందుతున్న దేశాలలోని వ్యవసాయ మార్కెట్లు పంపిణీ, ఉత్పత్తి సామర్ధ్యంలో సమర్ధవంతంగా ఉంటాయి. అలాగే, అంతర్జాతీయ సాపేక్ష ధరలకు అనుకూలంగా ఉంటాయి.

ప్రతిపాదన తాలూకు లోపం : పలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో మార్కెట్లు పూర్తిగా ఏర్పడకపోవడమో లేదా గ్రామీణ ప్రాంతాల మార్కెట్ల మధ్య అంతర్‌సంబంధం ఉండటమో లక్షణంగా ఉంది. ఈ పరిస్థితిలో, రాజకీయ ప్రాబల్యం వంటి ఆర్థికేతర అంశాలు, ఇతరేతర మార్కెట్లతో సంబంధం తాలూకు స్వభావం వంటివి మార్కెట్ వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేయగలవు. దానిపై పరిమితులు విధించగలవు. ఇటువంటి పరిస్థితులలో, మార్కెట్లు అత్యంత బలహీనమైన స్థాయిలో స్థిరత్వాన్ని, సంతృప్తికరమైన ఫలితాలను మాత్రమే ఇవ్వగలవు. అంతేకాకుండా, ఈ పరిస్థితులలో మార్కెట్లు భారీ స్థాయిలో వృధాకు దారితీయగలవు. ఈ వృధా, ముఖ్యంగా మానవవనరుల విషయంలో ఎక్కువగా జరుగుతుంది. గ్రామీణ మార్కెట్లు, గ్రామీణ ప్రాంతాలలోని భిన్న బృందాల బేరసారాల శక్తిని సూచిస్తాయి. ఇది, మౌలిక స్థాయిలో; సంపదస్థాయి, సమీకరణ స్థాయి, రాజకీయ సంస్థల బలం, వాటి ప్రభావం, వివిధ బృందాల, ప్రభుత్వ సంస్థల మద్దతు మొదలైన అన్నింటిపైనా ఆధారపడి ఉంటుంది. అటు ప్రభుత్వము, ఇటు మార్కెట్ల వనితీరు, సామాజికంగానూ, చారిత్రకంగానూ కూడా, నిర్దిష్టవర్గ సమీకరణలు, అధికార స్థానాలు, భిన్నబృందాల బేరసారాల శక్తి మొదలైన వాటిపై ఆధారపడి ఉన్నది. అందుచేత మార్కెట్లను, రాజ్యాన్ని వేరుచేసి చూసే (ఇది మౌలికంగా లోపభూయిష్టమైనది) విధానం పొరపాటు. ఈ బేరసారాలలో; రాజ్యము, మార్కెట్ వ్యవస్థకూడా ముందస్తు ప్రాథమిక షరతులను కల్పిస్తాయి. అలాగే ముందుగా ఏర్పడిన అధికార స్థానాలను మార్చుకొనే ఘర్షణలో పాత్ర వహిస్తాయి.

ప్రతిపాదన 12: ప్రపంచ (సరిహద్దులు) ధరలు మాత్రమే 'సరైన' ధరలు

ప్రతిపాదన తాలూకు లోపం : అంతర్జాతీయ ధరలనేవి వివిధ దేశాల మధ్య వాణిజ్య లావాదేవీల ధరల కలగలుపును సూచిస్తాయి. నేడు ఈ వ్యాపారాన్ని ఎంత మాత్రమూ 'స్వేచ్ఛ' వ్యాపారం అనలేము. వివిధ ప్రభుత్వాలు ధరలను అదుపు చేస్తూ, ప్రభావితం చేస్తూ వున్నాయి. అలాగే ఈ విషయంలో బడా కార్పొరేట్ సంస్థలు, ప్రధాన అంతర్జాతీయ మదుపుదారుల వత్తిడికూడా వుంది. ప్రాథమిక వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో, అభివృద్ధి చెందిన దేశాలు మార్కెట్లను అదుపు చేయటానికి సంబంధించిన ఆధారాలు కోకొల్లలుగా వున్నాయి. ఇక, ఉత్పత్తి చేసిన సరుకులు సేవల విషయంలో కూడా ధరలను నియంత్రించే ప్రయత్నాలు అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్నాయనడానికి ఆధారాలున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, వివిధ ప్రభుత్వాల జోక్యానికే కాక; ఊహకందని రీతిలో తరచుగా మారుతున్న డిమాండ్‌కు, సరఫరాలో మార్పులకు కూడా లోనవుతున్నాయి. అందుచేత, వనరుల పంపిణీలో ఈ ధరలు 'సరైనవి' అని అనటం సబబుకాదు. ముఖ్యంగా, ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింతగా వర్తిస్తుంది. స్థానికమైన వైనా లేదా అంతర్జాతీయ మైనవైనా; ధరలు బలాబలాల స్థాయిలు, వనరులు, ఆదాయాల పంపిణీపై ఘర్షణను ప్రతిబింబిస్తాయి. అందుచేత, అటువంటి పంపిణీకి సంబంధించిన బహిరంగ లేదా నిగూఢ అంశాలతో నిమిత్తం లేకుండా 'సరైన' ధరలు అనేవి లేవు.

(రచయిత న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఆర్థిక అధ్యయనాలు, ప్రణాళికా విభాగం ప్రొఫెసర్)

అప్పు - విశ్వరూపం

(6వ పేజీ తరువాయి)

ఇస్తుంది. ఇది ఉభయత్రా లాభం చేకూర్చే పథకం. కేంద్రం వడ్డీ రేట్లు తగ్గించడంతో డిపాజిట్లు తగ్గుతున్నాయి. అనివార్యంగా రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్లనుండి అప్పులు పొందాల్సిన దుర్గతి పట్టింది. చిన్నపొదుపు మొత్తాలపై వడ్డీ ఎక్కువగా వున్నా అది ప్రజలకే చెందుతుంది. ఆడబ్బుతో వారు తమ కొనుగోలు శక్తిని పెంచుకుంటారు. అది పారిశ్రామికీకరణకు దోహదపడుతుంది. చంద్రబాబు గారు తాను తక్కువడ్డీకి ప్రపంచబ్యాంకు వద్ద అప్పు తెస్తున్నట్లు గొప్పగా చెప్పుకుంటున్నారు. అది నిజం కాదు.

ప్రపంచ బ్యాంకు అప్పు-వడ్డీల భాగోతం: ప్రపంచబ్యాంకు కేంద్రప్రభుత్వ హామీపై రాష్ట్రాలకు అప్పులిస్తుంది. ఇందులో అనేకరకాలున్నాయి. ప్రధానంగా సెక్టొరల్ లోన్స్(ప్రాజెక్టుల కోసం ఇచ్చేది), రీస్ట్రక్చరింగు లోన్ (ఆర్థిక పునర్నిర్మాణం) దీనికి షరతులుంటాయి. సబ్సిడీలు తగ్గించడం, యూజర్ చార్జీలు ప్రవేశపెట్టడం, ప్రభుత్వరంగాన్ని అమ్మేయడం లాంటివే ఆషరతులు. వారిచ్చే డబ్బు డాలర్లరూపంలో వుంటుంది. దాన్ని కేంద్రం వుంచుకొని రూపాయల్లో రాష్ట్రానికి ఇస్తుంది. అంతర్జాతీయంగా రూపాయి మారకం విలువలో వచ్చే మార్పుల ఒడిదుడుకులను తట్టుకోవాల్సింది కేంద్రం కనుక అప్పులో కొంతభాగం(10నుండి 20శాతం వరకు) వారేవుంచుకుంటారు. రూపాయి మారకం విలువ మారినప్పుడల్లా అప్పు అసలు, వడ్డీ పెరుగుతుంటుంది. దాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే మనం కట్టే వడ్డీ చాల ఎక్కువ. ఒకవేళ తక్కువ అనుకున్నా అది మన దేశంలో వుండదు. వడ్డీ రూపంలో మన సంపద విదేశాలకు తరలి వెళుతుంది. మన మార్కెట్లవిస్తరణకు అదితోడ్పడదు. మన అభివృద్ధి మందగిస్తుంది. స్వదేశీ, విదేశీ అప్పులకు తేడా ఇదే. వినిమయ అప్పు: మార్కెట్ మాంద్యంలో వున్నప్పుడు వినిమయఖర్చును పెంచడానికికూడా వడ్డీరేట్ల తగ్గింపు అనేఆయుధాన్ని ఉపయోగిస్తారు.డబ్బు దాచుకోవడం కన్నా ఖర్చు పెట్టడం ఉచితమనే నిర్ణయానికి వినియోగదారుడు వస్తాడు. సంక్షోభాల కాలంలో సరుకులు అమ్ముకోడానికి కంపెనీలు వినియోగదారులకు అప్పులిచ్చి సరుకులు కొనుగోలు చేయిస్తుంటాయి. ఉదాహరణకు ఉద్యోగులకు స్కూటర్లు, ఫ్రిజ్‌లు, కలర్ టీవీలు కొనుగోలు చేయడానికి వడ్డీలేని రుణం పేరుతో సరుకులు అంటగడుతుంటాయి. నిజానికి వడ్డీ లేదనేది ఆకర్షణ మాత్రమే. కంపెనీల దగ్గర సరుకులు అమ్ముడుపోకుండా నిల్వ వుంటే అది డెడ్ కాపిటల్ కిందమారుతుంది. అదివడ్డీకన్నాఎక్కువ నష్టం. అందుకే వారు ఆపథకాలు పెడుతున్నారు. ప్రపంచబ్యాంకు కూడా ఇలాగే వెనుకబడిన దేశాలకు అప్పులిచ్చి సామ్రాజ్యవాద దేశాలనుండి యంత్రాలు, సరుకులు కొనుగోలు చేయిస్తుంది. ప్రపంచానికే పెద్ద మార్వాడీ ప్రపంచబ్యాంకు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత వలసలు రద్దవడంతో అభివృద్ధిపేరుతో అప్పులనేకొత్త ఎరతో కొత్తగా స్వాతంత్ర్యం సంపాదించుకున్న దేశాలను దోచుకోడానికి పథకం పన్నారు. దాన్నే నయా వలసవాదం అంటున్నారు.

అప్పులు-అభివృద్ధి

అప్పుల ద్వారా అభివృద్ధి సాధించవచ్చని చంద్రబాబుగారు పదేపదే అంటుంటారు. ఇది పాత చింతకాయ పచ్చడి సిద్ధాంతం. ప్రపంచబ్యాంకు దగ్గర అప్పు తీసుకున్న 70దేశాలను అధ్యయనం చేసిన కెనడా మేధావి ఛెసొడవస్కీఈ వాదన అసలు ముసుగును తొలగించారు. వారంతా నేడు కుతికల వరకు మునిగి దివాళా స్థితిలో వున్నారని తేల్చారు. ప్రపంచబ్యాంకు ఛీఫ్ ఎకనమిస్టుగా పనిచేసినస్టిగ్‌లిజ్ దీనికి నిరసనగానే రాజీనామాచేసి తప్పుకున్నారు. అర్జెంటైనాలో జరుగుతున్నతాజా పరిణామాలు దీన్నే రుజువు చేస్తున్నాయి. అప్పుల వూబిలో ఇరుక్కొని తన్నుకు చస్తుంది. ప్రపంచబ్యాంకు దివాళాకోరు విధానాలకు ఇది మచ్చుతునక. ఏదో ఒక రోజు అలాంటి ఉపద్రవం మనకూ ముంచుకొస్తుంది. వడ్డీలు: ఒకప్పుడు వడ్డీ వ్యాపారాన్ని మతాలన్నీ నిరసించాయి. కాని అది రూపుమాపబడకపోగా మరింతగా విస్తరించింది. అప్పుకి వడ్డీ, భూమికి కౌలు, పెట్టుబడికి లాభం సహజన్యాయసూత్రాలుగా చలామణీ అవుతున్నాయి. డబ్బు చెలామణీ వేగాన్ని బట్టి వడ్డీరేట్లు నిర్ణయమవుతాయి. ద్రవ్యోల్బణం రేటుకన్నా వడ్డీరేట్లు ఎక్కువగా వుంటాయి. అప్పుడే మిగులు వుంటుంది. అదనపు విలువను కూడగట్టే ఒకానొక సాధనమే వడ్డీ.

రీ-షెడ్యూలింగు

అసలు, వడ్డీ వాయిదా కట్టలేని స్థితిలో అప్పుతీసుకున్న వారు బాకీగడువు పొడిగింపుకి రీ-షెడ్యూలింగును కోరుతారు. ఉదాహరణకు సహకార సంఘాలు, బ్యాంకుల్లో రైతులు అప్పు తీసుకుంటారు. కరువు, వరదలొచ్చి పంటలు పండకపోతే వారి రుణాలను రీ షెడ్యూలు చేస్తారు. అంటే వాయిదాలు పొడిగించి అదనపువాయిదాల్లో బాకీ చెల్లించాలన్న మాట.

డెట్ ఈక్విటీ: (బాకీ భాగస్వామ్య వాటా) ఉదాహరణకు ఒక సహకార ఫ్యాక్టరీ స్థాపనకు రైతుల వాటాతో పాటు రాష్ట్రప్రభుత్వం కూడా అప్పు ఇస్తుంది. ఆ ఫ్యాక్టరీ ఈఅప్పు తీర్చలేని స్థితిలో వుంటే దాన్ని ఫ్యాక్టరీలో తన వాటాగా మార్చుకుంటుంది. దాన్నే డెట్ ఈక్విటీ అంటారు.

క్రెడిట్ కార్డుల విధానం: ఎక్కడికి వెళ్లినా డబ్బును మోసుకెళ్లకుండా బ్యాంకులు క్రెడిట్‌కార్డు మంజూరు చేస్తాయి. అది మన రుణ సామర్థ్యాన్ని తెలియచేస్తుంది. ఉదాహరణకు ఒక షాపు కెళ్లామనుకోండి. డబ్బుకి బదులు క్రెడిట్‌కార్డు ఇస్తాం. దాని ప్రకారం మన డబ్బును షావుకారు ఖాతాలో జమచేస్తారు. అందుకు మన నుండి బ్యాంకులు సర్వీసుచార్జీ వసూలు చేస్తాయి. నేడు ప్రపంచమంతా క్రెడిట్‌కార్డు విధానం విస్తరిస్తున్నది. దీన్నిఆసరా చేసుకొనేఇ-బిజినెస్‌కూడా సాగుతోంది.

రుణ విధానం: ప్రతి ఆరునెలల కొకసారి కేంద్ర ప్రభుత్వం (రిజర్వుబ్యాంకు) రుణవిధానాన్ని ప్రకటిస్తుంది. దాని ప్రకారం సంస్థాగత రుణాలపై వడ్డీ ఎంత వుండాలనేది నిర్ణయిస్తారు. వడ్డీ రేట్లు ఎక్కువగా వుంటే పొదుపు పెరుగుతుంది. వినిమయం తగ్గుతుంది. సరుకులకు డిమాండు తగ్గుతుంది. అది మాంద్యానికి దారితీస్తుంది. ఆ స్థితిలో వడ్డీరేట్లు తగ్గిస్తారు. పొదుపు తగ్గి వినిమయం పెరుగుతుంది. సరుకులకు డిమాండు పెరిగి ధరల పెరుగుదలకు దారితీస్తుంది. దాన్నే ద్రవ్యోల్బణం అంటారు. డబ్బు సరఫరాను బడ్జెట్ ప్రభావితం చేస్తుంది. దాన్నే లోటు బడ్జెట్ ఆర్థికవిధానం అంటారు. బడ్జెటులో లోటును పూడ్చుకోడానికి అదనంగా డబ్బును ముద్రిస్తారు. అదే ప్రభుత్వరుణంగా మారుతుంది. ద్రవ్యోల్బణానికి అదే కారణం. రుణ విధానంలో భాగంగా ద్రవ్య నిలువ నిష్పత్తి (క్యాష్ రిజర్వు రేషియో)ని, చట్టబద్ధ ఆస్తుల నిష్పత్తి (స్టాట్యుటరీ లిక్విడిటీ రేషియో) ని నిర్ణయిస్తారు. మొత్తం డబ్బులో చలామణిలో వుండాల్సింది ఎంత? రిజర్వులో వుండాల్సింది ఎంత? అనేది నిర్ణయమవుతుంది. మొత్తం ద్రవ్యంలో రుణమిచ్చే వాటాను కూడా నిర్ణయిస్తారు. దీన్నే లెండింగు రేటు అంటారు. డిపాజిట్‌దారుల రక్షణకు ఈ నిధులను రిజర్వుగా వినియోగిస్తారు.

పారుబకాయిలు: బ్యాంకులు పెద్ద మొత్తాలలో పెట్టుబడిదారులకు రుణాలిస్తాయి. వారు దాన్ని పెట్టుబడిగా ఉపయోగించి సరుకులు తయారుచేస్తారు. లాభాలు దండుకుంటారు. కాని బ్యాంకులకు సకాలంలో రుణాలు చెల్లించరు. రాజకీయ పలుకుబడి ఉపయోగించి దీర్ఘకాలం బకాయిపెడతారు. తమకనుకూలమైన ప్రభుత్వం వుంటే పారు బకాయిలకింద (బ్యాడ్ డెట్స్) రద్దుచేయించుకుంటారు. ఆ విధంగా వారు ప్రజలడబ్బును పరోక్షంగా కొల్లగొడతారు. పెట్టుబడిదారుల ఆస్తుల పెంపకానికి తోడ్పడే అంశాలలో ఇది ఒకటి. పెట్టుబడిదారులెవరూ తమ స్వంతడబ్బుతో పరిశ్రమలు నడపరు. బ్యాంకుల డబ్బుతోనే నడుపుతారు. మునిగినా తేలినా బ్యాంకులే. ఒక రూపాయి తమ డబ్బుకి పది రూపాయిలు బ్యాంకు రుణం జత చేస్తారు. ఆ విధంగా పోగుపడిన డబ్బుతో ఇప్పుడు పెట్టుబడిదారులే బ్యాంకర్లుగా మారారు. అందుకే బ్యాంకుల ప్రైవేటీకరణ డిమాండు వూపందుకుంది. స్వంతంగా ఫైనాన్స్ కంపెనీలు కూడా స్థాపించుకున్నారు. వాటి ద్వారా ప్రజలనుండి ప్రత్యక్షంగా డిపాజిట్లు సేకరిస్తారు. అలా ప్రజల డబ్బు పెట్టుబడిదారుల చేతుల్లోకి పోతుంది.

రుణభారం: ఒక దేశం లేదా సంస్థ లేదా కుటుంబం ఏదైనా అప్పు భరించగల స్థాయిని బట్టి అప్పు చేయాలి. దానిని మించి చేస్తే అది రుణభారంగా మారుతుంది. అప్పుడు ఆర్థికవ్యవస్థలు తల్లకిందులవుతాయి. మొత్తం ఉత్పత్తి విలువ(జిడిపి)ను బట్టి రుణస్థాయి నిర్ణయమవుతుంది. అలాగే బడ్జెట్‌లో రుణశాతాన్ని బట్టి కూడా దీన్ని అంచనా వేస్తారు. వడ్డీ, అసలు వాయిదా చెల్లింపును డెట్ సర్వీసు అంటారు. ఉదాహరణకు మన దేశంలో అది 33శాతం వరకు వుంది. ఇదే మన బడ్జెట్‌లో పెద్దపద్దు. విదేశీ అప్పులు తీర్చడానికి విదేశీ మారకద్రవ్యం (డాలర్లు) కావాలి. మన ఎగుమతుల ద్వారా అది మనకు లభిస్తుంది.

పంజాబ్‌లో పార్టీ విచ్ఛిన్నకుల యత్నాలు విఫలం

పంజాబ్‌లో మంగత్ రామ్ పస్లా, అతని ముఠా విచ్ఛిన్న, సమాంతర కార్యకలాపాలపై సిపిఎం పంజాబ్‌రాష్ట్రకమిటీ రూపొందించిన సంస్థాగత నివేదిక సవివరమైన వివరాలను అందిస్తుంది. నివేదిక వివరాలిలా ఉన్నాయి. నయావలసవాద డబ్ల్యుటిఓ సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు, మతతత్వశక్తుల సవాళ్లపై పోరాటాన్ని మేం ఎదుర్కొన్నాం. అయితే దురదృష్టవశాత్తూ రాష్ట్రంలో ముఠాతత్వం వల్ల ఆ పోరాటాన్నిఅవకాశమున్నంత మేర సాగించలేకపోయాం. ఈ సవాళ్లను మేం ప్రతిఘటించాం. కానీ పార్టీలో కొందరురాష్ట్రనాయకత్వంతో సహాయ నిరాకరణ వైఖరిని తీసుకొని ఉద్యమాలలో పూర్తిగా పాల్గొనలేదు. 16వ పార్టీ మహాసభ లో ఏకగ్రీవంగా ఆమోదించిన రాజకీయ తీర్మానం పంజాబ్ పార్టీలో ఐక్యతా వాతావరణాన్ని, అందుకు తగిన ప్రాతిపదికను కల్పించింది. అయినా ఆ తర్వాత కొందరు నాయకులు తమ సహాయ నిరాకరణ వైఖరినికొనసాగించారు. అదే సమయంలో కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్నిఅతిక్రమించడం, రాష్ట్రకమిటీకి కట్టుబడి ఉండకపోవడం మూలంగా కొన్నిసంస్థాగత సమస్యలు తలెత్తాయి. పంజాబ్ యూనిట్‌ను సమైక్యంగా నిలిపి ఉంచడానికి పార్టీ కేంద్రనాయకత్వం ఎప్పటికప్పుడు జోక్యం చేసుకుంటూ గట్టి ప్రయత్నాలు జరిపింది. పంజాబ్ పార్టీ అంతర్గత సమస్యలపై కేంద్రకమిటీ 1999 నవంబర్‌లో ఒక నివేదికను ఆమోదించింది. పార్టీకి-ప్రజాసంఘాలకు మధ్య కొనసాగాల్సిన సంబంధాలు, సమైక్యతపై అది సూచనలు చేసింది. విచ్ఛిన్న కార్యకలాపాలకు పాల్పడుతున్న తార్సెమ్ జోధన్‌ను ఒంటరిపాటు చేయడానికి స్పష్టమైనసూచనలు పంపింది. అతనితో ఎటువంటి సంబంధాలూ కొనసాగించవలదని పార్టీ కామ్రేడ్స్‌ని కోరింది. అయినా పస్లా, మరికొందరు నాయకులు అతనితో సంబంధాలు సాగించారు.

కేంద్రకమిటీ జోక్యం చేసుకున్నాపార్టీఅంతర్గత పరిస్థితి మెరుగుపడలేదు. పస్లాతో పాటు కొన్ని జిల్లా కమిటీలు తమ సహాయనిరాకరణ వైఖరిని కొనసాగించాయి. ఏ ఉద్యమాలలోనూ చివరికి అఖిల భారత పిలుపులలోనూ వారు పాల్గొనలేదు. రైతాంగ ఉద్యమాలలోనూ, అఖిల భారత పిలుపులలోనూ వారి భాగస్వామ్యం నామమాత్రంగానే ఉంది. కొందరు నాయకులు, శాఖలు, సభ్యులు రాష్ట్రకమిటీని బహిరంగంగా వ్యతిరేకించారు. జోధన్‌తో , రాష్ట్రకమిటీ నుండి ఏడాది పాటు బహిష్కరణకు గురైన చంద్రశేఖర్ కుమ్మక్కయి పార్టీకి చెందిన కారును బలవంతంగా లాక్కుపోయాడు. కేంద్రకమిటీ, రాష్ట్రకమిటీ పలుమార్లు హెచ్చరించినప్పటికీ అతను తన విచ్ఛిన్న కార్యకలాపాలను వదులుకోలేదు. పైగా సిఐటియులో తన పలుకుబడిని ఈకార్యకలాపాలకోసం దుర్వినియోగం చేశాడు. అందుకే అతనిని పార్టీ నుండి బహిష్కరించవలసి వచ్చింది. దానిని తర్వాత కేంద్రకమిటీ ఆమోదించింది.

పార్టీ రాజ్యాంగంలోని నియమ నిబంధనలను, అంతర్గత పనితీరు నియమాలను, అంతర్గతవిభేదాలను పార్టీలోనే పరిష్కరించు కోవడానికుద్దేశించిన కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని అతిక్రమించి అసమ్మతి వాదులు బూర్జువా పత్రికలకు తమ విభేదాల గురించి చేరవేయడం ప్రారంభించారు. సమైక్యతను కాంక్షిస్తూ పొలిట్‌బ్యూరో పంపిన లేఖను పంజాబ్ కామ్రేడ్స్‌కి వివరించడం కోసం పార్టీ ప్రధాన కార్యదర్శి హరికిషన్‌సింగ్ సూర్జిత్, ఇద్దరు పొలిట్‌బ్యూరో సభ్యులు (ప్రకాష్ కరత్, ఎస్. ఆర్. పిళ్లై) 2001 మార్చి 7న వచ్చారు. ఆ సందర్భంగా జరిగిన సమావేశం నుండి 9మంది రాష్ట్రకమిటీ సభ్యులు వాకౌట్ చేశారు. పొలిట్‌బ్యూరోసభ్యులు వలదని వారించినప్పటికీ వారు వినలేదు. ఆ తర్వాత జరిగిన రాష్ట్రకమిటీ సమావేశాలన్నిటినీ వారు బహిష్కరిస్తూ వచ్చారు. పిబి లేఖను ఆ కామ్రేడ్స్ తీవ్రంగా తీసుకోలేదు. అది కంటితుడుపు చర్యగా అభివర్ణిస్తూ కార్యకర్తల వద్దకూ దానిని తీసుకుపోలేదు. ఆ లేఖ ప్రాతిపదికన రాష్ట్ర కార్యదర్శివర్గం పార్టీ ఐక్యత కోసం చేసిన కృషినంతటినీ విఫలం చేసేందుకే వారు ప్రయత్నించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశాలకు పస్లా హాజరుకావడం మొత్తంగా మానివేశారు. రాష్ట్రకమిటీని ధిక్కరించడం, సమాంతర కార్యకలాపాలను నడపడం మరింత పుంజుకుంది. ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో ఆగస్టు, సెప్టెంబర్‌లో క్రమశిక్షణా రాహిత్యం హద్దులు దాటి పార్టీనే సవాలు చేసే స్థాయికి చేరుకుంది. ప్రధాన కార్యదర్శి సూర్జిత్ ప్రసంగించాల్సి ఉన్న జనరల్ బాడీ సమావేశాలను జలంధర్, భటిండా, ఫరీద్‌కోట్, అమృత్‌సర్ జిల్లా కమిటీలు బహిష్కరించాయి. అవి సమాంతర సమావేశాలని పేర్కొనే నీచమైన స్థితికి దిగజారాయి. ఇది వారిలో సంస్థాగత దృష్టి, విప్లవ లక్ష్యశుద్ధి లోపించిన విషయాన్ని తేటతెల్లం చేసింది. వాస్తవానికి కార్యకర్తలు ఈ నిర్లక్ష్యాన్ని అనవసరమైనదిగా గుర్తిస్తారు. సమావేశాలను బహిష్కరిస్తున్న వారి పార్టీ వ్యతిరేక లక్ష్యాల గురించి కూడా కార్యకర్తలకు తెలిసివస్తుంది.

పార్టీ 17వ మహాసభల నిర్వహణ సందర్భంగా కూడా కొన్ని జిల్లా కమిటీలు జిల్లా, తహసీల్ మహాసభలకు రాష్ట్రకమిటీ నిర్ణయించిన షెడ్యూలును కాదని దొంగతనంగా సమాంతర మహాసభలను జరపడం ప్రారంభించాయి. సూర్జిత్, కరత్, పిళ్లై హాజరైన సమావేశం కాకుండా నవంబర్ 3న కూడా రాష్ట్రకమిటీ సమావేశం జరిగింది. యథాప్రకారం పస్లా మరికొందరు రాష్ట్రకమిటీ సభ్యులు ఈ సమావేశాలను కూడా బహిష్కరించారు. ఈ సమావేశం తరువాత సమాంతర మహాసభల క్రమాన్నివారు వేగవంతం చేశారు. అందులో తాజాపరిచిన పార్టీ కార్యక్రమాన్ని సవాలు చేయడం ప్రారంభించారు.

ఈ శక్తులు పార్టీ అగ్రనాయకులపై బురదజల్లడం కూడా ప్రారంభించాయి. పలు సమాంతర జిల్లా మహాసభలకు పస్లా హాజరయ్యారు. ఈ మహాసభల నివేదికలను, తాజా పరచిన పార్టీ కార్యక్రమంపైదాడిని బూర్జువా పత్రికల్లో ప్రచురించారు. తాజాపరచిన పార్టీ కార్యక్రమం ప్రాతిపదికపైనే 2001 సభ్యత్వాన్ని పునరుద్ధరించిన వాస్తవాన్ని ఆ శక్తులు విస్మరించాయి.

ఈ సమాంతర మహాసభలను పొలిట్‌బ్యూరో నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. అవి పార్టీ క్రమశిక్షణకు, రాజ్యాంగానికి వ్యతిరేకమైనవని పిబి పేర్కొంది.

డిసెంబర్ 3న పరిస్థితి మరింత హీనంగా క్షీణించింది. పస్లా, అతని అనుచరులు ఆర్గనైజింగ్ కమిటీని తమకు తాము ప్రకటించుకున్నారు. పస్లా దానికి కన్వీనర్‌గా ప్రకటించుకున్నారు. డిసెంబర్ 13-14 తేదీల్లో జలంధర్‌లో సమాంతర రాష్ట్రమహాసభను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. చీలికగ్రూపు విచ్ఛిన్న కార్యకలాపాలతో మన విప్లవకర పార్టీ ప్రమాణాలు, విధానాలను పస్లా తుంగలోతొక్కారు. వీటన్నిటినీ గమనంలోకి తీసుకున్న పొలిట్‌బ్యూరో పార్టీ రాజ్యాంగంలోని 13వ క్లాజును ప్రయోగించి మంగత్‌రామ్ పస్లాను పార్టీనుండి బహిష్కరించింది. ఈ శక్తుల పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను తిప్పికొట్టాల్సిందిగా పంజాబ్ కార్యకర్తలకు పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది. పస్లా నాయకత్వంలోని చీలికగ్రూపుతో సంబంధాలు పెట్టుకునే వారికి పార్టీతో ఎటువంటి సంబంధాలూ ఉండవని కూడా అది స్పష్టం చేసింది.

పీపుల్స్ డెమొక్రసీ పత్రిక నుండి

→ → →

ఎగుమతుల్లో ఎంత శాతం అప్పులకు కడతామో దాన్ని బట్టి డెట్ సర్వీసు రేషియో తెలుస్తుంది. అదీ చాలకపోతే అప్పు తీర్చడానికే అప్పుతెస్తాం. అలాంటి అప్పులిచ్చే సంస్థ ఐ. యం. యఫ్..వారు మనకు అప్పు ఇవ్వడానికి పెట్టిన షరతులే నేడు నూతనఆర్థికవిధానాల పేరుతో చెలామణీ అవుతు న్నాయి. రానురాను మొత్తం బడ్జెట్ యావత్తూ అప్పులు తీర్చడానికే సరిపోతుంది. అప్పుడు దాన్ని రుణసంక్షోభం అంటారు. ఆ స్థితిలో మనకు ఎవరూ అప్పులివ్వరు.

అప్పు-మారకపు విలువ: విదేశీ కరెన్సీతో మనదేశపు రూపాయి మారకాన్నిబట్టి రూపాయి విలువ వుంటుంది. ఉదాహరణకు ఒక డాలరుకి 20 రూపాయలుందనుకుంటే అప్పుడు మనం 100డాలర్లు అప్పు తెచ్చామనుకుందాం. రూపాయల్లో దాని విలువ 2000 అవుతుంది. దానికి వడ్డీ 10 శాతం అనుకుంటే 200 వడ్డీ కట్టాలి. కాని కొన్ని రోజులకు రూపాయిమారకంరేటు 50లకు పెరిగిందనుకుందాం. అప్పుడు మన అప్పు విలువ 5000లకు పెరుగుతుంది. వడ్డీ రేటు 10 శాతమే వున్నప్పటికీ రూపాయిల్లో వడ్డీ 500చెల్లించాలి. పాతమారకపు విలువప్రకారం అయితే వడ్డీ 25 శాతం అవుతుంది. అధిక వడ్డీలు, సంపద గుంజేందుకు ధనికదేశాలు, అంతర్జాతీయ ఆర్థికసంస్థలు అనుసరిస్తున్న దుర్మార్గమైన పథకం ఇది.

కష్టజీవి, ఉక్కుమనిషి మావో

(2వపేజీ తరువాయి)

చెబుతారు. ఆయన కోపంగా వుండటం నేనెప్పుడూ చూళ్లేదు. కొన్ని సందర్భాల్లో ఆయన పట్టరాని కోపంతో ఉద్విగ్నుడైపోతాడని ఇతరులు చెబితే విన్నాను. అటువంటి సమయాల్లో ఆయన మాట పాషాణం లాగానూ, అతి నిశితంగానూ దానికదే సాటిగానూ ఉంటుంది.

వర్తమాన ప్రపంచ రాజకీయాలను గురించి ఆయనకు అంతబాగా తెలిసి వుండటంచూసి నేను ఆశ్చర్యపోయాను. దీర్ఘయాత్ర సాగించే రోజుల్లో కూడా కమ్యూనిస్టులు రేడియో వార్తా ప్రసారాలు వింటూండేవారని అర్థమైంది. వాయవ్య ప్రాంతంలో వారు సొంత వార్తా పత్రికలే ప్రచురించేవారు. ప్రపంచ చరిత్రను మావో చాలా క్షుణ్ణంగా అధ్యయనం చేసివున్నాడు. యూరోపియన్ సామాజిక, రాజకీయ పరిస్థితుల విషయమై ఆయనకు వాస్తవికమైన అవగాహనవుంది. ఇంగ్లాండులోని లేబర్ పార్టీపట్ల ఆయన చాలా ఆసక్తి కనబరిచారు. దాని ప్రస్తుత విధానాలను గురించి నన్ను లోతుగా ప్రశ్నించాడు. కాసేపట్లోనే నావద్ద సమాచారం అయిపోయింది. కార్మికులకు ఓటు హక్కువున్న దేశంలో అక్కడ యింకా కార్మికుల ప్రభుత్వం ఎందుకేర్పడలేదో అర్థం చేసుకొనటం తనకు కష్టంగా వుందన్నట్లుగా నాకాయన కనిపించాడు. నా సమాధానా లాయన్ని సంతృప్తి పరచలేదని నేను భయపడ్డాను. రామ్‌సే మెక్డొనాల్డు అంటే చాలా తీవ్రమైన ద్వేషాన్ని వెలిబుచ్చాడు. అతను ప్రజలకు పచ్చిద్రోహి అని మావో వర్ణించాడు.

భారతదేశాన్ని గురించి ఆయన చాలా పుస్తకాలు చదివాడు. ఆ దేశాన్ని గురించి ఆయనకు కొన్ని కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. వాటిలో ముఖ్యమైన దేమంటే, వ్యవసాయ విప్లవం లేకుండా భారతదేశ స్వాతంత్ర్యం ఎన్నటికీ సాధించబడ జాలదనేది. గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుహాసినీ ఛటోపాధ్యాయ, ఇంకా నాకుతెలిసిన ఇతర భారతీయనాయకులను గురించి ఆయన ప్రశ్నలు వేశాడు. అమెరికాలోని నీగ్రో సమస్యగూడా ఆయనకు కొంతతెలుసు. అమెరికాలో నీగ్రోలు, అమెరికన్ ఇండియన్ల పట్ల వ్యవహరించే తీరుకూ అల్ప సంఖ్యాక జాతులపట్ల సోవియట్ యూనియన్‌లో అనుసరించే విధానానికీ గలతేడాను ఎత్తి చూపి సోవియట్ విధానం ఎలా సరైందో చెప్పాడు. అమెరికాలోని నీగ్రోలు, రష్యాలోని అల్పసంఖ్యాక జాతులయొక్క చారిత్రక పూర్వరంగంలో గల పెద్ద తేడాలను నేను కొన్నింటిని సూచించగా వాటిపట్ల ఆయన ఆసక్తి చూపాడు.

తత్వశాస్త్రంలో మావో చాలా పట్టుదలగల విద్యార్థి. ఒకసారి నేను రాత్రిపూట కమ్యూనిస్టు చరిత్ర విషయమై గోష్ఠులు జరుపుతున్నాను. ఆ సమయంలో ఒక వ్యక్తివచ్చి తత్వశాస్త్రంపైనే అనేక కొత్త పుస్తకాలు తెచ్చాడు. మనకార్యక్రమాలు వాయిదా వేసుకొందామని మావో నన్ను కోరాడు. ఆ పుస్తకాలన్నింటినీ బాగా కేంద్రీకరించి చదివి మూడునాలుగురాత్రిళ్ళల్లో పూర్తిచేశాడు. వాటిని చదివేకాలంలో మిగతా అన్నింటినీ ఏమీ పట్టించుకోనట్లే వున్నాడు. తన చదువును కేవలం మార్క్సిస్టు తత్వ శాస్త్రజ్ఞుల రచనలకే ఆయన గిరిగీసుకోలేదు. పురాతనగ్రీకులను గురించీ, స్పినోజా, థెంట్, గోకే, హెగెల్, రూసో తదితరులను గురించి కూడా ఆయనకు కొంత తెలుసు.

బలప్రయోగం, హింస, "చంపవలసిన ఆవశ్యకత"ల సమస్యలపట్ల మావోకు గల బాధ్యతాయుత దృక్పథాన్ని చూసి నేను తరుచు విస్తుపోతూండేవాణ్ని. యువకుడుగా వున్నప్పుడు ఉదారమైన, మానవతాధోరణులు బలంగా వుండేవి. అయితే, ఆయన ఆదర్శవాదంనుండి వాస్తవికతలోనికి పరివర్తన మొదట తాత్వికంగా జరిగిందనేది స్పష్టం. రైతు కుటుంబంలోనే పుట్టినప్పటికీ యువకుడుగా ఆయన అనేకమంది కమ్యూనిస్టుల్లాగా భూస్వాముల పీడనను తానుగా అనుభవించలేదు. ఆయన ఆలోచనావిధానంలోని అసలుసారం మార్క్సిజమే అయినప్పటికీ, వర్గకసి అనేది తన విశాలమైన తాత్వికధోరణిలో అది విజ్ఞానంరీత్యా అలవరచుకొన్న ఒక పద్ధతిమాత్రమే తప్ప కార్యాచరణకు పురిగొల్పే

స్వతస్సిద్ధమైన ధోరణికాదని నేను అభిప్రాయపడ్డాను.

మతభావాలని పిలవదగినవేవీ ఆయన్లోలేవు. ప్రాథమికమైన దృష్టిలో చెప్పాలంటే ఆయన మానవతావాది. మానవుని సమస్యల్ని పరిష్కరించు కొనటంలో మానవునికి శక్తివున్నదని ఆయన నమ్ముతాడు. చావుబ్రతుకుల సమస్యలు ఇమిడివున్న సందర్భాల్లో కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన మొత్తంమీద కొంచెం ప్రశాంతపరచే ప్రభావం కలుగజేసేవాడుగా బహుశా వుండి వుండొచ్చునని నేననుకొన్నాను.

మావోరోజుకు పదమూడు, పధ్నాలుగు గంటలు పని చేస్తాడు. తరచుగా రాత్రి పొద్దుపోయేంవరకూ పని చేస్తూంటాడు. తెల్లవారుజామున రెండు, మూడు గంటలైతే గాని తరచూ నిద్రపోడు. ఆయనది ఉక్కులాంటి శరీరనిర్మాణం. అందుకు కారణం ఆయన చెప్పాడు. యువకుడుగా వుండగా ఆయన తన తండ్రి పొలంలో కాయకష్టం చేసేవాడు. స్కూల్లో విద్యార్థిగా వున్నప్పుడు కొందరు కామ్రేడ్సుతో కలిసి స్పార్టన్ క్లబ్ (మంచి అలవాట్లు అలవరచుకొనే క్లబ్)ను నెలకొల్పి నిష్ఠతో గూడిన జీవితాన్ని గడిపాడు. ఈ క్లబ్బులో చేరినవారు తమ శరీరాన్ని గట్టిపరచుకొనటానికై అప్పుడప్పుడూ ఉపవాసాలుండేవారు. దక్షిణ చైనాలోని అడవులతో నిండిన కొండల్లో చాలాదూరం నడిచేవాళ్ళు. అత్యంత చల్లని వాతావరణంలో ఈతకొట్టేవారు. వర్షం, వడగండ్లవాన, మంచులో చొక్కాల్లేకుండా తిరిగేవాళ్ళు. చైనాలో రాబోయే సంవత్సరాలు గొప్ప కష్టాల్నీ, బాధల్నీ తట్టుకొని నిలబడగల శక్తిని డిమాండ్ చేస్తాయని వారికి ఊహామాత్రంగా తెలుసు.

ఒకసారి మావో వేసవికాలంలో తన సొంత రాష్ట్రమైన హూనాన్ అంతటా సంచారం చేశాడు. ఆ పొలంమీదా ఈ పొలంమీద పనిచేస్తూ తన తిండి సంపాదించుకొన్నాడు. కొన్ని సందర్భాల్లో అడుక్కుతిన్నాడు. మరోసారి రోజులతరబడి ఏమీ తిన్లేదు. ముదిరిపోయిన చిక్కుడుకాయ తిని, మంచినీళ్ళు తాగి జీవించాడు. ఇది గూడా పొట్టను "గట్టిపరచుకొనే" క్రమమేనేమో! తాను యువకుడుగావున్న ప్రారంభదినాల్లో గ్రామీణ ప్రాంతాల్లోచేసిన సంచారాల సందర్భాల్లో చేసుకొన్న స్నేహాలు పది సంవత్సరాల తర్వాత హూనాన్‌లోని వేలాది రైతుల్ని ప్రఖ్యాతి వహించిన రైతుసంఘాల్లోనికి సమీకరించటం ప్రారంభించినప్పుడు గొప్ప విలువైనవిగా సహాయపడ్డాయి. 1927లో కమ్యూనిస్టులతో కొమింటాంగ్ తెగతెంపులు చేసుకొన్న తర్వాత సోవియట్లకీ సంఘాలు ప్రథమస్థావరంగా రూపొందాయి.

చాలా మంచి దయార్ద్రమైన హృదయం గలవాడుగా మావో నాకు నచ్చాడు. మరణించిన తమ కామ్రేడ్సును గురించి మాట్లాడేటప్పుడుగానీ, లేదా హూనాన్‌లో కరువొచ్చి బియ్యం తగాదాలు జరిగినకాలంలో జరిగిన సంఘటనలను గుర్తుచేసేటప్పుడూ రెండుమూడుసార్లు ఆయన కళ్ళు చెమ్మగిల్లటం నాకు జ్ఞాపకముంది. ఆ సమయంలో ఆకలితో బాధపడుతూ నిరంకుశాధికారుల ఇండ్లనుండి ఆహారాన్ని డిమాండ్ చేసినందుకు కొందరి తలలు నరికివేయబడ్డాయ్. యుద్ధరంగంలోని ఒకరు గాయపడి వుండగా మావో తన కోటుతీసి అతనికిచ్చాడని ఒక సైనికుడు నాకు చెప్పాడు. ఎర్ర సైనికులకు బూట్లు లేనప్పుడు తాను బూట్లు తొడుక్కొనటానికి నిరాకరించేవాడని వాళ్ళు నాతో చెప్పారు.

అనారోగ్యంగా వున్నకొద్ది వారాలు మినహా 6వేల మైళ్ళ దీర్ఘయాత్రలో అత్యధికభాగం మిగిలిన సాధారణ సైనికుల్లాగానే ఆయనా నడిచాడు. "ద్రోహపూరితంగా" కొమింటాంగ్‌వైపుకు వెళ్ళిపోవటంద్వారా ఉన్నతమైన పదవులూ, ధనమూ సంపాదించగలిగేవాడే. ఇది ఎర్రసైనిక కమాండ్లలో అత్యధికులకు వర్తిస్తుంది. చైనాలో ఇతర తిరుగుబాటుదార్లను కొనివేసిన "సిల్వర్ బుల్లెట్ల" ('వెండితూటాల") చరిత్ర తెలుసుకొంటేనేగాని, ఈ కమ్యూనిస్టులు తమ సిద్ధాంతాలకు ఎంత గట్టిగా అంటిపెట్టుకొన్నారన్న విషయాన్ని అంచనాకట్టటం ఎవరికీ సాధ్యం కాదు.

మావో గట్టిగా చెప్పిన అనేక విషయాలను నేను పరీక్షించాను. అవన్నీ సాధారణంగా సరైనవిగానే వుండటం నేను గమనించాను. నాకుగూడా మావో రాజకీయ ప్రచారపుడోసులు కొద్దికొద్దిగా ఇచ్చాడు. అయితే, బందిపోటుదొంగలు కానివారి నుండి విన్నదానితో పోల్చుకొన్నప్పుడు ఇది ఆసక్తిదాయకంగా ఉంది.

స్టాలిన్ సూక్తులు

మన తప్పులను మనమే బయటపెట్టుకుంటే, ఆత్మ విమర్శ చేసుకొంటే శత్రువులు దాన్ని కార్మిక పార్టీని దెబ్బతీయడానికి ఉపయోగించుకుంటారనీ, అందువల్ల యిది ప్రమాదకరమైన పద్ధతి అని కొందరు అంటారు. ఈ అభ్యంతరం చాలా అల్ప విషయమని లెనిన్ స్పష్టం చేశారు. అది పూర్తిగా పొరపాటు అభిప్రాయమని ఖండించారు. ఇటి వాదనను లెనిన్ 1904లోనే మన పార్టీ యింకా బలహీనంగానూ, చిన్నదిగానూ ఉన్నప్పుడు నిరసించారు.

* * *

ప్రపంచంలో అన్ని దేశాల కార్మికోద్యమం నుంచి మనం పొందే మొత్తం అనుభవమే సిద్ధాంతం. విప్లవ సిద్ధాంతమనే వెలుగు లేని పక్షంలో ఆచరణ చీకటిలో తడువుకున్నట్లే, విప్లవ కార్యాచరణ లేకపోతే సిద్ధాంతం చుక్కానిలేని పడవ మాదిరిగా గమ్యస్థానం తెలియక తారట్లాడుతుందన్నమాట. నిజమే. కాని సిద్ధాంతానికి, కార్యాచరణకూ అవినాభావ సంబంధమున్నట్లయితే కార్మికోద్యమానికి బ్రహ్మాండమైన శక్తిగా ఉపయోగపడుతుంది.

* * *

పెట్టుబడిదారీవర్గం ఓడిపోయిన తర్వాత చాలా కాలం వరకూ, తన్ను ఓడించిన శ్రామికవర్గం కంటే యెక్కువ బలంగా ఉంటుంది. అందువల్ల అది తిరిగి అధికారంలోకి రావడానికి నకల ప్రయత్నాలూ చేస్తుంది.

* * *

ఇక్కడ వున్న సమస్య ఏమిటంటే, పార్టీ ముందున్న అనేక కర్తవ్యాలలో, ఏదో నిర్ణీతమైన తక్షణ కర్తవ్యం? దేనిని పూర్తి చేయడం కేంద్రం బాధ్యత అవుతుంది? దేనిని నిర్వహించటం ద్వారా ఇతర తక్షణ కర్తవ్యాలను జయప్రదంగా నిర్వహించటం సుగమమౌతుంది అనే దానిని నిర్ధారణ చేయటం.

* * *

సంస్కరణ వాదికి సంస్కరణలే సర్వస్వం: విప్లవ కార్యాచరణ అనేది ఏదో యాధాలాపంగా చెప్పేది, ఏదో పేరు చెప్పుకు తిరుగుతూ వుండేది. కేవలం కన్నీళ్ళు తుడుపు. అందుకనే, బూర్జువా పరిపాలన సాగుతున్న పరిస్థితులలో సంస్కరణల వాదపు ఎత్తుగడల క్రింద, సంస్కరణలు అనేవి తప్పనిసరిగా ఆ బూర్జువా పరిపాలనను బలపరుస్తానికే దారితీసే విధంగా తయారవుతాయి. విప్లవాన్ని శిథిలంచేసే విధంగా తయారౌతాయి.

* * *

ట్రేడ్ యూనియన్లు, సహకార సంస్థలు మున్నగుపార్టీ యేతర సంస్థలు అధికారరీత్యా పార్టీకి లోబడివుండాలని కాదు. ఈ సంస్థలలోవుంటూ, నిస్సందేహంగా వీటిల్లో పలుకుబడిగల పార్టీ సభ్యులు ఈ పార్టీయేతర సంస్థలు తమ కృషిలో సాధ్యమైనంత మేరకు శ్రామికవర్గ పార్టీకి దగ్గరగా జరిగి, స్వచ్ఛందంగా దాని రాజకీయ నాయకత్వాన్ని అంగీకరించేటట్లుగా తమ శక్తికొలది కృషి చేయాలనటమే దీని అర్థం.

* * *

ఏదో ఒక రూపంలో ఈ పెటీ-బూర్జువా గ్రూపులన్నీ పార్టీలోజేరి దానిలో ఊగిసలాట, అవకాశవాద భావాలనూ, నిరుత్సాహ, అనిశ్చయ భావాలనూ ప్రవేశపెట్టుతాయి: ప్రధానంగా అవే పార్టీలో ముఠాతత్వానికి, విచ్ఛిన్నతకూ మూలంగా వుంటాయి. ఇటువంటి "మిత్రులను" తన వెనక తట్టున పెట్టుకొని సామ్రాజ్యవాదంతో పోరాడమంటే ముందు, వెనక రెండు తట్టుల నుండి కాల్చబడే తుపాకి గుండ్ల మధ్య నిలబడటమన్న మాట. కాబట్టి సామ్రాజ్యవాదంతో జయప్రదంగా పోరాటం సాగించాలంటే, మొట్టమొదటి షరతు పార్టీలో ఇటువంటి శక్తులన్నింటికి వ్యతిరేకంగా నిర్దాక్షిణ్యమైన పోరాటాన్ని సాగించడం, పార్టీ నుండి వారిని వెళ్ళగొట్టడం అవసరం.

* * *

విప్లవతత్వం సోమరితనానికీ, ఊకదంపుడు పద్ధతులకు, మితవాద పోకడలకు, మానసిక నిస్తబ్దతకు, పాత సాంప్రదాయాల పట్ల బానిస ప్రవృత్తికి చక్కని విరుగుడు.

* * *

విప్లవతత్వం మన ఉద్యమానికి జీవశక్తి. అది మనలో కొత్త ఆలోచనలు రేకెత్తిస్తుంది. అన్ని వస్తువుల్ని అది ముందుకుతోస్తుంది. పాత సాంప్రదాయాలను మంటగలుపుతుంది. భవిష్యత్తును మన కళ్ళ యెదుటకు తెస్తుంది. అది లేనిది అనేది అసంభవం.

* * *

'బోల్షివిక్కుల'లో కొంతమంది సంకుచిత కార్యాచరణ 'వ్యాపారతత్వం' అనే జాడ్యంవల్ల తరచు పతనమై విప్లవ ఆశయాన్ని విడచిపెట్టారనే సంగతి ఎవరికి తెలియదు?

* * *

పార్టీలో కార్మికవర్గానికి విశ్వాసం ఒక్కసారిగాగాని, బలప్రయోగం ద్వారా గానీ కలగదు. ప్రజా సామాన్యంలో పార్టీ దీర్ఘకాలం పనిచేయడం ద్వారా సరియైన పార్టీ పాలసీని అవలంబించడం ద్వారా, అదే సరియైన పాలసీ అని ప్రజలు తమ నిత్యానుభవంలో తెలుసుకొనేటట్లు చేయడం ద్వారా, ఆ పాలసీని కార్మికవర్గం బలపరచేటట్లు చేయడంద్వారా, కార్మిక ప్రజాసామాన్యం తన నాయకత్వాన్ని అంగీకరించేటట్లు ఒప్పించడం ద్వారా అది కార్మికవర్గం యొక్క విశ్వాసాన్ని పొందగలుగుతుంది.

* * *

Check List

Book Number	SSR03 A236	Date	15/09/2021
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	NO		
Missing Pages	1 to 2		
Prepared	Ch. Ramya	Scanned	Ch. Ramya
BOOK SIZE	H 10.8 W 7.6	Pages	31

Cutting.

(1) Sandhya.

(2) Yameema.